

దరఖాస్తుల నమోదు సవరణలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

ప్రజా పాలన సేవా కేంద్రాన్ని తనిఖీ చేసిన మేయర్

నవతెలంగాణ-వరంగల్

వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా పాలన సేవా కేంద్రాలను నగర మేయర్ గుండు సుధారాణి మంగళవారం ఆకస్మికంగా సందర్శించి దరఖాస్తుల న మోదు, సవరణలను పరిశీలించారు. ఈ సందర్భం గా మేయర్ మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ పరిధిలో ఉన్న ప్రజలకు ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీకి లబ్ది అందని ప్రజలు ఇచ్చిన దరఖాస్తులు స్వీక రించి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ నందు నమోదు చేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచనలు చేశారు. ఇప్పటివరకు వరకు స్వీకరించిన దరఖాస్తులను తనిఖీ చేసి నమోదు చేసిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రధాన కార్యాలయంలోని రెవెన్యూ, జనన, మరణ, ప్రజారోగ్య, పరిపాలన, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక తదితర విభాగాలను సందర్శించి సిబ్బంది హాజరు పరిశీ లించి నిర్వర్తించే విధులను అడిగి తెలుసుకున్నా రు. విధుల పట్ల అంకితభావంతో పని చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మేయర్ హెచ్చరించారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన దరఖాస్తుదారుల వినతులు త్వరితగతిన పరిష్కరించాలని మేయర్ సూచించారు. మేయర్ వెంట సీఎంహెచ్ ఓ డాక్టర్ రాజేష్, సెక్రెటరీ విజయ లక్ష్మి, ఎస్ఈ కృష్ణారావు తదితరులు ఉన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్..

సంఘ విద్రోహ శక్తులపై ఉక్కు పాదం

జనగామ డీసీపీ రాజా మహేందర్ నాయక్



నవతెలంగాణ-పర్వతగిరి

శాంతియుత సమాజంలో అసంఘటిత ఘటనలకు పాల్పడే సంఘ విద్రోహ శక్తులపై ఉక్కు పాదం మోపుతామని జనగామ డీసీపీ రాజా మహేందర్‌నాయక్ అన్నారు. ఈనెల 7వ తేదీన వరంగల్ జిల్లా రాయపర్తి మండలం బురహన్ పల్లి గ్రామానికి చెందిన సూదుల దేవేందర్‌ను హత్య చేసిన నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని మంగళవారం వర్ధన్నపేట సిఐ కార్యాలయం ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిపి వివరాలను వెల్లడించారు... బురహన్ పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సూదులు దేవేందర్ అదే గ్రామానికి చెందిన నిందితుడు పల్లె మల్లేశంకు గత మూడు సంవత్సరాల నుండి గ్రామ శివారులోని మూడు ఎకరాల భూమి విషయంలో గొడవలు జరుగుతున్నవి. గొడవకు కారణం మొదట అదే గ్రామానికి చెందిన ఎనబోతుల ప్రకాష్ విక్రయిస్తానని తెలుపడంతో దేవేందర్ బ యానా(అడ్వాన్స్) ఇచ్చిన భూమిని కొనుగోలు చేసినాడు. ఆ భూమికి డబ్బులు పూర్తిగా కట్టటం లేదు రిజిస్ట్రేషన్ చేపించుకోవటం లేదు కాబట్టి భూమిని వేరే వాళ్ళకు అమ్ముతానని ప్రకాష్ మల్లేశంతో చెప్పటం వలన నేనే కొంటాను అని పల్లె మల్లేశం ఆ భూమిని కొనుగోలు చేశాడు. అప్పటినుండి మల్లేశం దేవేందర్ మధ్యన భూతగాదాలు మొదలైనవి. 2022 సంవత్సరంలో మల్లేశంపై హత్యా ప్రయత్నం జరుగగా దేవేందర్, అతనితో కొంత మందిపై రాయపర్తి పోలీస్ స్టేషన్ లో హత్యాయత్నం కేసు నమోదు కాగా ప్రస్తుతం కేసు కోర్టులో పరిధిలో ఉంది. కొన్ని రోజుల క్రితం మల్లేశంకు పొలం దగ్గర కరెంట్ షాక్‌కు గురి కాగా అది దేవేందర్ చంపటానికి ప్రయత్నం చేసి ఉంటాడని అనుమానించి, మళ్ళీ నన్ను ఎలాగైనా చంపుతాడనే భయంతో మల్లేశం తన కొడుకు మురళితో చెప్పి ఇద్దరం కలిసి ఎలగైనా దేవేందర్ ను చంపాలని నిర్ణయించుకున్నారు. పథకం ప్రకారంగా మల్లేశం, మురళికి తెలిసిన మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన చెన్న రాయుడు, గోవింద్ మరి కొంత మంది వ్యక్తులతో కలసి ఈ నెల 7వ తేదీన దేవేందర్ ఇంట్లో ఒంటరిగా ఉన్నది గమనించి ఇంటిలోనికి వెళ్లి భారీ సుత్తె (హ్యామ్మర్)తో దేవేందర్ తలపై కొట్టి చంపారు. అక్కడే ఉన్న సిసి కెమెరాకు సంబందించిన డివిఆర్, దేవేందర్ యొక్క ఫోన్ పట్టుకొని అక్కడనుండి పారిపోయినారు. పోలీసు వారు హంతకుల కోసం గాలిస్తున్నారని తెలిసి మల్లేశం, చెన్న రాయుడు, గోవింద్ పోలీసుల ముందు లొంగిపోయారు. పరారీలో ఉన్న మురళి అతనితో పాటు కొంత మంది వ్యక్తుల కోసం పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి గాలిస్తునారని వివరించారు. నేరాలకు పాల్పడిన వ్యక్తులు ఎంతటి వారైనా వదిలిపెట్టేది లేదని తెలిపారు. ఈ సమావేశంలో వర్ధన్నపేట ఏసీపి అంబటి నర్సయ్య, సీఐ సూర్యప్రకాష్, వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నోటీసులతో ప్రజలు ఆందోళన చెందవద్దు

20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర

నవతెలంగాణ-కాశిబుగ్గ



చిన్న వడ్డేపల్లి చెరువు పరిసర ప్రాంత ప్రజలు తమకు వచ్చిన నోటీసులపై ఆందోళనకు గురి కావద్దని 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ అన్నారు. మంగళవారం 20వ డివిజన్ లో కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ సందర్శించారు. ఈసందర్భంగా పలువురు చిన్న వడ్డేపల్లి చెరువు పరిసర ప్రాంత ప్రజలు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ వారు తమకు నోటీసులు ఇవ్వడంతో తాము ఆందోళనకు గురవుతున్నట్లు కార్పోరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన కార్పోరేటర్ సమస్యను ఫోన్ ద్వారా మంత్రి కొండ సురేఖ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ వారు ఇచ్చిన నోటీసుల విషయంతో ప్రజలు ఆందోళన చెందుతున్న విషయాన్ని మంత్రి కొండ సురేఖ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన మంత్రి మున్సిపల్ అధికారులతో మాట్లాడి మరోసారి ఈ ప్రాంతాన్ని పరిశీలించాలని సూచించినట్లు తెలిపారు. నోటీసులు వచ్చిన ప్రజలు ఎవ్వరు ఆందోళన చెందవద్దని, సమస్య పరిష్కారం దిశగా తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో శాంతినగర్ కాంగ్రెస్ నాయకులు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్‌కు శుభాకాంక్షల వెల్లువ..

నవతెలంగాణ-చెన్నారావుపేట



నర్సంపేట మార్కెట్ కమిటి చైర్మన్ గా మూడోసారి ఎన్నికైన పాలాయి శ్రీనివాస్‌ను మండలంలోని మొగ్దుంపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా, నమ్మిన నాయకునికి బంటుగా ఎన్నో కష్ట నష్టాలకోర్చి, అవకాశం వచ్చినా కూడా నమ్మిన నాయకుని కోసం మాట తప్పకుండా, మడమ తిప్పకుండా, వీర విధేయుడుగా నిలిచినందుకు ముచ్చటగా మూడోసారి నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ఎన్నిక కావడం సంతోషకరమన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చీకటి స్వరూప ఓదయ్యగౌడ్, మాజీ ఉప సర్పంచ్ చందావత్ తిరుపతి నాయక్, సొసైటీ డైరెక్టర్ ఇస్లావత్ గోపి నాయక్, కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు వరంగంటి కుమారస్వామి, ఉపాధ్యక్షులు ఇస్లావత్ నరాన్, శానపల్లి నవీన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొమ్ము కట్టయ్య, గన్నోజు రవీంద్రచారి, అల్లి అశోక్, పల్లకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

20 ఫీట్లకు చేరిన పాకాల నీటిమట్టం..

నవతెలంగాణ-ఖానాపురం



గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు 15 ఫీట్లు ఉన్న పాకాల సరస్సు నీటిమట్టం 20 ఫీట్లకు చేరింది. పాకాల సరస్సు నీటిమట్టం మొత్తం సామర్థ్యం 31 ఫీట్లు కలిగి ఉండగా.. ఇంకా 11 ఫీట్ల నీరు పాకాల సరస్సుకు చేరితే సరస్సు అలుగు పోస్తుంది. చుట్టూ ఉన్న పిల్ల కాలువల ద్వారా వరద నీరు పాకాల సరస్సుకు చేరుతుంది. పాకాల సరస్సు అందాలను తిలకించడానికి ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది పర్యాటకులు వస్తుంటారు. గతంలో చుట్టుపక్కల ఉన్న ఎంతోమంది ప్రజలు, వ్యవసాయదారులు ప్రతి వర్షాకాలంలో పాకాల సరస్సు అందాలను తిలకించడంతోపాటు పాకాల కట్టపై నెలకొన్న కట్ట మైసమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకునేవారు. కాగా ప్రస్తుతం అధికారులు పర్యాటకులకు పలు ఆంక్షలు విధించడంతోపాటు, ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్న క్రమంలో పర్యాటకుల రద్దీ తగ్గిపోయింది. వ్యవసాయ ఆధారిత రైతుల పంట పొలాలకు నీరు అందడానికి పాకాల సరస్సు ప్రధానమైనది. రెండు పంటలకు సరిపోను నీరు పాకాల సరస్సులో అందుబాటులో ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

హైకోర్టు ఆదేశాల మేరకు 'గ్రేటర్ వరంగల్'లో ఎఫ్‌టీఎల్ పేరిట నోటీసులు...



1.094 మంది యజమానులకు..

ప్రభుత్వ భవనాలకు వర్తించవా..?

ఆందోళనలో గుడిసెవాసులు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి :

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టిఎల్) పరిధిలో వున్న నిర్మాణాల యజమానులకు మున్సిపల్ అధికారులు హైకోర్టు ఆదేశాలలో భాగంగా నోటీసులు జారీ చేశారు. 7 రోజుల్లో మీ నిర్మాణాలకు సంబంధించిన ధృవీకరణ పత్రాలను సమర్పించాలని కోరారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. దీంతో గృహ యజమానులు ఆందోళన చెందుతున్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వరంగల్‌లోని భద్రకాళి చెరువు, చిన్న వడ్డెపల్లి చెరువు, కోట చెరువు, బంధం చెరువులకు సంబంధించి సుమారు 1.094 మందికిపైగా గృహ యజమానులకు నోటీసులిచ్చారు. ఈ చెరువుల ఎఫ్‌టిఎల్ పరిధిలో సిపిఐ, సిపిఐ(ఎం)ల ఆధ్వర్యంలో నిరుపేదలు గుడిసెలు వేసుకున్న ప్రాంతాలుండడం గమనార్హం. లేక్ ప్రొటెక్షన్ కమిటీ నేతృత్వంలో రెండేళ్ల క్రితం వరంగల్ నగరంలో చెరువులు, కుంటలు, ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌ల పరిధిలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వరంగల్ నగరంలోని భద్రకాళి, చిన్నవడ్డేపల్లి, కోట చెరువులతోపాటు కాజీపేటలోని బంధం చెరువు ప్రాంతంలో సుమారు 1,094 మందికిపైగా గృహ యజమానులకు నోటీసులివ్వడం కలకలం రేపింది. నోటీసులందుకున్న వారు మున్సిపాల్టీ అనుమతితో నిర్మించారా ? అనుమతి లేకుండా నిర్మించారా ? అని నిర్ధారించుకున్నాక తదుపరి చర్యలు తీసుకోవాలని అధికారులు భావిస్తున్నట్లు సమాచారం. కాజీపేటలోని బంధం చెరువు పరిసర ప్రాంతాలు రెవెన్యూ కాలనీ, ప్రగతినగర్, విడోస్ కాలనీ, నాగేంద్రనగర్ ప్రాంతాల్లో సుమారు 800 మందికిపైగా నోటీసులు జారీ చేశారు. రెవెన్యూ కాలనీలో 1994లో నాడు మంత్రి కడియం శ్రీహరి చేతుల మీదుగా 400 మందికి పట్టాలివ్వగా వారందరూ ఇండ్లు నిర్మించుకున్నారు. వారికి సైతం నోటీసులు ఇచ్చారు.

ప్రభుత్వ భవనాలకు వర్తించవా..?

కాజీపేట ప్రాంతంలో బంధం చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలోనే వరంగల్ డిఆర్‌డిఓ కార్యాలయం, కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయం, తిరుమల తిరుపతి దేవస్థానానికి సంబంధించి బధిరుల పాఠశాలలున్నాయి. పోలీసు శాఖకు చెందిన ఫోరెన్సిక్ ల్యాబ్ కూడా ఇదే ప్రాంతంలో వుంది. ఎఫ్‌టిఎల్ పరిధిలో వున్న ఈ భవనాలకు కూడా అవే నియమ, నిబంధనలు వర్తింపచేస్తారా ? అని నోటీసులందుకున్న నగరవాసులు ప్రశ్నిస్తున్నారు.

తుది దశలో మరింత సమయం..

నోటీసులు అందుకున్న వారు సమర్పించే ధృవీకరణ పత్రాల ఆధారంగా అవసరమైతే మరోసారి నోటీసులు జారీ చేయాలని అధికారులు భావిస్తున్నట్లు సమాచారం. అప్పటికీ స్పందించకపోతే చర్యలు తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తుంది. ఏదేమైనా పెద్ద సంఖ్యలో గృహ యజమానులకు నోటీసులు ఇవ్వడం నగరంలో చర్చనీయాంశంగా మారింది.

రెండేళ్ల క్రితమే నిర్ణయం..?

రెండేళ్ల క్రితం మార్చి మాసంలోనే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) పరిధిలో లేక్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వరంగల్, హన్మకొండ జిల్లా కలెక్టర్లు, నీటిపారుదల శాఖ, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ శాఖ, రెవెన్యూ, 'కుడా' అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలోనే నగరంలోని చిన్నవడ్డేపల్లి, కోట చెరువులు, భద్రకాళి, బంధం చెరువు, వడ్డేపల్లి చెరువు, భట్టుపల్లి చెరువు, ఉర్సు చెరువుల పరిధిలో ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌ల పరిధిలో అక్రమ నిర్మాణాలను తొలగించి చెరువులను పరిరక్షించాలని నిర్ణయించారు.

హైకోర్టు ఆదేశాల మేరకే..

సిటీ ప్లానర్ వెంకన్న, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్

హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకే ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ పరిధిలోని నిర్మాణాల యజమానులకు నోటీసులు ఇచ్చాం. 7 రోజుల్లో వారి వద్దనున్న భూమి పత్రాలు, భవన నిర్మాణ అనుమతి పత్రాలను సమర్పిస్తే వాటిని పరిశీలించి నిర్ణయం తీసుకుంటాం.

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 282 చెరువులను పరిరక్షించాల్సి వుంది. అదే క్రమంలో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ పరిధిలో వున్న 1000 చెరువుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని రెండేళ్ల క్రితమే లేక్ ప్రొటెక్షన్ కమిటీ నిర్ణయం తీసుకుంది. దశలవారీగా ఈ చెరువులు, కుంటల ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్‌లలో ఆక్రమణలను తొలగించి వీటిని పరిరక్షించాలని భావించారు. తొలిదశలో 15 ముఖ్యమైన చెరువుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆ కమిటీ గతంలోనే నిర్ణయం తీసుకుంది.

ప్యాక్స్ బలోపేతానికి రూ.460 కోట్ల రుణాలు మంజూరు...

అపెక్స్ బ్యాంకు చైర్మెన్ మార్నేని రవీందర్‌రావు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి :



నిర్బర్ భారత్ అభియాన్ కింద 50 సంఘాల ఆర్థిక బలోపేతానికి నాబార్డ్ రూ.460 కోట్ల రుణాలను మంజూరు చేసిందని తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు చైర్మెన్ మార్నేని రవీందర్‌రావు తెలిపారు. సోమవారం వరంగల్ డిసిసిబిలో నాబార్డ్ ఆధ్వర్యంలో వాణిజ్య బ్యాంకులు, డిసిసిబిలకు 'జోనల్ వర్క్ షాప్ ఆన్ బిజినెస్ అపర్చునిటీస్ ఇన్ ఫామ్ సెక్టార్ అండ్ నాన్ ఫామ్ సెక్టార్' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ముఖ్య అతిథిగా మార్నేని రవీందర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాబార్డు గత నాలుగేండ్లుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్యాక్స్ మరియు వ్యవసాయ రైతు సేవా సహకార సంఘాల కేంద్రాలుగా ఏర్పడి నిర్బర్ భారత్ అభియాన్ పథకం కింద 50 సంఘాలకు వివిధ రకాలైన గోదాములు, కోల్డ్ స్టోరేజీలు, అగ్రి ఔట్‌లెట్‌లు, కార్యాలయాలు, రైస్ మిల్లులు, పెట్రోల్ పంప్‌లకు రుణాలు మంజూరు చేశారన్నారు. వరంగల్‌లో 68 గోదాములున్నాయని ఎఎంఐ సబ్సిడీ కింద రూ.1 కోటీకిపైగా 42 ప్రాజెక్టులకు విడుదలయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ జీఎం ఉషా, సీఈఓ వజీర్ సుల్తాన్, పౌల్ట్రీ ఫార్మ్ అధ్యక్షులు మార్తినేని ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వర్తించాలి: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు





నవతెలంగాణ-పర్వతగిరి

మండలం లోని వివిధ శాఖల అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలనిని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సూచించారు. వర్ధన్నపేట పట్టణం లోని క్యాంప్ కార్యాలయం లో మంగళ వారం వర్ధన్నపేట మండల పరిధిలోని వివిధ శాఖల అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈసం దర్భంగా మాట్లాడుతూ వారికి తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జోనా, ఎంపీడీఓ వెంకట రమణ, ఎంఈఓ, ఏపివో, అమ్మ ఆదర్శ పాఠశాల మహిళ శక్తి, అంగన్‌వాడీ, డాక్టర్స్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్టీ హాస్టల్ కు మరమ్మత్తులు చేపట్టాలి

అధికారులకు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాలు..

మండల కేంద్రం లోని ఎస్టీ హాస్టల్ కు వెంటనే మరమ్మతులు చేపట్టాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. హనుమకొండ లోని ఆయన నివాసానికి పర్వతగిరి ఎస్టీ హాస్టల్ హెడ్మాస్టర్ సురేష్, హాస్టల్ వార్డెన్ సుధాకర్, ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు మంగళ వారం ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వెంటనే సానుకూలంగా స్పందించి అధికారులతో మాట్లాడి హాస్టల్‌కు కావలసిన వసతులను, మరమ్మత్తులను చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అలాగే గిరిజన విద్యార్థుల వారికి కావాల్సిన వసతులు వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జాటోతు శ్రీనివాస్‌నాయక్, ఎస్టీ సెల్ అధ్యక్షులు భాస్కర్ నాయక్, మండల బీసీ సెల్ నాయకులు వెంక టేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ తరపున కుటుంబాన్ని ఆదుకుంటాం..

ప్రేమోన్మాది దాడిలో మరణించిన కుటుంబానికి మాజీ మంత్రి కేటీఆర్ భరోసా..

నవతెలంగాణ-చెన్నరావుపేట



మండలం లోని పదహారు చింతలతండా గ్రామంలో గత వారం రోజుల క్రితం అర్ధరాత్రి ప్రేమోన్మాది చేతిలో దారుణ హత్యకు గురైన గిరిజన కుటుంబాన్ని ఆదుకునేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముందుకు వచ్చారు. ప్రేమోన్మాది నాగరాజు చేసిన దాడిలో తల్లితండ్రులిద్దరూ శ్రీనివాస్- సుగుణలు చనిపోవటంతో ఆ కుటుంబంలోని ఇద్దరు పిల్లలు దీపిక, మదన్‌లు అనాథలయ్యారు. దాడి ఘటనలో ఇద్దరు పిల్లలు కూడా తీవ్రంగా గాయపడి చికిత్స అనంతరం కోలుకున్నారు. చనిపోయిన దంపతుల పిల్లలిద్దరిని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మంగళవారం కేటీఆర్ వద్దకు తీసుకొచ్చారు. పిల్లలద్దరినీ చూసిన కేటీఆర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వారి ఆరోగ్యం గురించి వాకబు చేసి ధైర్యంగా ఉండాలని మీకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మరణించిన పిల్లల చదువు బాధ్యత తానే స్వయంగా తీసుకుంటానని కేటీఆర్ హామీ ఇచ్చారు. హత్యకు గురైన పిల్లల తల్లి సుగుణ బీఆర్ఎస్ క్రియాశీల కార్యకర్త. గ్రామ పంచాయతీలో వార్డు మెంబర్ కూడా. పార్టీ తరపున కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ.5 లక్షలు ఆర్థిక సాయాన్ని అందించనున్నట్లు కేటీఆర్ తెలిపారు. అత్యంత విషాదకరమైన ఈ సంఘటనలో తల్లిదండ్రులను కోల్పోవటమే కాదు.దాడికి గురైన పిల్లలు దీర్ఘకాలం చికిత్స తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో కుటుంబానికి భరోసా ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం రూ. 50 లక్షలు వారికి ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఈ ఘటనలో నిందితుడు నాగరాజుకు కఠిన శిక్ష పడేలా తగిన చర్యలు తీసుకునేలా డీజీపీకి ఆదేశాలు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనాన్ని నిర్మించాలి

ఏబీఎస్ఎఫ్ , డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ -నర్సంపేట



ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన భవనాన్నినిర్మించాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, డీవైఎఫ్ఐ గడ్డమీది బాలకృష్ణలు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ద్వారకపేట రోడ్డు ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట డీవైఎఫ్ఐ ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బురదలో బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 350 మంది పేద విద్యార్థులు విద్య కోసం వివిధ మండలాల నుండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకుంటున్నారన్నారు. కళాశాల భవనం శిథిలావస్థలో ఉందన్నారు. విద్యార్థులు భయం గుప్పెట్లో తరగతులకు హాజరు కావాల్సిన పరిస్థితి ఎదురైందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలలో తరగతి గదిలో విద్యార్థులపై పెచ్చులు ఊడిపోవడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్డి, మంచినీటి సౌకర్యం కల్పించాలని సంబంధిత విద్యాశాఖ అధికారులు స్పందించి నర్సంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన భవన నిర్మాణం చేపట్టి విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలన్నారు. అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్, వినయ్, శ్రీకాంత్, ప్రసాద్, రఘు, శ్రీధర్, మురళి, ప్రవళిక, భాగ్య లక్ష్మి, రజియా, కావ్య శ్రీ,అనిత, సుమలత తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రైవేట్ ఆస్పత్రుల్లో.. ఆకస్మిక తనిఖీలు

జిల్లా వైద్యాధికారి ఆలం అప్పయ్య

నవతెలంగాణ-ఏటూర్ నాగారం ఐటీడీఏ



ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రులను జిల్లా వైద్యాధికారి ఆలం అప్పయ్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. పాషా హాస్పిటల్‌ను తనిఖీ చేసి పరిశీలించారు. ఆసుపత్రి నిర్వాహకులకు ఆసుపత్రిని క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ లో పేర్కొన్న దాని ప్రకారంగా నడపాలని ఆదేశించారు. పేషంట్ కేస్ షీట్ ను ఇన్ పేషెంట్లకు తప్పనిసరిగా పేషెంట్ కు సంబంధించిన రికార్డుల్లో పేర్కొనాలని, వ్యాధికి సంబ ంధించిన సమాచారాన్ని పొందుపరచాలన్నారు.ఆసుపత్రి బెడ్స్ స్థాయిని అనుమతి తీసుకున్న దాని ప్రకారం మాత్రమే ఉపయోగించాలన్నారు. ఆసుపత్రిలో పరిశుభ్రత పాటించాలని, మలేరియా డెంగ్యూ, టైఫాయిడ్ లాంటి సంక్రమణ వ్యాధులకు సంబంధించిన రోగనిర్ధారణ పరీక్షల్లో పాజిటివ్ అని తేలిన వారు లేదా చికిత్స కొరకు వచ్చిన వారి వివరాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు తెలుపాలని ఆదేశించారు. పాషా హాస్పిటల్ కు నోటీసులను అందించారు. ఇటీవల ప్రారంభించబడిన ప్రైవేట్ ఆరాధ్య ఆసుపత్రిని పరిశీలించగా ఎలాంటి అనుమతులు లేవని గుర్తించారు. ఆస్పత్రికి వెంటనే నోటీసు జారీ చేశారు. జిల్లాలో ఎవరైనా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అనుమతి లేకుండా ఆస్పత్రులు, రోగనిర్ధారణ పరీక్షల కేంద్రాలు నిర్వహించినట్లయితే తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2010ప్రకారం శిక్షలకు గురి అవుతారని హెచ్చరించారు. అన్ని అనుమతులను పొందినఅనంతరమే వైద్యం అందించాలన్నారు.

రూ.లక్ష 26 వేల 975 విలువ చేసే 5.097 గంజాయి స్వాధీనం

ఇద్దరి అరెస్ట్..

నవతెలంగాణ-వెంకటాపురం



గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి వద్ద నుంచి రూ.లక్ష 26 వేల 975 విలువచేసే 5.097 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ బండారి కుమార్, ఎస్సై కె.తిరుపతి రావుతో కలిసి వివరాలు వెల్లడించారు. మండల కేంద్రంలోని చొక్కాల గ్రామ సమీపంలో పాలెం ప్రాజెక్టు రోడ్డులో గంజాయి విక్రయిస్తున్నారని విశ్వసనీయ సమాచారం అందింది. సమాచారం మేరకు పోలీసులు ఆ ప్రాంతంలో తనిఖీలు చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. వారిని అదుపులో లోకి తీసుకున్న పోలీసులు వారిని విచారించగా. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంకు చెందిన లక్ష్మణ్, నరేష్‌గా గుర్తించారు. వారి వద్ద నుంచి 5.097 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. యువత చెడు వ్యసనాలకు బానిసై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, గంజాయి విక్రయించినా, సేవించిన పోలీసులకు సమాచారం అందించాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీస్‌లతో సమానం: ఎస్సై

సీసీ కెమెరాల పై అవగాహన

నవతెలంగాణ-తాడ్వాయి

నేరాల నియంత్రణలో గ్రామాల సంరక్షణలో సీసీ కెమెరాలు పాత్ర కీలకమని తాడ్వాయి స్థానిక ఎస్సై ననిగంటి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కామారం (పీటీ) గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, వాటి ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని తెలిపారు. సీసీ కెమెరాలు ఉన్న ప్రాంతంలో నేరగాళ్ల ఆటలు సాగవన్నారు. దొంగతనం కేసులను ఆక్సిడెంట్ కేసులలో, శాంతిభద్రతలను విఘాతం కలిగించిన కేసులు, ఈవ్ టీజింగ్ కేసులను అనేక కేసులను తక్కువ సమయంలో ఛేదించవచ్చన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పట్టణ సుందరీకరణ, అభివృద్ధికి సహకరించాలి

- విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు
- పరకాల ఎమ్మెల్యే ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి



నవతెలంగాణ-పరకాల

నగర సుందరీకరణ అభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. మంగళవారం వర్షాకాలం దృష్ట్యాలోతట్టు ప్రాంతాలు ముంపుకు గురవుతున్నాయని సంబంధిత శాఖల అధికారులతో పట్టణంలోని దామర చెరువు మత్తడి కాలువ, మాదారం, బంధం రోడ్డు కల్వర్టు, యూనియన్ బ్యాంకు డ్రైనేజ్, భూపాలపల్లిరోడ్డుకల్వర్టు, పద్మశాలీ వాడ, పోచమ్మగుడి డ్రైనేజీ ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ వర్షాకాల నేపథ్యంలో వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా తగుచర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా అక్రమణలకు గురైన నాళాలను డ్రైనేజీ వ్యవస్థను అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులను వెంటనే గుర్తించి పట్టణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకొని పనులను ప్రారంభించాలని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న అత్యవసర సమస్యలను గుర్తించి వేగవంతంగా పరిష్కారం అయ్యేందుకు కృషిచేసేలా చూడాలన్నారు. దామరచెరువు మత్తడి కాలువ నాలపై ఉన్న అక్రమణాలను తొలగించే విషయంలో కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. చెరువుకట్ట పటిష్టతకు చేపట్టాల్సిన పనులను అంచనాలతో సహారూపొందించుకోవాలన్నారు. కబ్జాదారులు ఎంతటి వారినైనా వదిలిపెట్టవద్దని, ఎలాంటి ఒత్తిడిలకు తలొద్దని, అక్రమణాలను తొలగించి నాళాల విస్తరణకు పనులను చేపట్టాలన్నారు. గత పాలకులు స్వలాభం కోసం ప్రారంభించిన పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి వెంటనే ప్రణాళికలను రూపొందించి పనులు చేయాలని అధికారులను కోరారు. మురికి కాలువల అక్రమణాలను వెంటనే తొలగించి మురికినీరు ఆగకుండా యథావిధిగా ఉండేలా చర్యలు చేపట్టాలని, అధికారులు తమ బాధ్యతల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని కోరారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్య మొలుగూరి బిక్షపతి ,మున్సిపల్ చైర్ పర్సన్ సోద అనితరామకృష్ణ, ఆర్డీఓ నారాయణ, ఏసీపీ కిషోర్ కుమార్, వివిధశాఖల అధికారులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు గద్దె నిర్మించాలని ఏడీఈకి రైతుల వినతి




నవతెలంగాణ-శాయంపేట

శాయంపేట గ్రామంలోని రంగనాయకుల బోటి సమీపంలోని వ్యవసాయ బావుల వద్ద ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్ గద్దెను నాసిరకం ఓడలతో నిర్మాణం చేపట్టారు. వర్షాలకు తడిసిఓడలు నానిచిట్లి పోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ నేల మీదికి జారి విద్యుత్ వైర్ల మీదనే నిలబడింది. రైతులు ట్రాన్స్‌ఫార్మర్ కింద పడకుండా కర్రను సపోర్టుగాపెట్టారు. ఇదే విషయమై పలుమార్లు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు రైతులు తెలిపారు. మంగళవారం శాయంపేట గ్రామానికి వచ్చిన ఎన్పీడీసీఎల్ ఏడిఈ దేవేందర్‌నాయక్‌ను రైతులు గాజే చిరంజీవి, కందికొండ శంకర్, చెల్పూరి రవి, సాదు రాజులు కలిసి సమస్యను విన్నవించారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం ఓడలతో నిర్మాణం చేపట్టారని, ఇటీవల కురిసిన వర్షాలకు ఓడలు చిట్లిపోయి ట్రాన్స్‌ఫార్మర్ నేల మీదికి జారితీగలపై ఆధారపడి ఉందని, దానికి సపోర్టు కర్ర అమర్చామని తెలిపారు. ప్రమాదాలు జరగకుండా శాశ్వతంగా ట్రాన్స్‌ఫార్మర్ గద్దె నిర్మించాలని వేడుకున్నారు. దీనిపై స్పందించిన ఏడిఈ దేవేందర్ నాయక్ సంబంధిత కాంట్రాక్టర్‌తో ఫోన్లో మాట్లాడి వెంటనే సిమెంట్ పిల్లర్ తో గద్దె నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్ సిబ్బందిని అక్కడికి వెళ్లి పరిశీలించాలని ఆదేశించారు. వ్యవసాయ భూములలో పంట సాగు చేస్తుండడంతో వాహనం వెళ్లే పరిస్థితి ఉండదని, మెటీరియల్ రోడ్డుమీదికి తీసుకొని వస్తే కూలీలతో తామే ట్రాన్స్‌ఫార్మర్ నిర్మాణ స్థలం వరకు మెటీరియల్ చేరవేస్తామని రైతులు తెలిపారు. త్వరలోనే ట్రాన్స్‌ఫార్మర్ గద్దె నిర్మాణం పూర్తవుతుందని తెలపడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

కార్యదర్శి నుండి నిధులు రికవరీ చేయాలి

నవతెలంగాణ-శాయంపేట

మండలంలోని కొప్పుల గ్రామ పంచాయతీ కార్యదర్శి గోరంటల దినేష్ జిపి నిధులు స్వాహా చేశాడని, జిపి నిధులపై విచారణ చేపట్టి అతని నుండి డబ్బులు రికవరీ చేయాలని మాజీ ఎంపీటీసీ మేకల శ్రీనివాస్ అధికారులను కోరారు. మండల కేంద్రంలో మంగళవారం మాజీ ఎంపిటిసి మేకల శ్రీనివాస్ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి దినేష్ 2020 - 2024 జూన్ వరకు ఇంటి, నల్లా పన్నుల లెక్కలు గ్రామపంచాయతీ పాలకవర్గ సమావేశంలో, గ్రామ సభలో చూపకుండా డబ్బులు కాజేసినట్లు ఆరోపించారు. జిపి లెక్కలపై విచారణ చేపట్టి, అతని వద్ద నుండి జిపి నిధులు రికవరీ చేయాలని, అతడిని సస్పెండ్ చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. ఇదే విషయమై సోమవారం ఎంపీడీవో ఫణి చంద్రకు పంచాయతీ కార్యదర్శి దినేష్ పై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై ఎంపీడీవో సానుకూలంగా స్పందించి విచారణ చేపడతామని తెలియజేసినట్లు తెలిపారు.

ఘనంగా మొహరం వేడుకలు

నవతెలంగాణ-ఎల్కతుర్తి



మొహర్రం పండుగ పురస్కరించుకొని మండలంలోని, దామర, సూరారం, దండేపల్లి, ఎలకతుర్తి గ్రామాల్లో, మసీద్ వద్ద ఉన్న అగ్నిగుండం చుట్టూ పీరీలను ఎత్తుకొని తిరిగి, గ్రామములో పర్యటించారు. మతపెద్ద ఎండి సిరాజు ద్దీన్ మాట్లాడుతూ, భక్తుల కోరిక తీర్చడానికి ఇంటింటికి వెళ్లి పీరిలతో ఆశీర్వాదాన్ని అందజేశారు. తమ కోరిక నెరవేర్చాలంటూ కొబ్బరి కుడుకులను నూతన వస్త్రంలో గట్టి మొక్కుతే, కోరికలు నెరవేరతాయని నమ్మకం. ఈపండుగ మూడు రోజులపాటు ఉంటుందన్నారు.

ఈ కార్యక్రమంలో షఫీ, జలీల్, కాసిం, పాషా, లియాకతలి, అక్బర్, అహ్మద్‌బాషా, యాకూబ్ పాషా తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీల్లో చిన్నారులకు ఆట,పాటలతో కూడిన విద్య

నవతెలంగాణ-పరకాల



చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య నాణ్యమైనదని ఐసిడిఎస్ సూపర్వైజర్ హేమలత అన్నారు. మంగళవారం అమ్మబాట అంగన్వాడి బడిబాట కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15 నుండి 20 వరకు నిర్వహిస్తున్న ఆరు రోజుల కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని సీఎస్ఐ ,ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో పర్యటించి అమ్మబాటే - అంగన్‌వాడీ బడిబాట ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్ల ద్వారానే చిన్నారులకు పటిష్టమైన విద్యాబుద్ధులు అందించబడతాయని అన్నారు. గర్భిణీలు, బాలింతలు, కిషోర్ బాలికలకు పౌష్టికాహార పట్ల అవగాహన కల్పించారు. అదేవిధంగా చిన్న పిల్లల బరువు, ఎత్తు, ఆరోగ్య పరిస్థితి ప్రతినెల పరిశీలించే విధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అంగన్వాడీ టీచర్లను కోరారు.

ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు మడికొండ భాగ్యలక్ష్మి, ఎలిజబెత్, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇండ్ల కూల్చివేత ఆలోచన విరమించుకోవాలి

- పేదలకు ఇచ్చిన నోటీసులను వెనక్కి తీసుకోవాలి
- సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి



నవతెలంగాణ-నయింనగర్

గత 30 సంవత్సరాలుగా పేదలు వివిధ ప్రాంతాలలో ఇళ్ల నిర్మాణం చేసుకొని నివాసముంటున్న ఇండ్లకు ఎఫ్‌టిఎల్‌పరిధిలో ఉన్నాయనే పేరుతో మునిసిపాలిటీ అధికారులు పేదలకు నోటీసులు ఇచ్చి ఏడురోజుల్లో కూల్చి వేస్తామనే ఆలోచన తక్షణమే విరమించుకోవాలని సీపీఐ (ఎం) హనుమకొండ జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి, జిల్లాకార్యదర్శివర్గ సభ్యులు సారంపల్లి వాసుదేవా రెడ్డిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం హనుమకొండలోని ప్రగతినగర్, నాగేంద్రనగర్‌లోని 30 ఏళ్ల క్రితం ఇళ్లను నిర్మించుకుని నివాసముంటున్న మున్సిపాలిటీ నుండి సుమారు 200 మంది పేదలకు మంగళవారం నోటీసులు ఇచ్చారని తెలిసి పేదలందరినీ కలిసి మనోధైర్యం కల్పించి ఇండ్ల పరి రక్షణకోసం పోరాటం చేయాలని వారు సూచించారు.

హనుమకొండ మహానగరంలో అనేక చెరువులు కుంటలు పెద్ద పెద్ద బకాసురులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి భూములను కబ్జా చేశారని ఇలాంటి వారిని వదిలేసి పేదలు నివాసం ఉంటున్న ఇండ్లను మాత్రమే కూల్చాలని ఆలోచన అత్యంత దుర్మార్గమైనచర్య అన్నారు. నిజంగానే ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే చెరువులు, కుంటలకు మొదటగా హద్దులునిర్ణయించి దాని పరిధిలో ఆక్రమించిన బడాబాబుల ఇండ్లకు నోటీస్ ఇవ్వకుండా, ఇండ్ల కిరాయిలు కట్టలేక ఇబ్బందులు పడుతు 60గజాల స్థలంలో ఇల్లు నిర్మాణం చేసుకొని నివాసముంటున్న పేదల ఇళ్లకు నోటీసులు ఇచ్చి కూల్చివేస్తామని చెప్పడం ద్వారా నగరంలో ఉన్న వేలాది మంది పేదలు రోడ్డునపడే అవకాశం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

జి ల్లాలో ఉన్న మంత్రులు ఎమ్మెల్యేలు తక్షణమే జోక్యం చేసుకొని మున్సిపాలిటీ అధికారులతో మాట్లాడి నోటీసులు ఆపి పేదలు వేసుకున్న ఇండ్లకు పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టాలని వారు సూచించారు. లేనిపక్షంలో సీపీఐ (ఎం) పార్టీ ఆధ్వర్యంలో పేదలందరిని సమీకరించి పెద్దఎత్తున ఆందోళన, పోరాటాలను ఉధృతం చేస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కారు ఉపేందర్, మంద మల్లేశం, బోట్ల కుమారస్వామి, పాపయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

కులవివక్ష పేదరికం ఉన్నంతవరకు రిజర్వేషన్‌లు ఉండాలి

- ఆధిపత్య సంస్కృతిని రూపుమాపాలి
- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ.స్కైలాబ్‌బాబు



నవతెలంగాణ-సుబేదారి

కుల వివక్ష, అంటరానితనం, పేదరిక నిర్మూలన జరిగే వరకు రిజర్వేషన్లు యధావిధిగా కొనసాగాలని, అన్నిరకాల అసమానతలను అంతం చేసే సామాజిక న్యాయపోరాటంలో అందరూ భాగస్వాములు కావాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదృ టి స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ జిల్లాలోని దీపా విద్యుత్‌భవన్‌లో నిర్వహించిన రెండవరోజు రాష్ట్రస్థాయి సామాజిక శిక్షణా తరగతుల్లో స్కైలాబ్‌బాబు మాట్లాడారు. 77ఏండ్ల స్వాతంత్ర్యం, 74 ఏండ్ల భారత రాజ్యాంగం తర్వాత కూడా కుల వివక్ష, అంటరానితనం చాపకింద నీరులా ప్రవహిస్తున్నదన్నారు. ఆర్థిక అసమానతలు తొలిగిపోకుండా కులవివక్ష, అంటరానితనం రూపుమాపడం సాధ్యం కాదన్నారు. భూమి, విద్య, ఉద్యోగం రాజకీయ రంగాల్లో అట్టడుగు ప్రజలకు అన్ని రకాల అవకాశాలు కల్పించడం ద్వారా సామాజిక న్యాయాన్ని సాధించాలన్నారు. నేటి పాలకులు ఎన్నికల సందర్భంలో ఇస్తున్న భూటకపు వాగ్దానాలు పేదల బతుకులను సమూలంగా మార్పు చేయలేవన్నారు. అంబేద్కర్ చెప్పినట్లుగా భూమి జాతీయకరణ పరిశ్రమల్లో కార్మికులకు యాజమాన్య వాటాహక్కుకోసం పోరాడాలన్నారు. రిజర్వేషన్లు రద్దు చేయడానికి బీజేపీ పరోక్షంగా ప్రయత్నాలు చేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెడుతూ సామాజిక న్యాయాన్ని సమాధి చేస్తుందన్నారు. రాజ్యాంగం రద్దుకు బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల ప్రమాదం నేటికీ పొంచి ఉందన్నారు.

విద్యాఉపాధి అవకాశాలు కల్పించకుండా మతాలు,కులాలు, దేవుళ్ళు వంటి విషయాలను రాజకీయాలతో ముడిపెట్టి పబ్బంగడుపుకుంటున్నారని విమర్శించారు. కుల నిర్మూలన కోసం కృషి చేయడానికి ప్రతీఒక్కరు నడుంబిగించాలన్నారు. కేంద్ర రాష్ట్ర పాలకులు ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను చిత్తశుద్ధితో అమలు చేయాలన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో 'గతి తార్కికభౌతికవాదం' అనే అంశంపై సీనియర్ ఉపాధ్యాయులు మిరియం వెంకటేశ్వర్లు, 'మతోన్మాదం-ప్రతిఘటనపద్ధతులు' అనేఅంశంపై ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్ బోధించారు. కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు నాగార్జున ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంద సంపత్ నందిపాటి, మనోహర్, ఆరూరి కుమార్, పల్లెర్ల లలిత, డి.రాధాకృష్ణ, టి.సురేష్ దుర్గం, దినకర్, కోట గోపి, డి.రామ్మూర్తి, బొట్ల శేఖర్, ఎం.ప్రకాష్, శరత్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఓరుగంటి సాంబయ్య, జిల్లానాయకులు దూడేపాక రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా

విద్యార్థులు ఉన్నతశిఖరాలు అధిరోహించి కాకతీయ విశ్వవిద్యాలయ కీర్తి ప్రతిష్టలు పెంచాలని కాకతీయ విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాలప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.ప్రసాద్ అన్నారు. విశ్వవిద్యాలయ బి.ఫార్మసీ చివరి సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు సమావేశ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కాకతీయ విశ్వవిద్యాలయఫార్మసీ విద్యార్థులు ఖండాంతరాల్లో ఉన్నార ని, ఎన్నో ప్రముఖ సంస్థల్లో ప్రధాన భూమికపోషిస్తున్నారన్నారు. కేవలం ఉద్యోగం వైపేలక్ష్యం ఉండకూడదన్నారు.

ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ప్రజాసంబంధాల అధికారి డాక్టర్ పృథ్వీరాజ్ వల్లాల చేత ప్రాంగణ నియామకాల పైఅవగాహనా సెషన్‌లో 'ప్రాంగణ నియామకాల్లో పాటించవలసిన మెలుకువలు' తెలిపినట్టు ఆచార్య ప్రసాద్ వెల్లడించారు. ముఖ్యంగా చివరి సంవత్సరం విద్యార్థులు ప్రాంగణ నియామకాలు,గ్రూప్ డిస్కషన్, రోల్ ప్లే, సమ స్యాపరిష్కారంపై పవర్‌పాయింట్, ఆక్టివిటీలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తో పాటు డీన్ ఆచార్యజి. సమ్మయ్య, అధ్యాపకులు ఆచార్య జే.కృష్ణవేణి, డాక్టర్ స్వరూపరాణి, ఒప్పందఅధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కేయూ నూతన హెచ్‌ఓడీల బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

కేయూ ఇంచార్జ్ వీసీ వాకాటి కరుణ అనుమతితో నూతనంగా ఏర్పాటు చేసిన మెకానికల్, కంప్యూటర్ సైన్సు, ఈఈఈ, ఈసిఎ ఇంజనీరింగ్ విభాగాల విభాగాల నూతన విభాగ అధిపతులు డాక్టర్, సిహెచ్.రాధిక, డాక్టర్ ఎస్.రమణ, డాక్టర్ కే.భిక్షాలు, డాక్టర్ టి.జగన్మోహన్‌రాజు బాధ్యతలు స్వీకరించారు, అనంతరం రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి బాధ్యతలు, అధికారాలు, హోదాలను వివరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఓడీలు వైస్‌ఛాన్సలర్‌కి తమ కృతజ్ఞతలు తెలిపారు. సహాయ రిజిస్ట్రార్, ప్రణయ కుమార్, డాక్టర్ కోలా శంకర్ పాల్గొన్నారు.



గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన

నవతెలంగాణ-పరకాల



ప్రభుత్వం నిషేధించిన గంజాయి, మాదకద్రవ్యాల అనర్థాలపై విద్యార్థులకు ఎక్సైజ్ సీఐ తాతాజీ అవగాహన కల్పించారు. మంగళవారం పట్టణం లోని స్థానిక ఎస్‌వీ జూనియర్, డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు గంజాయి మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా ఎక్సైజ్ సిఐ తాతాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ విద్యతో ఉద్యోగ భద్రతకు ఎంతో తోడ్పాటునిస్తుందని, ఈ సమయంలోనే విద్యార్థులు యువత చెడు అలవాట్లకు బానిసకావద్దన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదివితే అనుకున్నది సాధించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ప్రభుత్వం నిషేధించబడిన డ్రగ్స్, మాదకద్రవ్యాల జోలికి వెళ్లకూడ దని, ఎవరైనా ప్రేరేపింపబడి నట్లైతే ఆ వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీ కళాశాలల అధినేత డాక్టర్ సిరికొండ శ్రీనివాసచారి, ఎక్సైజ్ ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ జీవోను ప్రయోజనకరంగా సవరించాలి

- సీపీఐ (ఎం) మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య

నవతెలంగాణ-ఐనవోలు



రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.567 2024 జూలై 15 ప్రకారం రైతుల రుణ మాఫీకి రూపొందించిన నిబంధనలలో గల అంశాలను సవరించి 2లక్షల వరకు రుణం పొందిన రైతులకు లబ్ధికలుగునట్లు సవరించాల్సిందిగా సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ జీవో ప్రకారం రేషన్‌కార్డు ఆధారితంగా ఉన్నవారందరినీ ఒకే కుటుంబంగా పరిగణించి, కుటుంబంలో ఒక వ్యక్తికే రుణమాఫీ వర్తింపజేయడం వలన కుటుంబంతో విడిపడినవారికి రుణమాఫీ వర్తించదన్నారు. ఆధార్‌కార్డు, పాస్ బుక్ డేటా, పిడిఎస్(రేషన్‌కార్డు డేటా) ఒకటిగా ఉన్న వారికే వర్తింపచేశారు. ఆధార్‌కార్డు లేనివారు, పాస్‌బుక్, రేషన్‌కార్డు లేని కుటుంబాలు లక్షల్లో ఉన్నాయని పాసుపుస్తకాల కొరకు ఇప్పటికే ధరణిలో 12లక్షల మంది దరఖాస్తు చేసుకున్నట్లు ప్రభుత్వ ప్రజాపాలన సర్వేలో తేలిందన్నారు. పిఎం కిసాన్ డే టాకు రుణమాఫీని జోడించడం వలన చాలా మంది రైతులు రుణమాఫీ అర్హత కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో 72లక్షల మంది రైతులు ఉన్నప్పటికీ బ్యాంకులు 43లక్షల మందికి మాత్రమే అప్పులిచ్చాయని పిఎం కిసాన్ పథకం కింద 31 లక్షల మందికే వర్తింపజేశారు. అందువలన పిఎం కిసాన్ డేటాను వర్తింపజేయడం వలన అర్హత కలిగిన వారు రుణమాఫీ పొం ద లేకపోతున్నారన్నారు. 2018 డిసెంబర్ 12 నుండి 2023 డిసెంబర్ 9 వరకు ప్రకటించిన రుణమాఫీని వర్తింపజేయడానికి కొన్ని బ్యాంకులు జనవరి 2024 నుండి రుణాలను కొత్త రుణాలుగా రీషెడ్యూల్ చేశాయి. గతం నుండి బ్యాంకులు 'బుక్ అడ్జెస్ట్‌మెంట్' ద్వారా రైతులకు రుణాలు పెంచుకుంటూ వ స్తున్నాయని అందువల్ల 2023 డిసెంబర్ 9 తర్వాత రీషెడ్యూల్ చేసిన, బుక్‌అడ్జెస్ట్‌మెంట్ చేసిన రుణాలకు రుణమాఫీని వర్తింపజేయాలని ఇందుకు అనుగుణంగా జీవోను సవరించాలని సీపీఐ (ఎం) డిమాండ్ చేస్తుందన్నారు.

బీసీ బాలుర కళాశాల వసతిగృహం ప్రారంభం

నవతెలంగాణ-నయింనగర్



హనుమకొండ గోకుల్‌నగర్ లోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని ఉన్నతీకరించి ప్రభుత్వ బిసి బాలుర కళాశాల వసతి గృహంగా మంగళవారం వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ హనుమకొండ ఉపసంచాలకులు జి.రాంరెడ్డి పునర్‌ప్రారంభించారు. అనంతరం రాంరెడ్డి మాట్లాడుతూ అర్హులైన ఇంటర్ నుండి పీజీ విద్యార్థులు అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమఅధికారి కే సతీష్ రెడ్డి, జిల్లా సహాయ వెనుకబడిన తరగతుల అధికారులు కే.శంకరయ్య, యస్ లక్ష్మణ్, కార్యాలయ సిబ్బంది కె వెంకటరమణ, జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

శ్రీమల్లికార్జునస్వామి హుండీ లెక్కింపు

నవతెలంగాణ-ఐనవోలు

శ్రీ మల్లికార్జునస్వామి వారి హుండీ లెక్కింపు మంగళవారం నిర్వహించారు. హుండీ ఆదాయం 2024 మార్చి 28 నుండి జూలై 16 వ తేదీ వరకు రూ.24,93,422లు హుండీద్వారా, టికెట్స్ ద్వారా ఆదాయం రూ.90,77,405లు వచ్చినట్లు దేవాదాయ శాఖ,వరంగల్ డివిజనల్ పరిశీలకులు జి.సంజీవ రెడ్డి, ఈవో అద్దంకి నాగేశ్వర్ రావులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐనవోలు పోలీస్ స్టేషన్, హెడ్ కానిస్టేబుల్ ఓం ప్రకాష్, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర సేవ సమితి సభ్యులు మహబూబాబాద్ వారు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఐ రవికి కేయూ రిజిస్ట్రార్ సన్మానం

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



అమెరికా సంయుక్త రాష్ట్రాలు, వాషింగ్టన్ డీసీలోని ఇంటర్నేషనల్ సొల్యూషన్స్ వ్యవస్థాపక అధ్యక్షులు, సిఈఓ ప్రవాస భారతీయుడు, యూనివర్సిటీ కళాశల పూర్వ విద్యార్థి పులి రవి విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రవి తన అనుభవాలను రిజిస్ట్రార్‌తో పంచుకోగా పులి రవిని రిజిస్ట్రార్ శాలువా, జ్ఞాపిక తో సన్మానించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య బి.సురేష్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యనాయక్ తండాలో శీత్ల భవాని వేడుకలు

నవతెలంగాణ-శాయంపేట

మండలంలోని సూర్యనాయక్‌తండాలో మంగళవారం పంటలు సమృద్ధిగా పండాలని, ఎలాంటి దుష్టశక్తులు తండ ప్రజలకు దరిచేరకుండా చూడాలని శీత్ల భవాని దేవత వేడుకలు నిర్వహించినట్లు మాజీ సర్పంచ్ భూక్య రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ శీత్ల పండగను ప్రతి సంవత్సరం ఆషాడ మాసంలో బంజారా తండా వాసులు మంగళవారం జరుపుకుంటారన్నారు. శీత్ల భవాని పండుగ గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింభిస్తుందని, శీత్ల పండగను బంజారాలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బానోతు మొగిలి, మాజీ ఉప సర్పంచ్లు వస్రం, అజ్మీర లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ రెడ్యానాయక్, రవీందర్, మాలోతు రామన్, భాష, లింగునాయక్ పాల్గొన్నారు.



రాష్ట్ర వికలాంగుల చైర్మన్‌ను కలిసిన దివ్యాంగులు

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



నూతనంగా తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన ముత్తినేని వీరయ్య వరంగల్ జిల్లా దివ్యాంగుల సంఘం కమిటి సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దివ్యాంగుల సమస్యలపై మాట్లాడి వినతిపత్రం అందజేశారు. వికలాంగుల శాఖను వెంటనే వేరు చేయాలని, రాష్ట్రంలోని అన్ని జిల్లాలో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్ లగ్ పోస్ట్ లను గుర్తించి వెంటనే భర్తీ చేయాలి, తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాలో జిల్లా ఒక వికలాంగుల భవనం ఏర్పాటు చేయాలని, వికలాంగుల రోస్టర్ పాయింట్‌ను 10 లోపు మార్చాలన్నారు. దివ్యాంగుల చట్టం 2016 ను తెలిపే పోస్టర్ ను రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్‌లలో ఏర్పాటు చేయాలని, దివ్యాంగుల చట్టం-2016 గూర్చి రాష్ట్రంలోని అన్ని గ్రామాలలో అవగాహనా కార్యక్రమలను ఏర్పాటు చెయ్యాలి.ఆ ర్ టీ సి బస్ లలో వికలాంగులకు ఉచితప్రయాణ సౌకర్యం కల్పించాలి.ఇందిరమ్మ ఇండ్లు, స్థలం లాలలో వికలాంగులకు 5శాతం రిజర్వేషన్ అమలు చెయ్యాల. ఈ కార్యక్రమంలో రాష్ట్రఅధ్యక్షులు ఎండీ.అజీమ్, వ్యవస్థాపక అధ్యక్షులు అంబటి రాజేందర్, జిల్లా అధ్యక్షులు బండి చక్రపాణి, కోశాధికారి సతీష్, కోశాధికారి బత్తినిరాజు, కార్యదర్శులు అబ్దుల్ షబ్బీర్, పివివి.సత్యనారాయణ, హన్మ కొండ జిల్లా అధ్యక్షులు మునిగాల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు అండగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా



వరంగల్ జిల్లా పరిధిలోని జర్నలిస్టులందరికీ టీడబ్ల్యూజెఎఫ్ అండగా ఉంటుందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు టివి.రాజుగౌడ్ అన్నారు. మంగళవారం హనుమకొండలోని ఆదర్శ లా కాలేజీ లో టీడబ్ల్యుజేఎఫ్ జిల్లా సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు టీవీ.రాజుగౌడ్ మాట్లాడుతూ జిల్లాలోని వ ర్కింగ్ జర్నలిస్టులందరికీ ఫెడరేషన్ అండగాఉంటుందన్నారు. జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికి వెంటనే వరంగల్ ప్రెస్ క్లబ్ లో సభ్యత్వం ఇవ్వాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా ఇండ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇ వ్వాలని ఏర్పాటు చేసిన సిక్స్‌మెన్ కమిటీ త్వరగా చొరవ తీసుకుని రాష్ట్ర ప్రభు త్వంతో చర్చించి వర్కింగ్ జర్నలిస్టులందరికి ఇంటిస్థలాలు పంపిణీ చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో జర్నలిస్ట్ పై దాడిని ఫెడరేషన్ తీవ్రంగా ఖండిస్తుందని ఇలాంటి ఘటనలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుంచు ఐలయ్య మా ట్లాడుతూ గ్రామీణ ప్రాంత విలేకరులతో పాటు, పట్టణస్థాయి జర్నలిస్టులం దరి సంక్షేమానికి ఫెడరేషన్ కృషి చేస్తుందన్నారు. జర్నలిస్టులందరికీ కార్పొరేట్ ఆసు పత్రుల్లో హెల్త్‌కార్డులు పనిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు దామెర రాజేందర్ సుమారు 50మంది వర్కింగ్ జర్నలిస్టులతో కలిసి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్‌లో చేరి సభ్యత్వం సమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టుల ఐక్యతకు ఫెడరేషన్ కృషి చేయాలని కోరారు.ప్రైవేటు విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు రాయితీ ఇ వ్వడానికి కృషి చేయాలని వర్కింగ్ జర్నలిస్టులపై జరిగే దాడులపై ఫెడరేషన్ తగు విధంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో టిడబ్ల్యూజేఎఫ్ ఫెడరే షన్ జిల్లా కార్యదర్శి గోపాల్, జాయింట్ సెక్రటరీ మంద రాజేష్, సీనియర్ జర్నలి స్టులు తోటకూరి రాందాస్, మరుపట్ల శంకర్, సుమన్, సురేష్, డి. రవీందర్, హ నుమకొండ సాగర్, శ్రీనివాస్, నితిన్, భిక్షపతి, అమ్జద్, సతీష్, కార్తీక్, చంద్రమౌళి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి

చిట్యాల సీఐ డి మల్లేష్





నవతెలంగాణ-గణపురం

మండల కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని చిట్యాల సీఐ డి మల్లేష్ అన్నారు. మంగళవారం గణపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో స్థానిక వ్యాపార వర్గాలతో పాటు వివిధ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటు అవసరమని అన్నారు. ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని అన్నారు. నేరాలు జరిగిన సమయంలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని అన్నారు. మండల కేంద్రంలో సుమారు 60 కెమెరాలు ఏర్పాటు చేస్తే ఉపయోగంగా ఉంటుందన్నారు. కెమెరాల ఏర్పాటుకు ముగ్గురితో కమిటీ ఏర్పాటు చేసుకొని వ్యాపార వాణిజ్య వర్గాలందరూ సమిష్టిగా ముందుకు వచ్చి కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని అన్నారు. గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించి అవసరమున్న చోట మళ్లీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గ్రామ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గణపురం ఎస్ఐ మచ్చ సాంబమూర్తితోపాటు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఎస్సై శ్రవణ్ కుమార్

నవతెలంగాణ-చిట్యాల

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శ్రవణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద యువకులకు ప్రజలకు సైబర్ నేరాలు, మత్తుపదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. నేటి యువత సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఆన్లైన్ గేమ్స్ ఆడవద్దని సూచించారు. మొబైల్ ఫోన్ నెట్‌వర్క్ మంచి సమాచారం కోసం ఉపయోగించుకోవాలని, అనవసరమైన యాప్ లను డౌన్లోడ్ చేసుకొని సైబర్ నేలగాల ఉచ్చులో పడొద్దన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని తెలిపారు. వ్యక్తిగత సమాచారాన్ని గుర్తు తెలియని వ్యక్తులకు గాని బ్యాంకు ఖాతాలను మొబైల్ పిన్‌కోడ్‌లు ఎవరితో పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మండల కేంద్రంలో సీసీ కెమెరాలు అమర్చేందుకు వ్యాపారస్తులు ప్రజలు సహకరించాలని కోరారు.

లెంకలగడ్డలో ఉచిత వైద్యశిబిరం

నవతెలంగాణ-మహదేవపూర్

అంబటిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి పంకెన ఆరోగ్య ఉపకేంద్రంలోని లెంకలగడ్డ గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో దగ్గు, జలుబు, జ్వరం ఇతర వ్యాధులతో బాధపడే వారిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. మలేరియా డెంగ్యూ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ పూనెం రామారావు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గ్రామంలో పర్యటించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి తగు జాగ్రత్తలు వివరించారు. ప్రతి ఒక్కరూ వారంలో రెండు రోజులు డ్రైడే కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పూనెం రామారావు, హెచ్ఈఓ మురళీధర్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఏఎస్ఎం శ్రీలత, ఆశ, నిర్మల పాల్గొన్నారు.

చిన్నారుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలి : సీడీపీఓ రాధిక



నవతెలంగాణ-మహదేవపూర్

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని సీడీపీఓ రాధిక అన్నారు. మంగళవారం మండలంలోని కుదురుపల్లి, బెగులూరు, ఎల్కేశ్వరం గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం తీర్చిదిద్దుతుందని అన్నారు. ప్రత్యేక విద్యా విధానంతో విద్యనందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు రమాదేవి నాగరాణి, అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, ఏ నాగలక్ష్మి, బి సరస్వతి, జె సుజాత, కె సునిత, అంగన్‌వాడీ ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ, పాఠశాలల్లో చేర్పించాలి

అంగన్‌వాడీల సూపర్వైజర్ సరస్వతి

నవతెలంగాణ-మల్హర్‌రావు

మూడేళ్ల దాటిన చిన్నారులను అంగన్ వాడిల్లో, ఆరేళ్ళు దాటిన చిన్నారులను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలని అంగన్ వాడీల సూపర్వైజర్ సరస్వతి కోరారు. మండలంలోని మల్లారం, తాడిచెర్ల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ పిల్లలకు అక్షరాభ్యాసం, అమ్మమాట, అంగన్‌వాడీ బాట, ప్రీస్కూల్‌లో పిల్లల చేరిక కోసం ర్యాలీ నిర్వహించారు. అనంతరం వనమహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మల్లారం పంచాయతీ కార్యదర్శి చేలకల రాజు, అంగన్ వాడీ టీచర్స్ రుద్రమదేవి, కాంతమ్మ, పద్మ విజయ,అరుణ,లక్ష్మీ, వెంకటమ్మ, జయప్రద, మనెమ్మ కారోబార్ శ్రీకాంత్, ఫీల్డ్ అసిస్టెంట్ సుమలత, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన పీఏసీఎస్ చైర్మెన్ మొండయ్య



నవతెలంగాణ-మల్హర్‌రావు

మండల కేంద్రమైన తాడిచెర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మెన్ పదవి దాదాపు 11 సంవత్సరాల తరువాత మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆశీస్సులతో, కాంగ్రెస్ పార్టీ సింగిల్ విండో డైరెక్టర్లు, జిల్లా, మండల కాంగ్రెస్ నాయకుల సహకారంతో కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకొని పెద్దతూండ్ల గ్రామానికి చెందిన ఇప్ప మొండయ్య చైర్మెన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం మంత్రి శ్రీధర్ బాబును మొండయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. సొసైటీ అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి కృషి చేయాలని పీఏసీఎస్ పాలక వర్గానికి మంత్రి సూచించారు. ఆయనవెంట పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీ, మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, తాజా మాజీ ఎంపీపీ చింతలపల్లి మలహల్‌రావు, మాజీ సర్పంచ్ రాజు నాయక్, కాంగ్రెస్ పార్టీ యూత్ డివిజన్ నాయకుడు రాహుల్, యూత్ మండల అధ్యక్షుడు గడ్డం క్రాంతి, తదితరులు ఉన్నారు.

నేడు బోనాల జాతర... విజయవంతం చేయాలి

- కురుమ కులాస్తుల సంఘ నాయకులు



నవతెలంగాణ - భూపాలపల్లి టౌన్

నేడు బోనాల జాతంను విజయవంతం చేయాలని కురుమ సంఘం నాయకులు కోరారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. నేడు తొలి ఏకాదశిని పురస్కరించుకొని బోనాల జాతర నిర్వహిస్తున్నామని ముఖ్యఅతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొంటారని అన్నారు. హనుమాన్ దేవాలయం నుండి ఒగ్గు కళాకారుల విన్యాసాలతో బస్టాండ్ సమీపంలోని శ్రీ బీరప్ప దేవాలయం వరకు బోనాలతో చేరుకుంటారని అన్నారు. భూపాలపల్లి పట్టణంలోని కురుమలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కురుమ కుల పెద్ద పిక్కల సారయ్య, బీరప్ప గుడి పూజారి కోరె సుధాకర్, కురుమలు కంచు రాజేందర్, మధు, కెంచు లక్ష్మణ్, అమ్మ రాజయ్య, తదితరులు పాల్గొన్నారు

వైద్యం ...దైన్యం...

- భూపాలపల్లిలో పేరుకే పెద్దాస్పత్రి
- వైద్యుల నిర్లక్ష్యంతో రోగుల ఇక్కట్లు
- పట్టించుకోని ఉన్నతాధికారులు





నవతెలంగాణ-భూపాలపల్లి

ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నామని పాలకులు అధికారులు చెబుతున్నప్పటికీ అది ఆచరణలో అమలు కావడం లేదు. ఉన్నతాధికారి పర్యవేక్షణ లేకపోవడంతో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అత్యాధునిక వైద్య సేవలు అందుతాయని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. ఇందుకు జయశంకర్-భూపాలపల్లి జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రియే నిదర్శనం. రోగులకు సకాలంలో సరైన వైద్యం అందించకపోవడంతో జిల్లాలో ఓ బాధితుడు తీవ్ర ఇబ్బందులు పడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది.

బాధితురాలు స్వరూప కుమారుడు అరవింద్ తెలిపిన వివరాల ప్రకారం... భూపాలపల్లి మండలం కొంపల్లి గ్రామానికి చెందిన సాగి స్వరూప ప్రమాదవశాత్తు తీవ్ర గాయాలై జిల్లాకేంద్రంలోని 100పడకల ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం ఈనెల 10న చేరింది. అక్కడి వైద్యులు పరీక్షిస్తున్న క్రమంలో శ్వాస ఆడడం లేదని విపరీతంగా తల నొప్పి ఉందని, మంచంపై పడుకోలేకపోతున్నానని వైద్యులకు చెప్పింది. అయినప్పటికీ నామమాత్రపు చికిత్సలు నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ నవీన్ కుమార్ కు సమాచారం అందించినప్పటికీ పట్టించుకోలేదు. స్వరూపకు చికిత్స చేస్తున్నట్లు నటించి పూర్తిగా నయమైందని ఇంట్లో కొన్ని రోజులు రెస్ట్ తీసుకుంటే సరిపోతుందని ఈనెల 14న డిశ్చార్జి చేశారు. దీంతో చేసేదేం లేక ఆమె కుమారుడి అరవింద్ ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ కూడా తీవ్ర ఇబ్బంది పడుతుంటే హనుమకొండలోని గుడ్ లైఫ్ హాస్పిటల్‌కు తీసుకెళ్లి వైద్యులకు చూపించారు. స్వరూపకు నాలుగు పక్క బొక్కలు విరిగి రక్తస్రావం ఇయి ఇన్ఫెక్షన్ అయిందని ఇంత సీరియస్‌గా ఉంటే ఎందుకు హాస్పిటల్‌లో చూపించలేదంటూ అక్కడి వైద్యులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఖంగుతిన్నారు. పేద ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఇలాంటి డాక్టర్లపై, డాక్టర్లకు అండగా ఉంటున్న సూపరింటెండెంట్‌పై జిల్లా కలెక్టర్,ఎమ్మెల్యే, మంత్రి, స్పందించి విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని వంద పడకల హాస్పిటల్ లో పేద ప్రజలకు సరైన వైద్యం అందేలా చూడాలని బాధితులు కోరారు.

వైద్య అధికారులపై చర్యలు తీసుకోవాలి

పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. అందుకు అనుగుణంగా వైద్య సేవలు అందాలి. ఉన్నతాధికారులు స్పందించాలి. జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆసుపత్రిలో రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్య అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

-పిప్పాల రాజేందర్, భూపాలపల్లి

మెరుగైన చికిత్స అందించాం

సాగి స్వరూప అనే పేషెంట్‌కు ఆస్పత్రిలో చేరగానే మెరుగైన చికిత్స అందించాం. సంబంధిత వైద్యులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశాను. కానీ సమస్య ఉందని నా దృష్టికి ఎవరు తీసుకురాలేదు. నాకు తెలియకుండానే డిశ్చార్జి అయ్యారు.

-డాక్టర్ కోదూరి నవీన్‌కుమార్, సూపరింటెండెంట్, వంద పడకల ఆస్పత్రి

మున్సిపాలిటీ ఆస్తుల నివేదికలు అందించాలి

- ట్రేడ్ లైసెన్స్ లేనివారిని గుర్తించి నోటీసులు ఇవ్వాలి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



నవతెలంగాణ-భూపాలపల్లి

భూపాలపల్లి మున్సిపాలిటీ ఆస్తుల నివేదికలు అందించాలని, ఆదాయ మార్గాలను పెంచుకునే దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం భూపాలపల్లి పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి సిద్ధు అధ్యక్షతన జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొని మాట్లాడారు. రెండు మూడు రోజుల్లో నివేదికలు ఇవ్వాలన్నారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ కు ఎక్కడెక్కడ ఆస్తులు ఉన్నాయని అడగగా కమి షనర్, మున్సిపల్ అధికారులు సమాధానం ఇవ్వ కపోవడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే వర్షాకాలంను దృష్టిలో పెట్టుకుని విద్యుత్తు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వర్షాల నేపథ్యంలో ఈదురు గాలుల మూలంగా చెట్లు విరిగి పడటం, స్తంభాలు పడిపోవడం, విద్యుత్ తీగలు ఊడిపడడం వంటి ఘటనలు జరుగుతుంటాయని, క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. భూపాలపల్లి పట్టణంలోని ప్రధాన రహదారి వెంట డివైడర్ మధ్యలో కోనోకార్పస్ మొక్కల వల్ల ప్రజలకు శ్వాసకోస వ్యాధులు కలుగుతున్నాయని, వాటిని పూర్తిగా తొలగించి, వాటి స్థానంలో వేరే మొక్కలు నాటాలని సూచించారు. భూపాలపల్లిలో దుకాణదారులు ట్రేడ్ లైసెన్స్‌లను తీసుకోకపోవడంతో మున్సిపల్ ఆదాయానికి గండి పడుతుందని పలువురు కౌన్సిలర్లు పేర్కొన్నారు. వాటిపై కమిషనర్ దృష్టి సారించి, ఆదాయం పెంపు దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయని, రోడ్ల వెంట మురికి కాల్వలలో చెత్తా, చెదారం నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కాలనీలలో దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. పలు ప్రభుత్వ కార్యాలయాలు, సింగరేణి క్వార్టర్స్, పలు పార్టీల రాజకీయ కార్యాలయాల నుండి పెండింగ్ ఆస్తి పన్నులు మొత్తం వసూలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్, భూపాలపల్లి ఎమ్మార్వో శ్రీనివాస్, మున్సిపల్ డీఈ శ్రీనాథ్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీష్‌రెడ్డి, పలు వార్డుల కౌన్సిలర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇప్ప మొండయ్యకు సన్మానాల వెల్లువ



నవతెలంగాణ-మల్హర్‌రావు

చాలా సంవత్సరాల తరువాత తాడిచెర్ల పీఏసీఎస్ చైర్మెన్ పదవీ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇప్ప మొండయ్య దక్కించుకోవడంతో భూపాలపల్లి జిల్లా, మండల, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయ కులు, కార్యకర్తలు ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో చైర్మన్ మొండయ్య, వైస్ చైర్మెన్ ప్రకాష్ రావు, డైరెక్టర్లు వొన్న తిరుపతిరావు, సంగ్గెం రమేష్, సర్వర్ నాయక్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చింతలపల్లి మలహల్‌రావు, కాంగ్రెస్ పార్టీ ఎస్సిసెల్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు దండు రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బడితేల రాజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి అయిత రాజిరెడ్డి, యూత్ డివిజన్ నాయకుడు రాహుల్, యూత్ మండల అధ్యక్షుడు గడ్డం క్రాంతి, మత్స్య శాఖ జిల్లా డైరెక్టర్ జంగిడి శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు రాజునాయక్, చెంద్రయ్య, నాయకులు సురేష్ రావు, తదితరులు పాల్గొన్నారు.

అవకతవకల నివారణకు సామాజిక తనిఖీ

- డీఆర్‌డీఏ పీడీ నరేష్



నవతెలంగాణ-గణపురం

ఉపాధి హామీలో అవకతవకలు జరగకుండా ఉండేందుకే సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు డీఆర్డీఏ పీడీ నరేష్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ భాస్కర అధ్యక్షతన 16వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఉపాధి హామీ అడిషనల్ పీడీ వసుమతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని 17 గ్రామపంచాయతీల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులను ఉపాధి బృందం సర్వే చేసి నివేదిక సమర్పించారు. ఆయా గ్రామ పంచాయతీల్లో మొక్కలు నాటి, సంరక్షించడంలో నిర్లక్ష్యం వహించారని, వారికి చట్ట ప్రకారం జరిమానా విధించారు. ఎలాంటి అక్రమాలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం చర్య తీసుకుంటుందని అన్నారు. ఉపాధి పనులు కూలీలందరికి అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి బుధవారం ఉపాధి హామీ సిబ్బందికి తప్పులను తెలుసుకునేందుకు సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఉపాధి హామీలో బినామీగా పనులు చేస్తే తప్పకుండా దొరుకుతారని అన్నారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, ఫీల్డ్‌మస్టర్ పర్యవేక్షణ చేయాలని వసుమతి పేర్కొన్నారు. మండలంలో రూ.3కోట్ల ఉపాధి పనులు చేపట్టారని అన్నారు. చిన్న చిన్న తప్పిదాలు జరుగుతున్నాయని సరిచేసుకోవాలని సూచించారు. పల్లె తోటలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం మండలంలోని 10 గ్రామపంచాయతీలలో పనుల్లో తప్పిదాలు చేసిన ఫీల్డ్ అసిస్టెంట్లకు, టెక్నికల్ అసిస్టెంట్లకు రూ. 89వేల జరిమానా విధించినట్లు తెలిపారు. ఉపాధి హామీ పనులు కూలీలు ఆరు గంటలు పని చేస్తే సగటు కూలి రూ.300 పడుతుందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు జాబ్ కార్డ్స్, సెవెన్ రిజిస్టర్స్ అప్డేట్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అరుంధతి, క్యూసి ధరమ్ సింగ్, విజిలెన్స్ డీవీసీ రుబేద, ఎస్ఆర్‌పి కుమార్, ఇన్‌చార్జి ఏపీవో రాజు, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షుడిగా రాజుకుమార్



నవతెలంగాణ-మల్హర్‌రావు

మున్నూరుకాపు సంఘం-తెలంగాణ మండల అధ్యక్షుడుగా మండలంలోని పెద్దతూండ్ల గ్రామానికి చెందిన బండ రాజ్‌కుమార్ పటేల్ ఏకగ్రీవంగా నియామకం చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పటేల్, రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్ పటేల్ మంగళవారం నియామక పత్రాన్ని అందజేశారు. తనపై నమ్మకంతో ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు, కన్వీనర్‌తోపాటు మున్నూరు కాపు సంఘం నాయకులకు రాజ్‌కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సంఘం ఐక్యత, పటిష్ఠతకు తనవంతు కృషి చేస్తూ సంఘం ఆశయాల కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తానని అన్నారు.

లబ్ధిదారుకు ఎల్ఓసీ అందజేత

నవతెలంగాణ-మహాదేవపూర్

పలిమెల మండలం సర్వాయిపేట గ్రామానికి చెందిన దుర్గం పోచయ్య అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మంత్రి శ్రీధర్‌బాబు చొరవతో మంజూరైన రూ.2,50,000 ఎల్ఓసిని మంత్రి ఆస్పత్రి సహాయకులు మంగళవారం హైదరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందచేశారు.

వసతి గృహ భవనాల పనులు పూర్తి చేయాలి : ఎస్ఎఫ్ఐ



నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఎస్సీ, బీసీ కలశాల వసతి గృహాలు ఐదేండ్లుగా నిర్మాణదశలోనే ఉన్నాయని, వెంటనే పనులు పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ డిమాండ్ చేశారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు బొడ్డు స్మరణ్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా దామెర కిరణ్ హాజరై మాట్లాడుతూ అద్దె భవన్లో ఇరుకు గదులతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో ఎస్టీ కళాశాల వసతి గృహం ఇప్పటి వరకు మంజూరు చేయలేదన్నారు. జిల్లా వ్యాప్తంగా వసతి గృహాల్లో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా విద్యాశాఖ అధికారులు వసతి గృహాలను సందర్శించిన దాఖలాలు లేవన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాజ్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు నరేష్, స్వామి, ఈశ్వర్, అశ్విత్, శివ, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



నవతెలంగాణ-మల్హర్‌రావు

మండలంలోని నాచారం గ్రామానికి చెందిన వేముల సంతోష్ యాదవ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబానికి మంగళవారం అఖిల భారత యాదవ మహాసభ సంఘం కాటారం డివిజన్ నాయకులు పరమార్శించి రూ.2వేలతోపాటు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి బోయిని రాజన్న యాదవ్, మండల గౌరవ అధ్యక్షులు యాదండ్ల రామన్న యాదవ్, రుద్రారం గ్రామశాఖ అధ్యక్షుడు మెతుకూరి మహేష్ యాదవ్, బస్వపూర్ గ్రామశాఖ అధ్యక్షుడు జెల్లా స్వామి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏ జాబితాలో చేర్చాలి

నవతెలంగాణ-మల్హర్‌రావు

ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏ జాబితాలో చేర్చాలని ముదిరాజ్ మహా సభ నాయకులు కోరారు. రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బండ ప్రకాష్ పిలుపు మేరకు మంగళవారం మండల కేంద్రమైన తాడిచర్లలో ముదిరాజ్ మహసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి అశోక్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రాంతంలో ఎక్కువ జనాభా కలిగిన ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి చేర్చాలని అన్నారు. ముదిరాజ్ జనాభాలో మత్స్యవత్తి, తోటల పెంపకం, ఇతర వృత్తులపై జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు. మిగతా వారు ఇతర వృత్తులపై ఆదారపడి జీవిస్తున్నారని అన్నారు. 2023లో జరిగిన తెలంగాణ శాసనసభ ఎన్నికల సమయంలో 'అభయహస్తం'లో హామీలు కొంత విశ్వాసాన్ని కలుగజేశాయని అన్నారు. అధికారంలోకి వచ్చి 6నెలలు పూర్తయిన సందర్భంగా తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ముదిరాజ్ కోఆపరేటీవ్ సొసైటీ లిమిటెడ్ ఏర్పాటు ప్రకటన పట్ల ధన్యవాదాలు తెలిపారు. ముదిరాజ్ మహసభ జిల్లా అధ్యక్షులు జొరిక సదయ్య, ఉపాధ్యక్షులు మొగిలి, జిల్లా సొసైటీ చైర్మన్ చిలుకల పాణి, జోడు శ్రీను, తిరుపతి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

మహాదేవపూర్ : ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చా లని కోరుతూ స్థానిక తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్ కు మంగళవారం ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి అశోక్‌ముదిరాజ్ వినతిపత్రం అందజేశారు. మం డల అధ్యక్షులు గడ్డం స్వామి, మండల ప్రధాన కార్య దర్శి బొగ్గుల తిరుపతి, మండల నాయకులు జోడు సంటి , తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవంతో పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దాలి

- అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్



నవతెలంగాణ-జనగామ

వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టి పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దాలని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా మంగళవారం జనగామ మున్సిపల్ చైర్మన్ పోకల జమున, మున్సిపల్ కమిషనర్‌లతో కలిసి అదనపు కలెక్టర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మొక్కలు ప్రాణకోటికి జీవనాధారమని, ప్రతి ఒక్కరికి తెలియజేస్తూ మొక్కలు నాటడమే కాకుండా పరిరక్షణకై బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు ఇంటింటికి మొక్కలను పంపిణీ చేస్తూ నాటేలా శ్రద్ధ తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీ ని పచ్చదనంతో అందంగా తీర్చిదిద్దాలని, చూపరులను ఆకట్టుకునే విధంగా పూల మొక్కలు నాటింపచేయాలని తెలిపారు. ఈ వన మహోత్సవ కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వర్లు, పట్టణ కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మొహర్రం, తొలి ఏకాదశి శుభాకాంక్షలు

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

సమాజంలో ధర్మ పరిరక్షణకు, ప్రజల ఐక్యతకు ప్రతీకగా మొహర్రం, తొలి ఏకాదశి పండుగలు నిలుస్తాయని జిల్లా ప్రజలందరికీ మొహర్రం, తొలి ఏకాదశి శుభాకాంక్షలు జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా కర్బలాయుద్ధంలో వీరోచిత పోరాటం గావించిన హజ్రత్ ఇమామ్‌హుస్సేన్ ధైర్యం, నిబద్ధత ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. ఇస్లామిక్ క్యాలెండర్ లో మొదటి నెల మొహర్రం అన్నారు. ముస్లింలు, హిందువులు కలిసి నిర్వహించే ఈ పీర్ల ఊరేగింపు సమైక్యతను ప్రతిబింబిస్తుందని వివరించారు. సమాజంలో ధర్మం, సత్యం, న్యాయం, మానవీయ విలువల పరిరక్షణకు కృషి చేసిన ఇమామ్ త్యాగం, సహనాన్ని స్మరించుకుంటూ ఈ పండుగను జరుపుకుంటారని తెలిపారు.

తెలుగు పండుగలకు తొలి ఏకాదశి ఆది పండుగ అని కలెక్టర్ పేర్కొన్నారు. ఏడాది పొడవునా ఉండే 24 ఏకాదశుల్లో అషాఢ శుద్ధ ఏకాదశిని తొలి ఏకాదశిగా పరిగణిస్తారన్నారు. లంఖణం పరమ ఔషధం అనే ఉపవాస దీక్షకు నాంది ఈ తొలిఏకాదశి అని వివరించారు. ఈ పర్వదినాన్ని ప్రజలంతా అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఫోటో ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నర్మెట్ట



ఫోటో ఎక్స్‌పో పోస్టర్‌ను మంగళవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ మహిపాల్ రెడ్డి ఆవిష్కరించారు. మండల ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వలబోజు రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఆవిష్కరణ ముఖ్య ఉద్దేశం ఈ నెల 26,27,28 తేదీలలో హైదరాబాద్‌లో జరిగే ఫోటో ఎక్స్‌పోఎగ్జిబిషన్‌కు ఫోటోగ్రాఫర్లు హాజరై, మారుతున్న కొత్త దనం, నూతన కెమెరాల గురించి పూర్తిగా తెలుసుకొని ఎదగాలని మండల ఫోటోగ్రాఫర్ లు అందరు హాజరు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి వలబోజు శ్రీనివాస్, జిల్లా సభ్యులు జనార్దన్,మండల గౌరవ అధ్యక్షులు కొంపెల్లి భాస్కర్, ఉపాధ్యక్షులు బోడిక వినోద్ కుమార్, కంతి చరణ్, ఫోటోగ్రాఫర్లు లక్ష్మణ్, రాజు, అనిల్, మహేష్, శ్రీకాంత్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్‌గా సమీరకుమార్

నవతెలంగాణ-పాలకుర్తి



ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ) మేనేజర్‌గా ఎ.సమిరకుమార్‌ను నియమిస్తూ గ్రామీణ వికాస్ బ్యాంక్ చైర్మన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం మేనేజర్ సమీరకుమార్ మాట్లాడుతూ పంటరుణాలు పొందిన రైతులు సంవత్సరంలోపు పంట రుణాలను చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని సూచించారు. సకాలంలో రెన్యూవల్ చేయించుకోవాలని తెలిపారు. బ్యాంకు ఖాతాదారులకు ఎలాంటి సమస్యలు ఉన్న బ్యాంకు అధికారులను సంప్రదించాలని, మధ్యవర్తుల వద్దకు వెళ్లరాదని తెలిపారు. దళారీ వ్యవస్థకు బ్యాంకులో స్థానంలేదని స్పష్టం చేశారు.త్వరలో బ్యాంకు ఆధ్వర్యంలో గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామని తెలిపారు. బ్యాంకు అభివృద్ధికి ఖాతాదారులు సహకరించాలని సమీర కుమార్ కోరారు. బాధ్యతలు స్వీకరించిన సమీర కుమార్‌కు బ్యాంకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్



మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీపతి సునీతారావు ఆధ్వర్యంలో మంగళవారం గాంధీభవన్లో జరిగిన బోనాల జాతర ఉత్సవాలకు జిల్లా మహిళా కాంగ్రెస్ నుండి ప్రతినిధులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమన్వయకర్త నీలం పద్మ, జనగామ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బడికె ఇందిర, ఉపాధ్యక్షురాలు పిన్నింటి కావ్య శ్రీరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, జనగామ మున్సిపల్ పార్టీ ఫ్లోర్ లీడర్ వంగాళ కళ్యాణి రెడ్డి, జిల్లా కోశాధికారి ధారావత్ లక్ష్మి, పట్టణ అధ్యక్షురాలు సాగ ప్రమీల, రఘునాథపల్లి మండల అధ్యక్షురాలు పేర్ని ఉషా, లింగాలఘణపురం మండల అధ్యక్షురాలు శ్రీలత, నర్మెట మండల అధ్యక్షురాలు దేవులపల్లిభాగ్యలక్ష్మి, నర్మెట గ్రామ అధ్యక్షురాలు పులి రేణుక పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత

నవతెలంగాణ-బచ్చన్నపేట

నారాయణపూర్‌లో విద్యుద్ఘా తంతో మృతిచెందిన నిరుపేద జం గిటి స్వామి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంగిటి విద్యానాథ్ రూ.5వేల ఆర్థికసహాయం, 50కిలోల బియ్యంను మంగళవారం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పరిదె శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, జంగిటి నరేష్, ఉపచారీ, పిఎసిఎస్ డైరెక్టర్ రాములు, పరంకుర్ష రావు, బంద్రు కరుణాకర్, సిద్దులు, మురళీ తదితరు పాల్గొన్నారు.

అక్కరాజుపల్లిలో బియ్యం అందజేత



తరిగొప్పుల : మండల పరిధిలోనిలోని అక్కరాజుపల్లి గ్రామానికి చెందిన మంచినీళ్ల నాగయ్య, మంచినీళ్ల ఎంకవ్వ ఇటీవల ఇద్దరు అనారోగ్యంతో మ రణించగా వారి కుటుంబాలను గ్రామానికి రెయిన్‌బో యూత్ అసోసియేషన్ స భ్యులు మంగళవారం కుటుంబాన్ని పరామర్శించి ఇరు కుటుంబాలకు 25 కి లోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు అంకం రాజు, సభ్యులు జొన్నగోని రాజు, భోగం అనూప్,మహ్మద్ అక్తర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా దేవరాజు

నవతెలంగాణ-పాలకుర్తి

బిజెపి మండల ప్రధాన కార్యదర్శిగా మండలంలోని శాతవరం గ్రామానికి చెందిన వేల్పుల దేవరాజును నియమిస్తూ మంగళవారం బిజెపి మండల అధ్యక్షుడు దుంపల సంపత్ నియామక పత్రాన్ని అందజేశారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ముస్కరాజు

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్



శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఎవరినైనా ఉపేక్షించేది లేదని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ముస్కరాజు హెచ్చరించారు. మంగళ వారం ఆటోలకు పోలీసు నెంబర్ స్టిక్కర్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తప్పక యూనిఫాం ధరించాలని, సరియైన పత్రాలు కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై చర్యలు ఉంటాయన్నారు. ఈకార్యక్రమంలో ఎస్సైలు నాగరాజు, బొల్లం వినయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాసు ఫౌండేషన్‌కు 'ఇన్‌స్పైరింగ్ యూత్ ఆఫ్ ఇండియా ఎన్‌క్లేవ్' అవార్డు

నవతెలంగాణ-బచ్చన్నపేట

మండల కేంద్రానికి చెందిన వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేష్ కుమార్ ప్రజాపతి, వైస్ చైర్మన్ నూకల భాస్కర్ రెడ్డి, హేమంత్ వాస్విక్ ఫౌండేషన్ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్లలో పలు పాఠశాలల్లో, ఆసుపత్రులల్లో చేస్తున్న సేవా కార్యక్రమాలు, పేదలకి అందిస్తున్న సాయం, ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అనాథ వద్ధ ఆశ్రమలకి చేస్తున్న సేవా తదితర కార్యక్రమాలను గుర్తించి ఢిల్లీకి చెందిన లినేషనల్ హ్యూమన్ వెల్ఫేర్ కౌన్సిల్‌లి వారు లిఇన్స్పైరింగ్ యూత్ అఫ్ ఇండియాలి అవార్డ్స్ అందజేసేందుకు ఎంపిక చేసినట్లు ఇన్విటేషన్ పంపారాని ఫౌండేషన్ చైర్మన్ నరేష్ కుమార్ తెలిపారు.

తాము చేస్తున్న సేవా కార్యక్రమాలను చూసి ఈ అవార్డులకి ఎంపిక చేసినందుకు ఆనందంగా ఉందని ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు.

మహిళా సాధికారతలో అగ్రగామిగా నిలపాలి



- మహిళా సంఘాల భవనాలు నిర్మిస్తా
- వీఓఏలు వార్షిక లక్ష్యాన్ని చేరాలి
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

నవతెలంగాణ-స్టేషన్ ఘన్‌పూర్

మహిళా సంఘాల బలోపేతానికి సెర్ప్ జిల్లా స్థాయి అధికారులు సైతం క్షేత్రస్థాయిలో నిబద్ధతతో పనిచేసి, మహిళా సాధికారత లక్ష్యంలో నియోజక వర్గాన్ని అగ్రగామిగా నిలిపేలా బాధ్యతతో పనిచేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సూచించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో మహిళా శక్తి కార్యక్రమాల అమలుపై నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం ఎంపీ డాక్టర్ కడియం కావ్యతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి నియోజకవర్గస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆ విభాగంలోని సమస్యలు, వాటి పరిష్కారంపై అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ మహిళలు పారిశ్రామికంగా అభివద్ధి చెందేందుకు ప్రభుత్వం రూపొందించిన మహిళాశక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అధికారులు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి యూనిట్‌లపై ప్రోత్సాహకం అందించాలని అన్నారు. వాస్తవానికి ఇబ్బందులు ఉన్నా, చేసే పనిపై శ్రద్ధ చూపితే సత్ఫలితాలు సాధ్య మవుతాయన్నారు. మూడు నెలలకు ఒకసారి అధికారులతో సమీక్ష నిర్వహిస్తానని పురోగతి సాధించే దిశగా పనులు ఉండాలని, అధికారులు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి యూనిట్లపై లబ్ధిదారులకు ప్రోత్సాహకం అందించాలని, లేదంటే ఉద్యోగం ఊడుతోందని హెచ్చరించారు. సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు రాయితీ రుణాలిచ్చి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కషి చేయాలన్నారు.

మహిళాశక్తి పథకంపై అవగాహన కల్పించేందుకు అవసరమైతే ప్రత్యేక శిక్షణ యూనిట్లు నెలకొల్పేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. మత్స్య, పశు సంవర్ధక, జిల్లా గ్రామీణాభివద్ధిశాఖ అధికారులు సమన్వయంతో లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రోత్సహించాలన్నారు. స్వయం సహాయక సంఘాల రుణాల ద్వారా సబ్సిడీని లింక్‌చేస్తే పేదవారికి మరింత మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. తన బాధ్యతగా నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో మహిళా సమైఖ్య భవనాలను నిర్మిస్తానని హామీ ఇచ్చారు. వీఓఏల వేతనాల పెంపుపై ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. మహిళా సాధికారతలో నియోజకవర్గంను రాష్ట్రానికి ఆదర్శంగా నిలిపే బాధ్యత అందరిపై ఉందని గుర్తుచేశారు. తాను సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని, ఏవైనా సమస్యలు ఉంటే దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని కడియం శ్రీహరి అన్నారు.

వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డా.క్టర్ కడియం కావ్య మాట్లాడుతూ మహిళల అభివద్ధితోనే దేశ పురోగతి సాధ్యమవుతుందన్నారు. మహిళా శక్తి పథకం ద్వారా మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఆ దిశగా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రతి మండలంలో మహిళా సంఘాలతో సమావేశాలు నిర్వహించి ఔత్సాహిక మహిళా సంఘాలను మహిళా శక్తి పథకం ద్వారా యూనిట్లు ప్రారంభించే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఇంటిని చక్కదిద్దే మహిళలకు గ్రామాన్ని చక్కదిద్దే శక్తి ఉంటుందన్నారు. రాష్ట్ర ఆదాయంలో మహిళా సంఘాల భాగస్వామ్యం ఉందన్నారు. బాధ్యతాయుతంగా పనిచేసి లక్ష్యాల్ని చేరాలన్నారు. నిత్యంమహిళా ఆర్థిక పరిపుష్టికి దోహ ద పడుతున్న వీఓఏల ఆరోగ్య దృష్ట్యా హెల్త్ క్యాంపు నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో డీఆర్డీఓ మొగులప్ప, అదనపు డీఆర్డీఓలు శ్రీనివాస్, సుధీర్, ఏసీపి భీం శర్మ, డీపీఎం వినీత, రాజేంద్ర ప్రసాద్, వరలక్ష్మి, ఏపీఎంలు కుమారస్వామి, సీసీలు, స్వర్ణ విజయ మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మాచర్ల స్రవంతి, కార్యదర్శి పంజాల మంజుల, కొలిపాక కోమల, నియోజకవర్గ పరిధి వీఓఏలు, మాజీ ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అధికారుల అండతో బోర్డును తొలగించిన కబ్జాదారులు

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి సోమయ్య



నవతెలంగాణ-జఫర్‌గఢ్

మండల కేంద్రంలోని ఆర్టీసీ స్థలంలోని సూచిక బోర్డులను ఆర్టీసీ అధికారుల అండదండలతో బోర్డులను ధ్వంసం చేసినట్లు సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి సోమయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ స్థలంలో ఏర్పాటుచేసిన సూచిక బోర్డులను కబ్జా కోర్లు ధ్వంసం చేయగా ఈ స్థలాన్ని సీపీఐ (ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ ఆర్టీసీ స్థలాన్ని కబ్జాకోరులు స్వాధీనం చేసుకోవడానికి ఆర్టీసీ సంబంధిత అధికారులు సహకరించడంతో ఆర్టీసీ స్థల బోర్డులను ధ్వంసం చేసినట్టు పేర్కొన్నారు. ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం వల్ల, ఆర్టీసీ సంబంధిత స్థలాన్ని కబ్జా చేసుకోవడానికి కబ్జాదారులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. దీనికి తోడు ఆర్టీసీ అధికారులు వారికి సహకరిస్తూ స్థలాన్ని వారికి అప్పజెప్పడానికి పరోక్షంగా సహకరిస్తున్నట్లు ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, కలెక్టర్ స్పందించి ఆర్టీసీ అధికారులకు చెప్పి ఆర్టీసీ స్థలాన్ని కాపాడేలా చర్య లు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వం వెంటనే స్పందించి ఆ స్థలానికి ప్రహరీ కూడా నిర్మించాలని కోరారు. ఆర్టీసీ స్థలానికి ఆర్టీసీ అధికారులు కానీ, ప్రభుత్వం గానీ వారం రోజులలో ప్రహరీ గోడ నిర్మించి, ఆర్టీసీ స్థలాన్ని కాపాడని పక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గడిసెలు వేసి పేద ప్రజలకు పంచుతామని ఆర్టీసీ అధికారులకు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులుకాట సుధాకర్, నల్ల తీగల శ్రీను, మంద యాదగిరి, జీ.నరసింగం, ఎస్.ఎల్లయ్య, సాయిలు, ఎస్. యాకయ్య, సారంగం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులుగా నర్సయ్య



నవతెలంగాణ-లింగాలఘనపురం

జిల్లా ఉద్యమ నిరుద్యోగ కళాకారుల అధ్యక్షులుగా సాంస్కృతిక సేన రాష్ట్ర కార్యదర్శి గుగిల్ల నర్సయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కేంద్రంలో మంగళవారం బతుకమ్మ కుంటలో ఏర్పాటు చేసిన ఉద్యమ నిరుద్యోగ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. జనగామ జిల్లా కళాకారులను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గజ్వేల్ ప్రతాప్ అధ్యక్షతన ముఖ్యఅతిథిగా జవ్వాజి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. జనగామ జిల్లా నూతన జిల్లాకమిటీని ఏర్పాటు చేశారు. జనగామ జిల్లా గౌరవ అధ్యక్షులు అందే సోమయ్య, జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా గుగిల్ల నర్సయ్య ప్రధాన కార్యదర్శిగా షాపెల్లి రమేష్, కోశాధికారిగా గజ్వేల్లి రాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గుగ్గిళ్ళ నర్సయ్య మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వంతో కళాకారుల బ్రతుకులు మారుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కళాకారుల బాధలు విన్నవించి వినతిపత్రం సమర్పించగా సానుకూలంగా స్పందించారని, కాంగ్రెస్ ప్రభుత్వం కళాకారులకు న్యాయం చేస్తుందని నర్సయ్య ప్రగాఢ విశ్వాసం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సలహాదారులు కుమారస్వామి, శ్రీనివాస్, అంజన్న, మల్లయ్య, వెంకటేష్, గ్యార సోమయ్య, గుగ్గిళ్ళ ఎల్లయ్య, గజ్వేల్లి శివాజీ, రాగల్ల నరేష్ లింగయ్య యాదవ్, గానుగంటి కవిత, పిల్లుట్ల ఉమాపతి, మునిగాల రజిత, దామెర లావణ్య, రమ్య, సంధ్యలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం, శారీరక దృఢత్వం



నవతెలంగాణ-ధర్మసాగర్

క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దఢత్వాన్ని పెంపొందిస్తాయని హన్మకొండ జిల్లా కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సారంగపాణి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అజీజ్ ఖాన్ ఆధ్వర్యంలో ధర్మసాగర్ మండల కబడ్డీ అసోసియేషన్ ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ క్రీడలు సమస్త మానవాళికి ఆరోగ్యాన్ని ఇవ్వడంతో పాటు సంతోషాన్ని, క్రమశిక్షణను అలవరుస్తుందని అన్నారు. అనంతరం ధర్మసాగర్ మండల కబడ్డీ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షునిగా జాలిగపు శ్రీను, ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన లక్ష్మణ్ యాదవ్,కోశాధికారిగా ఆవుల రాజు యాదవ్,ఉపాధ్యక్షులుగా బెల్లం ప్రేమ్,ఆవుల సాంబరాజు ,తూముల రంజిత్,గంటే వంశీ , సహాయ కార్యదర్శిలుగా గంటె శ్రీనివాస్, తోటకురి తరుణ్,పాతపెల్లి దిలీప్,పాతపెల్లి మహేశ్,సభ్యులుగా గాజ ప్రశాంత్,గడ్డం నీరజ్,బెల్లం రాజ్ కుమార్, గెంటే మహేష్ , ఎన్నుకోబడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డి అసోసియేషన్ కమిటి సభ్యులు మరియు 5 జోన్ల సెంకటరిలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లయన్స్ క్లబ్ ఆఫ్ హసన్‌పర్తి 17వ కమిటీ ప్రమాణస్వీకారం



నవతెలంగాణ-హసన్‌పర్తి

హసన్‌పర్తి మండల కేంద్రంలోని మహాలక్ష్మి బంకెట్ హాల్ లో లయన్స్ క్లబ్ ఆఫ్ హసన్‌పర్తి 17వ నూతన కమిటీ ప్రమా ణస్వీకారోత్సవ కార్యక్రమం లయన్ గోపరాజు యాదగిరి అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రీజియన్ చైర్ పర్సన్ లయన్ జనప్పరెడ్డి రాజిరెడ్డి నూతన సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. మొదటి ఉప జిల్లా గవర్నర్ లయన్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య నూతన కమిటీ సభ్యులచే ప్రమాణస్వీకారం నిర్వహించారు. నూతనంగా ఏర్పాటు చేసిన కమిటీ సభ్యుల్లో అధ్యక్షుడిగా ఇనుముల కృపాకర్ కార్యదర్శిగా నేదునూరి కుమారస్వామి, కోశాధికారిగా డాక్టర్ శేఖర్ ప్రమాణ స్వీకారం చేశారు. నూతన అధ్యక్షుడు ఇనుముల కపాకర్ మాట్లాడుతూ ఈ సంవత్సర కాలమంతా పేదవారికి, స్కూల్ విద్యార్థులకు మౌలిక సదుపాయాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా గవర్నర్ లయన్ కుందూరు వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 216 దేశాలలో లయన్స్ సేవా కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతున్నాయని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో మిషన్ 1.5 అనే నినాదంతో 15 లక్షల సభ్యత్వాన్ని పూర్తి చేసుకోవాలని అంతర్జాతీయ అధ్యక్షుడు తెలిపారని చెప్పారు. అనంతరం ఈ కార్యక్రమానికి విచ్చేసిన వివిధ క్లబ్ ప్రెసిడెంట్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెండవజిల్లా గవర్నర్ నరహరి సుధాకర్ రెడ్డి, పొట్లపల్లి శ్రీనివాసరావు, డాక్టర్ భాస్కరరావు, డాక్టర్ అజిత్‌కుమార్, కల్యాణపు రాజమౌళి, కాటంగూరి రాంగోపాల్ రెడ్డి, చెన్నూరు శ్రీనివాస్, గంగారపు రజనీకాంత్, నాగమల్ల సుధీర్, తోట సంపత్, మోరరవి, వలుస రాజేంద్రం,రాజేందర్, శ్రీనివాస్,బొల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాల్యవివాహ రహిత జిల్లాగా మార్చురావాలి

- బాలకార్మికులు లేని జిల్లాగా ఎదగాలి
- జిల్లా సంక్షేమ అధికారి జే.జయంతి

నవతెలంగాణ-జనగామ



జనగామ జిల్లాలో బాల్య వివాహాలు జరగకుం డా, బాల కార్మికులు లేని జిల్లాగా తీర్చిదిద్దడంలో స్కోప్ సంస్థ కార్యకర్తలు కృషి చేయాలని జిల్లా సంక్షేమ అధికారి జే. జయంతి కోరారు. స్పందన కల్చరల్ ఆర్గనైజేషన్ ఫర్ ప్రోగ్రెసివ్ ఎడ్యుకేషన్ (స్కోప్) సంస్థ సామాజిక సేవా కార్యకర్తలు, కౌన్సిలర్ల శిక్షణా శిబిరానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. స్కోప్ సంస్థ చైర్మన్ బండి సాయన్నగౌడ్ అధ్యక్షతన ఆబాద్‌లయన్స్‌భవన్‌లో మంగళవారం నిర్వహించిన శిక్షణా శిబిరంలో యాదాద్రి, జనగామ జిల్లాలకు చెందిన కో-ఆర్డినేటర్స్ , సామాజిక సేవా కార్యకర్తలు, కౌన్సిలర్స్ పాల్గొన్నారు. తొలుత జ్యో తి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించిన జయంతి మాట్లాడుతూ స్కోప్ సంస్థ లక్ష్య సాధన తమ శాఖకు సానుకూలం కనుక తమ శాఖ సిబ్బంది పూర్తి సహకారం అందించ గలరని ఆమె తెలిపారు.

స్కోప్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రస్తుతం ఎంపిక చేసిన గ్రామాలలో చేయవలసిన కార్యక్రమాల గురించి, అందులో ఏర్పడే ఇబ్బందుల నదిగమించడంలో తీసుకోవలసిన జాగ్రత్తలగురించి నిపుణులు వివరించారు. ఈ శిబిరంలో జిల్లా సిడబ్ల్యూసి చైర్మన్ కె. ఉప్పలయ్య, యాదాద్రి సిడబ్ల్యూసి చేర్ పర్సన్ బి.జయశ్రీ, జనగామ డిసిపిఓ, ఎల్.రవికాంత్, యాదాద్రి జిల్లా డిసిపిఓ, పి.సైదులు, బచపన్ బచావో ఆందోళన్ స్టేట్ కోఆర్డినేటర్ అందె వేంకటేశ్వర్లు, లయన్స్ ఇంటర్నేషనల్ పూర్వజిల్లా గవర్నర్ లయన్ కన్న పరశు రాములు, మెదక్ జిల్లా సిడబ్ల్యూసి మెంబర్ కే.ఉప్పలయ్య, స్కోప్ మెంబర్ సైదులు గౌడ్, జనగామ జిల్లా కోఆర్డినేటర్ జి.మనోజ్ కుమార్, యాదాద్రి జిల్లా కోఆర్డినేటర్ సోమనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ హరీష్ రాజ్

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్



సీజనల్ వ్యాధుల పట్ల ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి హరీష్ రాజ్ అన్నారు. మంగళవారం ఆయన డివిజన్‌కేంద్రంలో ఉన్నత శ్రేణి ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలో వైద్యుల హాజరుపట్టికను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య సేవలు అందించడంలో అప్రమత్తత అవసరమని వైద్యులకు సూచించారు. ఈ సీజన్‌లో రోగులకు అవసరమగు మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆసుపత్రిలోని పలు విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో ప్రధానంగా వాతావరణ మార్పులతో అంటూ వ్యాధులు ప్రభలే అవకాశం ఎక్కువగా ఉంటుందని, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ వీరాంజనేయులు, డాక్టర్ సంధ్య, డాక్టర్ జనార్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

కరెంటు బిల్లులు యాప్‌లోనే చెల్లించండి

నవతెలంగాణ-పాలకుర్తి రూరల్

విద్యుత్ శాఖ బిల్లులను యాప్ లోనే చెల్లించాలని ఎన్‌పీడీసీఎల్ ఏడీఈ ఆర్.బాలగంగాధర్ తిలక్ అన్నారు. వినియోగదారులందరూ ప్రతినెల తాము చెల్లించవలసిన విద్యుత్ బిల్లులను ఇంతకాలం నేరుగా బిల్ కలెక్టరకు, ఇతర ఆన్లైన్ యాప్ ల ద్వారా గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం వంటి యాపుల ద్వారా చెల్లించేవారని ఇకనుండి విద్యుత్ వినియోగదారులందరూ డిపార్ట్‌మెంట్ యాప్ ద్వారానే తమ బిల్లుల చెల్లించాలన్నారు. గూగుల్ ప్లే స్టోర్ నుండి టిజియస్ పిడిసిఎల్ యాప్ డౌన్లోడ్ చేసి బిల్ పే అనే సెక్షన్ లో సర్వీస్ నెంబర్ యాడ్ చేసినట్లయితే తమ కట్టవలసిన బిల్లుమొత్తం ను చూపిస్తుందని తెలిపారు. ఈ విధముగా వినియోగదారులందరూ యాపు ద్వారానే తమ బిల్లులు చెల్లించవలసిందిగా వారు కోరారు.

బెల్ట్ షాపులను మూసి వేయించాలని వినతి

నవతెలంగాణ-తరిగొప్పుల



మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో లైసెన్సులతో రెండు వైన్‌షాపులు ఉండగా కూడా, ఎలాంటి అనుమతులు లేకుండా పదుల సంఖ్యలో ఏర్పాటు చేసుకున్న బెల్ట్ షాపుల్లో విచ్చలవిడిగా ఎలాంటి భయం లేకుండా విక్రయాలు సాగిస్తున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సై శ్వేత కి మంగళవారం కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో తరిగొప్పుల మండల మాజీ అధ్యక్షులు చిలువేరు సంపత్, సిరిగిరిదాసు, మండల జనరల్ సెక్రెటరీ పింగిలి ఇంద్రా రెడ్డి, ఎర్రవెల్లి పోషయ్య, మండల సోషల్ మీడియా ఇంచార్జ్ కొయ్యడరాజుగౌడ్, మండల యుత్ అధ్యక్షులు అరుణ్ రెడ్డి, కనకయ్య, మహేందర్, మైకల్, పోసిరెడ్డి, ఎర్రవెల్లి దానిల్, సుంకరి యాదగిరి, రవి, కొమురెల్లి, లక్ష్మీనారాయణ, జోసఫ్, అర్జుల కర్ణాకర్ రెడ్డి, ఎడెల్లి శ్రావణ్ రెడ్డి, సుంకరి అనిల్, బిక్షపతి, రాజు, విజయ్ పాల్గొన్నారు.

మతసామరస్యానికి మొహరం ప్రతీక

నవతెలంగాణ-బచ్చన్నపేట



మత సామరస్యానికి మొహరం ప్రతీక.మొహరం పండుగ మత సమరస్యానికి ప్రతిక అని కులమతాలకు అతీతంగా 10 రోజులపాటు హిందూ, ముస్లింలు కలిసి ఘనంగా జరుపుకునే పండుగ మొహరం అని విఎస్‌ఆర్‌నగర్ మాజీ సర్పంచ్ కోనేటి స్వామి, మొహరం గ్రామ అధ్యక్షులు రెడ్డబోయిన అశోక్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొహరం పండుగ మొదటిరోజు నుండి పదిరోజులపాటు గ్రామంలోని పీరీలతో చిన్న పెద్ద అందరూ కలిసిమెలిసి ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముజావర్ ఎండి.అన్వర్ కమిటీ సభ్యులు రెడ్డబోయిన సత్తయ్య, ముశిని శ్రీనివాస్, కోనేటి రాములు, మదర్ రెడ్డబోయిన సహదేవ్, ఆలేటి సిద్ధిరాములు, గుట్టల సిద్ధులు, తమ్ముడి బాబు , రెడ్డెం గోవర్ధన్, శ్రీరాముల హరి, నరసింహులు, ఆలేటి భాను పాల్గొన్నారు.

అష్టదళ పాద పద్మారాధన

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

చిల్పూర్ మండలం శ్రీ బుగులు వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం భక్తి శ్రద్ధలతో అష్టదళ పాదపద్మారాధన పూజపండితుల వేదమంత్రోచ్చరణలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోబి.లక్ష్మీప్రసన్న, బి. రవీందర్‌శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మహబూబాబాద్
బుధవారం జులై 17, 2024
www.navatelangana.com

తాడిచెట్టు పై నుంచి కింద పడి వ్యక్తికి గాయాలు



నవతెలంగాణ- ఇనుగుర్తి

తాటి చెట్టు పైనుండి ప్రమాదవశాత్తు కిందపడి గీత కార్మికుడికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు వేముల చిన్న యాదగిరిగౌడ్ రోజు మాదిరిగానే తాటి చెట్టు ఎక్కి కల్లు తీసి కిందకు దిగుతున్న క్రమంలో జారి పడగా తీవ్ర గాయాలు అయ్యాయి. అతనిని చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు తెలిపారు.

అభివృద్ధిపనులు వేగవంతం చేయాలి

- మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్
- బ్లీచింగ్ పౌడర్‌కే దిక్కులేదే : కౌన్సిలర్

నవతెలంగాణ- మరిపెడ

మున్సిపాలిటీ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. మంగళవారం మరిపెడ పురపాలక సంఘం సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ గుగులోతు సింధూర రవినాయక్ అధ్యక్షతన నిర్వహించారు. అంతకుముందు మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో వనమహోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. 2024 -25 ఆర్థిక సంవత్సరంలో పారిశుద్ధ్య, ఇంజినీరింగ్, పరిపాలన, టౌన్ ప్లానింగ్ విభాగాల్లో చేసిన పనులకు, చేయాల్సిన పనులకు బడ్జెట్ ఆమోదించే



అంశాలపై ప్రత్యేక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. కాగా వార్డు కౌన్సిలర్ల వాదోపవాదనల మధ్య గందరగోళంగా బిల్లుల ఆమోదం చేశారు. ఈ సందర్భంగా వార్డ్ కౌన్సిలర్ పరశురాములు, కిషన్ నాయక్, బిక్షం, శ్రీనివాస్ మాట్లాడుతూ గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు అమలైన అంశాలను తెలియపరచాలని పట్టుబట్టారు. బడ్జెట్ లెక్కలన్నీ కాగితాలకి పరిమితం అవుతున్నాయని, బిల్లులు ఆమోదం పొందినా అమలు కావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చేయని పనులకు కూడా బడ్జెట్ కేటాయించి బలవంతంగా ఆమోదం చేయించడం సరైంది కాదని ఆందోళన వ్యక్తం చేశారు.



మున్సిపాలిటీలో కోతులు, కుక్కల బెడద నివారణకు నిధులు కేటాయించగా జరగలేదన్నారు. మున్సిపాలిటీలో వీధి లైట్లు ఏర్పాటు చేయడానికి గత కౌన్సిల్ సమావేశాల్లో తీర్మానించగా నేటికీ వీధిలైట్లు, సెంటర్ లైటింగ్ మరమ్మతులు చేపట్టలేదన్నారు. వీధులన్నీ బురదమయంగా ఉన్నాయని కనీసం మట్టి రోడ్ల అన్న వేయాలని వేడుకుంటున్నా పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ గతంలో ఏం జరిగిందో తనకు తెలియదని, ఇప్పటినుంచైనా కౌన్సిల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను పకడ్బందీగా అమలయ్యేలా అధికారులపై చర్యలు తీసుకుంటామని కౌన్సిలర్లకు హామీ ఇచ్చారు. పట్టణంలో పలు వీధిలలో కాలనీలలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా స్థానిక కౌన్సిలర్లు కృషి చేయాలని సూచించారు. గత బడ్జెట్ సమావేశంలో తీసుకున్న అంశాల ప్రకారంగా పట్టణంలో పెండింగ్ అభివృద్ధి పనులను పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. జనరల్ బడ్జెట్ నుండి అవసరం ఉన్న వాటికి నిధులు వాడాలని అన్నారు. మున్సిపాలిటీకి నిధులను సమకూర్చుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ డి సైదులు, మున్సిపల్ కమిషనర్ కుమారస్వామి, వైస్ చైర్మన్ ముదిరెడ్డి బుచ్చిరెడ్డి, కౌన్సిలర్లు వీసారపు ప్రగతి శ్రీ పాల్ రెడ్డి, బానోతు శ్రీనివాస్ నాయక్, రేఖ లలిత వెంకటేశ్వర్లు, మాచర్ల స్రవంతి భద్రయ్య, పానుగోత్ సుజాత వెంకన్న, బోడ పద్మ, ఊరుగొండ శ్రీనివాస్, బానోత్ కిషన్ నాయక్, బాదావత్ హతి రామ్ నాయక్, ఎడెల్లి పరశురాములు,భయ్యా బిక్షం, గంధసిరి ఉపేంద్ర, జాటోత్ కౌసల్య గణేష్, కో ఆప్షన్ సభ్యులు ఉప్పల నాగేశ్వరరావు, ఎస్.కె మక్బుదు, షేక్ ఖైరన్ ఖాన్ హుస్సేన్, వివిధ శాఖలకు చెందిన అధికారులు తదితరులు ఉన్నారు.

రోజు కూలి రూ.600 ఇవ్వాలి

వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు బాణాల రాజన్న



నవతెలంగాణ -మరిపెడ

పెరిగిన ధరలకు అనుగుణంగా వ్యవసాయ కార్మికులకు వేతన చట్టాలు సవరించి రోజు కూలి రూ.600 ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం(వ్యకాసా) మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు బాణాల రాజన్న డిమాండ్ చేశారు. మంగళవారం మరిపెడ మండల కేంద్రంలో కూలీలతో కలిసి ప్రచారం నిర్వహించారు. అనంతరం రాజన్న మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలో వచ్చినప్పటి నుండి పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్, నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని అన్నారు. దీంతో అర్ధాకలితో కార్మికులు బతికీడుస్తున్నారని అన్నారు. వ్యవసాయ రంగంలో సంవత్సరంలో 80 నుండి 100 రోజులు కూడా పని దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యాంత్రికరణ వల్ల పని దినాలు పడిపోయాయని అన్నారు. విద్య, వైద్యం ఖర్చులు కూలీలకు భారంగా మారాయని చెప్పారు. కనీస వేతనాల అమలుకు గ్రామాల్లో టామ్ టామ్ వేసి ప్రచారం చేసి కనీస వేతనాలు అమలయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల నాయకులు తాటికొండ అనంతచారి, అల్వాల మస్తాన్, వ్యవసాయ కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్లకు పట్టాలు ఇవ్వాలి : సీపీఐ

నవతెలంగాణ-మహబూబాబాద్

ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లకు ఇంటి పట్టాలు ఇవ్వాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన భూపోరాట కేసులో భాగంగా మంగళవారం నాయకులు కోర్టుకు హాజరై మాట్లాడారు ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న నిరుపేద ప్రజలందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటి కింద రూ.5 లక్షలు మంజూరు చేయాలన్నారు. గత ప్రభుత్వం 58, 59 జీవో కింద పట్టాలు ఇస్తానని ఇంతవరకు ఇవ్వలేదన్నారు. పేదలందరికీ వెంటనే జీవోలననుసరించి పట్టాలు ఇవ్వాలన్నారు, జిల్లావ్యాప్తంగా వామపక్ష నేతలపై పెట్టిన భూపరాటాలలో అక్రమ కేసులన్నీ ఎత్తివేయాలని కోరారు. కోర్టుకు సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి రేషపల్లి నవీన్, పోచారం కృష్ణ హాజరయ్యారు.

సీపీఐ మండల కార్యదర్శిగా బందు మహేందర్

నవతెలంగాణ-తొర్రూరు

తొర్రూరు మండలం కేంద్రంలోని లయన్స్ భవనంలో జరిగిన మండల నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. సీపీఐ తొర్రూరు మండల కార్యదర్శిగా బందు మహేందర్, సహాయ కార్యదర్శిగా పెరబోయిన కిరణ్ కుమార్ ఎన్నుకున్నట్టు జిల్లా కార్యదర్శి బి విజయ్ సారథి, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు తమ్మెర విశ్వేశ్వరరావు మంగళవారం ప్రకటించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి, కార్మికుల, ప్రజా సమస్యల పై ప్రత్యేక పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రజా పోరాటాలలో ముందుంటామని అన్నారు. తమ ఎన్నికకు సహకరించిన నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏ లో చేర్చాలి

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి శ్రీనివాస్

నవతెలంగాణ-తొర్రూరు

ముదిరాజ్‌లను బీసీ-డీ నుండి బీసీ -ఏ లోకి మార్చాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు గొడుగు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు కొత్తూరు రమేష్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి గంధం చంద్రమూర్తితో కలిసి ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ముదిరాజులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణా ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి అలువాల సోమయ్య, జిల్లా నాయకులు గుండా వెంకన్న, లింగాల పిచ్చయ్య, వివిధ గ్రామాల సొసైటీ అధ్యక్షులు శంకరబోయిన యాకన్న, పులుగుజ్జా రాంచంద్రు, బల్ల ప్రభాకర్,కొండా వెంకన్నకొండ ఉపేందర్, కుంట రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం : శ్రీనివాస్

నవతెలంగాణ-పెద్దవంగర

పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అన్ని విధాల అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తోటకూరి శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అవుతాపురం గ్రామానికి పగిడిపాల మల్లయ్య (50) అనారోగ్యంతో బాధపడుతు మంగళవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న శ్రీనివాస్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని, ఆపదలో వారికి భరోసా కల్పిస్తామని చెప్పారు. ఆయన వెంట గ్రామ పార్టీ అధ్యక్షుడు బొమ్మెర బోయిన రవి, ప్రధాన కార్యదర్శి పాలబిందెల సంపత్, మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు గద్దల స్వామి, సుధాకర్, చింత భాస్కర్, పాలబిందెల సంపత్, సత్తయ్య గోపాల్, హరీష్, గోపాల్, తదితరులు ఉన్నారు.

మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కో-కన్వీనర్ గుగులోతు సూర్య ప్రకాష్

నవతెలంగాణ-గూడూరు

పెరిగిన ధరలకు అనుగుణంగా గురుకులాల్లో మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కో కన్వీనర్ గుగులోత్ సూర్య ప్రకాష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో దామరవంచలోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలను సందర్శించారు. అనంతరం సూర్య ప్రకాష్ మాట్లాడుతూ జిల్లాలో చాలా గురుకులాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయని, వాటికి సొంత భవనాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. విద్యారంగానికి 30 శాతం బడ్జెట్ కేటాయించాలని, ప్రభుత్వ విద్యా రంగా సంస్థలను బలోపేతం చేయాలని అన్నారు. అనంతరం గురుకుల పాఠశాల కమిటీని ఎన్నుకున్నారు. గురుకుల పాఠశాల అధ్యక్ష కార్యదర్శులుగా రాంచరణ్, తిలక్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రంలో సందర్శనల ఎస్ఎఫ్ఐ నాయకులు నగేష్, అనిల్ పాల్గొన్నారు.

ప్రయివేట్ స్కూల్స్‌కు ధీటుగా...


ఎల్లంపేట సెక్టార్ సూపర్వైజర్ ఎం శ్రీలత

నవతెలంగాణ -మరిపెడ



ప్రయివేట్ స్కూల్స్‌కు ధీటుగా అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తు న్నాయని ఎల్లంపేట సెక్టార్ అంగన్‌వాడీ సూపర్వైజర్ శ్రీలత అన్నారు. మంగళవారం అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎల్లంపేట అంగన్‌వాడీ-3, వెంకంపాడు లో సూపర్వైజర్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాలు ఉన్న పిల్లలందరినీ సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని, ఇందుకు అవగాహన ర్యాలీనీ నిర్వహిస్తున్నామన్నారు. పిల్లలకు పౌష్టికాహారం అందిస్తారని అన్నారు. అంగన్‌వాడీ టీచర్ విజయ కుమారి, టి స్వర్ణ, సిఏలు రజిత, గీత, ఆశా వర్కర్ జ్యోతి, గ్రామ కార్యదర్శి సురేష్, కారోబార్ హుస్సేన్ పాల్గొన్నారు.

వీరారంలో..



మండలంలోని వీరారం అంగన్‌వాడీ-1, 2 కేంద్రాలలో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు గంట కవిత, ఏర్పుల శ్రీవాణి, ఆయమ్మ నాగలక్ష్మి, ఏఎన్ఎం మోహినమ్మ, తదితరులు పాల్గొన్నారు.

22న దాశరథి జయంతి ఉత్సవాలు

- ఎమ్మెల్సీ రవీందర్‌రావు

నవతెలంగాణ-చిన్నగూడూరు

ఈ నెల 22న జరిగే దాశరథి కృష్ణమాచార్యుల 99వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు ఎమ్మెల్సీ రవీందర్ రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని దాశరథి సోదరుల విగ్రహాల ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పార్టీలకు అతీతంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీందర్‌రావు పాల్గొని మాట్లాడారు. దాశరథి జయంతి సందర్భంగా రాబోయే సంవత్సరం పాటు



శత జయంతి ఉత్సవాలకు శ్రీకారం చుట్టనుందని అన్నారు. దాశరథి కృష్ణమాచార్యులు సాహిత్య పరంగా, ఉద్యమకారుడిగా, ముఖ్యంగా తెలంగాణ విముక్తికై తన కలాన్ని ఆయుధంగా మలచి నిజాం రాక్షస పాలనకు చరమగీతం పాడారని అన్నారు. ఈ ఉత్సవ ప్రారంభ సభకు ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, కవి నందిని సిద్ధారెడ్డి, మహబూబాబాద్ ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరవుతున్నట్లు తెలిపారు. అనంతరం దాశరథి శతజయంతి ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా గునిగంటి కమలాకర్, కమిటీ సభ్యులుగా మోహన్, శంకరయ్య, నరసయ్య, సురేష్, సోమన్న, చందులల్,లక్ష్మణ్, నారాయణ, బ్రహ్మం, అనిల్, నరేష్, నరేందర్, నవీన్, తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మానుకోట మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకన్న, రావుల ప్రమోద్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పిల్లి వీరన్న, వేణు, కన్నా తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలను బలోపేతం చేస్తాం

- ఏపీడీ జయశ్రీ



నవతెలంగాణ-పెద్దవంగర

జిల్లా వ్యాప్తంగా మహిళా సంఘాలను ఆర్థికంగా మరింత బలోపేతం చేస్తామని ఏపీడీ జయశ్రీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నాబార్డ్ సహకారంతో, లక్ష్యం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న మిల్లెట్ ఆహార ఉత్పత్తుల తయారీ కేంద్రాన్ని డీపీఎంలు నళిని నారాయణ, చంద్రశేఖర్‌తో కలిసి సందర్శించారు. వివిధ మిల్లెట్ తినుబండారాల తయారీ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇందిరమ్మ మహిళ శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘం సభ్యులకు బ్యాంకు లింకేజీ రుణాలను అందజేస్తామని అన్నారు. మిల్లెట్ ఆహార ఉత్పత్తుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. సోషల్ మాధ్యమాల్లో ఆహార ఉత్పత్తుల మార్కెటింగ్ చేపట్టాలని సూచించారు. మహిళలందరూ స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలన్నారు. వత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకుని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రమణాచారి, సీసీలు జి సుధాకర్, పద్మ, సుజాత, బి. సుధాకర్, మార్కెటింగ్ అధికారి ఝాన్సీ, స్టాక్ నెంబర్ కీర్తన, వర్కర్స్ రమ, సునీత, రమాదేవి, శోభ తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియా నివారణకు డీఈసీ : డీఎంహెచ్ఓ

నవతెలంగాణ-మహబూబాబాద్

ఫైలేరియా నివారణకు డీఈసీ టాబ్లెట్లు అందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కళావతి భాయి అన్నారు. మంగళవారం మహబూబాబాద్ పట్టణం లోని ఐఎంఏ భవనంలో జాతీయ ఫైలేరియా నియంత్రణలో భాగంగా బోధ వ్యాధి నివారణకు మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమం కోసం 6 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల, వాటి ఉప కేంద్రాల సిబ్బంది, వైద్యాధికారులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఎంహెచ్ఓ హాజరై మాట్లాడారు. ఫైలేరియా ముఖ్యంగా మురుగు నీటిలో పెరిగే క్యూలెక్స్ దోమ వల్ల ఒకరి నుండి ఒకరికి వ్యాపిస్తుందని అన్నారు. పరిసరాల పరిశుభ్రత, మురుగునీరు నిల్వ ఉండకుండా చూడడం, దోమలు పెరిగే ప్రాంతాలను గుర్తించి నివారించడం వంటివి చేపట్టాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని అన్నారు. జిల్లాలోని కోమట్లగూడెం, గంగారం, కొత్తగూడ,బయ్యారం, ముల్కనూరు, గంధంపల్లి, పీహెచ్‌సీ పరిధి వైద్యాధికారులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, హెచ్ఈఓస్, సూపర్వైజర్స్, ఎంఎల్‌హెచ్‌పీలకు ఈ శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. సిబ్బంది అందరూ హాజరై విజయవంతం చేయాలని అన్నారు. కాగా జోనల్ మలేరియా ఆఫీసర్ డాక్టర్ సునీల్‌కుమార్ పాల్గొని సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. 10-08-



2024 నుండి 25-08-2024వరకు డిఇసి టాబ్లెట్లను, ఆల్బెండజోల్, ఐవర్మెట్రిన్ పంపిణీ చేరిస్తున్నామన్నారు. రెండు సంవత్సరాల లోపు పిల్లలకు గర్భిణీలకు, దీర్ఘకాల వ్యాధులు ఉన్న వారికి డీఈసీ టాబ్లెట్లు ఇవ్వొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ అంబరీష, డాక్టర్ మురళీధర్, డాక్టర్ నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు డిప్యూటీ డైరెక్టర్ మలేరియా, నాగయ్య అడిషనల్ డైరెక్టర్, ఎన్వీబీడిసి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధీర్ రెడ్డి, డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ డాక్టర్ శిరీష, హెల్త్‌ఎడ్యుకేటర్ పురుషోత్తం, కెవి.రాజు, గీత, సబ్ యూనిట్ ఆఫీసర్ వడ్డబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలి : పీడీఎస్‌యూ

నవతెలంగాణ-గార్ల

పెండింగ్ లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌ను తక్షణమే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మాదారాపు నాగరాజు డిమాండ్ చేశారు. ప్రభుత్వ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా విద్యార్థులకు ఫీజులు చెల్లించకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరం అయ్యే పరిస్థితి నెలకొందన్నారు. గత ప్రభుత్వాలు అనుసరించిన విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తే విద్యార్థులు నష్టపోయే అవకాశం ఉందని చెప్పారు. బకాయిలు చెల్లించకుంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ రవీందర్‌కు వినతిపత్రం అందించారు. అంతకుముందు జూనియర్ కళాశాల నుండి పురవీధుల గుండా తహసీల్దార్ కార్యాలయం వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు నరేష్, వినయ్, విద్యార్థులు దివ్య, ఉషారాణి, ప్రవళిక, భాను శ్రీ, రజిత, చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ స్పందించాలని ఐద్వా రాస్తారోకో

నవతెలంగాణ-గార్ల

స్థానిక ఆస్పత్రి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతున్నారు. అయినా ఉన్నత అధికారులు స్పందించడం లేదని, జిల్లా కలెక్టర్ అద్వైత్వ కుమార్ సింగ్ అయినా స్పందించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కందునూరి కవిత, మండల కార్యదర్శి అలవాల సత్యవతి డిమాండ్ చేశారు. స్థానిక 30పడకల ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులను నియమించాలని కోరుతూ ఐద్వా అధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్ష మంగళవారం రెండవ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ఇప్పటికే ప్రబలుతున్నాయని, కొంత మంది వైద్యులు, సిబ్బంది బదిలీలపై వెళ్తున్నారని ప్రజలకు వైద్యం



అందించే నాధుడే కరువైయ్యారని అన్నారు. వర్షాకాలంలో జ్వరాలు వస్తే ప్రయివేట్ హాస్పిటల్ లో వైద్యం కోసం ఒక్కొక్క ఇంటికి సుమారుగా రూ.5-10వేలు వైద్య ఖర్చులు అవుతాయని అన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య అధికారి స్పందించి తక్షణమే వైద్య అధికారులతో పాటు, మహిళ వైద్యురాలును నియమించాలని డిమాండ్ చేశారు.

సీపీఐ(ఎం) మద్దతు

రెండు రోజుల నుండి ఆందోళన చేస్తున్న అధికారులు స్పందించక పోవడంతో స్థానిక నెహ్రూ సెంటర్‌లో సుమారు గంట పాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ అందోళనకు సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు మల్లెల నాగమణి,మాజీ ఎంపిటీసి వి.పద్మ, నాయకులు సిహెచ్ సి.మౌనిక, తాళ్లపల్లి రమా, టి.నాగమణి, పద్మ, బి.ఝాన్సీ, బి.జ్యోతి,మరియమ్మ, వాణీ, అనూష, బి.లక్ష్మీ యశోద తదితరులు ఉన్నారు.

హెల్ప్‌లైన్ సెంటర్స్ ఏర్పాటు చేయాలని డీడికి వినతి

నవతెలంగాణ-గూడూరు



గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఉపాధ్యాయులు నాన్ టీచింగ్ బదిలీల పదోన్నతులకు హెల్ప్ లైన్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ మంకిడి ఎర్రయ్యకు వినతిపత్రం అందజేశారు. ఇటీవల వెలువడిన గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఉపా ధ్యాయులు, నాన్ టీచింగ్ బదిలీలు, పదోన్నతుల 35 రోజుల షెడ్యూల్ విడుదల కావడం జరిగిందని అన్నారు. మొదటిసారిగా ఆన్లైన్, వెబ్ ఆప్షన్ పద్ధతిని అవలంభించడంతో సాంకేతిక సమస్యలు, సందేహాల నివృత్తి కోసం మహబూబాద్ జిల్లాలోని ఆయా ఏటిడిఓ పరిధి కంప్యూటర్ పరిజ్ఞా నం ఉన్న ఇద్దరు ఉపాధ్యాయుల చొప్పున ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పిస్తూ హెల్ప్ లైన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏటిఏ జిల్లా అధ్యక్షులు పెనుక ప్రభాకర్, ముయ్యబోయిన వెంకన్న, రేగ పాపారావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆస్తి తీసుకుని రోడ్డుపై వదిలేసి...!

న్యాయం చేయాలని ఓ వృద్ధురాలి వేడుకోలు

నవతెలంగాణ-గార్ల

కన్న పేగు బంధాన్ని దూరం చేస్తూ మానవత్వాన్ని మరిచిన కుమారులు సొంత మాతృమూర్తిని ఆస్తి తీసుకుని రోడ్డుపై వదిలి వేసిన హృదయ విధారకర సంఘటన మంగళవారం గార్ల మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానపికుల కథనం ప్రకారం... మండల కేంద్రం లోని జెండా బజార్‌కు చెందిన వృద్ధురాలు నర్సమ్మకు ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆమె బాగోగులు ప్రతి నెలకు ఒకరు చొప్పున చూసుకుంటామని చెప్పి తల్లి పేరు మీద ఉన్న 3 ఎకరాల భూమి, ఇల్లును కుమారులు తీసుకుని రోడ్డుపై వదిలేశారు. ఉన్న ఒక్క రూమ్‌ను ఇటీవల కూలగొట్టారు. పెద్ద మనషుల వద్దకు వెళ్లి గోడు చెప్పుకున్నా ఎవరు పట్టించుకోలేదు. దీంతో ఆ మాతృమూర్తి కన్నీరు మున్నీరైన ఘటన పలు సోషల్ మీడియా గ్రూపులలో వైరల్ అయింది. ఇలాంటి కుమారుల పట్ల పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అలాగే తన ఆస్తిని తీసుకుని రోడ్డుపై వదిలి వెళ్ళిన తన కుమారుల నుండి న్యాయం చేయాలని పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులను వృద్ధురాలు నర్సమ్మ వేడుకుంటోంది.



యువకుడి హత్య కేసులో నిందితుడి అరెస్ట్

నవతెలంగాణ-కేసముద్రం రూరల్

కేసముద్రం గ్రామ పరిధిలో చైతన్య నగర్ కాలనీలో వ్యక్తిగత కారణాలతో ఓ వ్యక్తిని కొట్టి చంపిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు. మంగళవారం కేసముద్రం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీఐ వివరాలు తెలిపారు. కేసముద్రం గ్రామానికి చెందిన జిలకర నాగరాజు, వల్లందాస్ నగేష్ మధ్య కొంతకాలంగా వ్యక్తిగత విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నగేష్, నాగరాజు మధ్య వివాదం జరిగింది. నాగరాజు తలపై నగేష్ కర్రతో కొట్టి గొంతు నులిమి హత్య చేశాడు. ఈ ఘటనలో నిందితుడైన నగేష్‌ను మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ వివరించారు. ఈ సమావేశంలో ఎస్సై వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ 6
సమగ్ర తెలుగు దినపత్రిక
వరంగల్-ములుగు
బుధవారం జులై 17, 2024 www.navatelangana.com



ముదిరాజ్‌ల న్యాయమైన కోర్కెలను నెరవేర్చాలి

నవతెలంగాణ-పర్వతగిరి

ముదిరాజ్‌ల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలో మండలంలోని అన్ని గ్రామాల ముదిరాజ్ కులస్తులు స్థానిక అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసిల్దార్ టి.వెంకటస్వామి కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కులస్తులు నీరటీ వెంకన్న, పిట్టల రాజు, గుండా రాకేష్, సూర అశోక్ , సూర రమేష్ , కొత్తూరు రామ్మోహన్,చిరుత విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 18న శ్రీరాజరాజేశ్వర దేవాలయంలో.. వేలం పాటలు

నవతెలంగాణ-పర్వతగిరి

వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద లోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో ఈనెల 18 న వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి అద్దంకి నాగేశ్వర్ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెంకాయలు, పూజా సామగ్రి అమ్ముకొను హక్కుకు రూ.20 వేలు, కొబ్బరి ముక్కలు పోగుచేసుకునే హక్కులకు రూ.10 వేలు, సొమ్ము చెల్లించి పాటకు అర్హులని తెలిపారు. ఈ వేలం పాట దక్కించుకున్నవారికి కాలం 19- 07- 2024 నుండి 18 - 07- 2025 వరకు మాత్రమే వుంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎస్‌పీఆర్ నగర్‌లో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-కాశిబుగ్గ



దేశాయిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం 12వ డివిజన్ పరిధిలోని ఎస్‌పీఆర్‌నగర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భరత్ కుమార్, వైద్య సిబ్బంది కాలనీవాసులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్థానిక కార్పొరేటర్ కావటి కవిత రాజు యాదవ్ మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటిని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పేదలు ఎక్కువ నివసించే ఇలాంటి ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. ఈకార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సూపర్ వైజర్ జన్ను కోర్నెల్, ల్యాబ్ టెక్నీషియన్ రజియా, ఏఎన్ఎం జ్యోతి ఆశా వర్కర్లు సుమలత, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు..

నవతెలంగాణ-చెన్న రావుపేట

కల్లు గీత వృత్తిలో ప్రమాద నివారణకు గీతా కార్మికులకు సేఫ్టీ మోకు లు పంపిణీ చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి మండల గీత సంఘం డైరెక్టర్ మాచర్ల ఎల్లగౌడ్ మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. కళ్ళు గీత వృత్తిలో సంవత్సరానికి 500 మంది కి పైగా సరిపోతున్నారని అందులో కొందరు వికలాంగులు అవుతున్నారన్నారు. బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం చొరవతో సేఫ్టీ మోకు డెమోను ఇప్పించడం జరిగిందన్నారు. కల్లుగీత కార్మిక సంఘం చేసిన సూచనలతో రూపుదిద్దుకున్న సేఫ్టీమోకులు లష్కర్ గోడలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించి వాటిని పంపిణీ చేసినందుకు మండలం మోకు దెబ్బ తరపున కృతజ్ఞతలు తెలిపారు. అందుకు కృషి చేసిన బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశంకు , మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కష్ణారావు , ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి కార్పొరేషన్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

సెల్ ఫోన్ చోరీ..

నవతెలంగాణ-ఖానాపురం

కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది సెల్ ఫోన్ ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించిన ఘటన మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో చోటుచేసుకుంది. బాధితుడు అందించిన వివరాల ప్రకారం.. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆఫీస్‌సబార్డినేట్ గా విధులు నిర్వహిస్తున్న చంద్రమొగిలి, కార్యాలయంలోని టేబుల్‌పై సెల్ ఫోన్ ఉంచి పనిలో నిమగ్నం కాగా ప్రజా పాలన దరఖాస్తుల సవరణ కోసం వచ్చిన పలువురిలో గుర్తుతెలియని వ్యక్తులు సెల్‌ఫోన్ ను దొంగలించినట్లు తెలిపారు. అనంతరం బాధితుని ఫోన్‌కి పలుమార్లు సిబ్బంది ఫోన్ చేయగా సెల్‌స్విచ్ ఆఫ్ వచ్చినట్లు పేర్కొన్నారు. తదుపరి పలువురికి ఫోన్ చేసిన ప్రయోజనం లేకపోవడంతో పోగొట్టుకున్న ఫోన్ ఐఎంఈఐ నెంబర్ సేకరించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

మహిళా సంఘాలకు 30 కుర్చీల బహూకరణ

మాజీ సర్పంచ్ దంపతులకు సన్మానం..




నవతెలంగాణ- నెక్కొండ

మండలంలోని పత్తిపాక గ్రామంలో ప్రతినెల మహిళ సంఘాల మహాసభను వర్షాకాలంలో కింద కూర్చోవడానికి మహిళలు ఇబ్బంది పడుతున్న విషయమై మాజీ సర్పంచ్ లావుడ్య-సరితాతిరుమల్ మహిళా సంఘాలకు 30 కుర్చీలను బహూకరించారు. ఈసందర్భంగా మహిళా సంఘాల సభ్యులకు కుర్చీలు అందించడంతో హర్షం వ్యక్తం చేస్తూ మాజీ సర్పంచ్ దంపతులను శాలువాతో సన్మానించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యుగంధర్, కార్యదర్శి వంటేరు రాకేష్, మాజీ వార్డు మెంబర్ బొల్లెబోయిన రమాసురేష్, గ్రామస్థులు పసునుటీ లక్ష్మీనారాయణ, ఏపిఎం శ్రీనివాస్, సిసి, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

బాలుడి మృతి పై డిప్యూటీ డీఎంహెచ్‌వో విచారణ


నవతెలంగాణ-నెక్కొండ



నెక్కొండ మండలం ముదిగొండ గ్రామంలో పదేళ్ల బాలుడు మణిదీప్ మృతి ఘటనపై సోషల్ మీడియాలో వైరల్ అయిన ఘటనపై మంగళవారం వరంగల్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రకాష్ విచారణ జరిపారు. ముదిగొండలోని మృతుడు మణిదీప్ ఇంటికి వైద్య సిబ్బందితో చేరుకొని బాలుడి తండ్రిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలుడు తండ్రి స్థానిక ఆర్ఎంపీ అశోక్ వద్ద బాలుడికి దద్దుర్లు వచ్చిన నేపథ్యంలో చూపించుకున్నారే తప్ప ఎలాంటి టీకాలు వేయలేదని బాలుడు తండ్రి విచారణలో వెల్లడించినట్లు డాక్టర్ ప్రకాష్ చెప్పారు. సోషల్ మీడియాలో తెలిసి తెలియక పలువురు ఆరోపణలు చేస్తున్నారని బాలుడు తండ్రి ఈసందర్భంగా విలేకరులతో తెలిపారు.

ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిసిన బిఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-నల్లబెల్లి



వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల బదిలీలు నిర్వహించగా నల్ల బెల్లి పోలీస్‌స్టేషన్ కి నూతనంగా వచ్చిన ఎస్సై ప్రశాంత్‌బాబును మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు మం గళ వారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు బానోతు సారంగపాణి మాట్లాడుతూ ప్రజల కోసం చేసే పనులకు తమ వంతు సహాయ సహ కారాలు అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల నాయకులు చెట్టుపల్లి మురళీధర్, కొత్తపల్లి కోటిలింగా చారి, ఉడుగుల ప్రవీణ్ గౌడ్, మోహన్ రెడ్డి, శ్రీనివాస్ గుప్తా, రాజారాం, ఇతర మండల నాయకులు పాల్గొన్నారు.

మండల స్పెషల్ ఆఫీసర్ గా డీఎవో విజయ్‌చంద్ర బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-గోవిందరావుపేట



మండల స్పెషల్ ఆఫీసర్ గా డీఏఓ విజయచంద్ర మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఈసందర్భంగా ఎంపీడీవో జి.జవహర్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ గా విజయచంద్ర ను సిబ్బందితో కలిసి స్వాగతం పలుకుతూ సన్మానించారు. మండల పరిషత్ కార్యాలయ సిబ్బందిని చేయడమే కాకుండా సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ప్రజా ప్రతినిధులను కూడా పరిచయం చేశారు. మండలం అభివద్ధికి కృషి చేయాలని, ప్రజా ప్రతినిధులు కృతజ్ఞతా భావంగా స్పెషల్ ఆఫీసర్ విజయచంద్రను కోరారు. అందరికీ అందుబాటులో ఉంటూ అభివద్ధికి కృషి చేస్తానని స్పెషల్ ఆఫీసర్ విజయ్ చంద్ర తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధుల వ్యాప్తి నివారణ...



పెండింగ్ పన్నుల వసూళ్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ.

నవతెలంగాణ-ములుగు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అడ్డుకట్ట వేయవచ్చని, పారిశుధ్య నిర్వహణను అత్యధిక ప్రాధాన్యతతో చేపట్టాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి శ్రీజ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పారిశుద్ధ్యంపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దష్టి సారించాలని అన్నారు. ప్రతి రోజూ రోడ్లను పూర్తి స్థాయిలో శుభ్రం చేయాలని, డ్రైనేజీలను క్లీన్ చేయాలని, రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా, రోడ్లపై ప్లాస్టిక్ కనిపించకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి రోజూ ఉదయం వార్డ్ అధికారులు, సానిటేషన్ సూపర్ వైజర్ లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పారిశుద్ధ్య నిర్వహణ చేసేలా పర్యవేక్షించాలని అన్నారు. పారిశుధ్య నిర్వహణలో అలసత్వం ఉంటే ఎక్కువ సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంటాయని అన్నారు.జిల్లాలో పారిశుధ్య పనులు ఆశించిన స్థాయిలో జరగటం లేదని, అనేక ప్రాంతాల్లో రోడ్డుపై నీరు నిల్వ ఉండటంగమనించామని అన్నారు. గ్రామాలలో ఫాగింగ్ రెగ్యులర్ గా చేయాలని, వర్షం పడిన తర్వాత నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, దోమలు పెరగకుండా ఆయిల్ బాల్స్ వేయాలని ఆమె సూచించారు. నీరు నిల్వ ఉండటం ద్వారా దోమలు పెరిగి వ్యాధిగ్రస్తులు అవుతారనే అంశాన్ని ప్రజల్లోకి విస్తతంగా ప్రచారం చేయాలని సూచించారు. గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లతో సమన్వయం చేసుకొని ప్రజలకు పారిశుధ్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామాలలో నీరు నిల్వ అధికంగా ఉండే వల్నరబుల్ ప్రాంతాలను గుర్తించి అక్కడ నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలాల పరిధిలో ఉన్న రెసిడెన్షియల్ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, సంక్షేమ హాస్టల్ లను నేరుగా తనిఖీ చేసి పరిసరాలు పరిశుభ్రం చేయాలని, నీరు నిల్వ ఉండకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని, వంట చేసే ప్రాంతాలలో పాటించాల్సిన జాగ్రత్తలు గురించి వివరించాలని, ఫుడ్ పాయిజనింగ్, సీజనల్ వ్యాధులు వ్యాప్తి కాకుండా చర్యలు తీసుకోవాలని మండల పంచాయతీ అధికారులను ఆదేశించారు. ప్రతి శుక్రవారం గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు క్షేత్ర స్థాయిలో ఉదయం 7 గంటలకు పర్యటిస్తూ డ్రై డే నిర్వహించాలని అన్నారు.జిల్లాలో ప్లాస్టిక్, చెత్త అధికంగా ఉండటానికి వీలు లేదని, జిల్లాలో ఉన్న డ్రెయిన్ లను రెగ్యులర్ గా శుభ్రం చేయాలని అన్నారు. సెగ్రిగేషన్ షెడ్ పూర్తి స్థాయిలో వినియోగం లోకి తీసుకుని రావాలని అదనపు కలెక్టర్ పంచాయతీ కార్యదర్శులను సూచించారు. జిల్లాలో ఉన్న ట్రాక్టర్ ద్వారా ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ జరగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ వెంకటనారాయణ, ఎంపీడీవో లు ఎంపీ ఓలు,పంచాయతీ సెక్రెటరీలు, టెక్నికల్ అసిస్టెంట్ లు తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రత .. పోలీసుల బాధ్యత: ఏసీపీ

నవతెలంగాణ - చెన్నారావుపేట



డ్రగ్స్ ,గంజాయి లాంటి మాదకద్రవ్యాలకు అలవాటు పడి బంగారం లాంటి మానవ జీవితాన్ని నాశనం చేసుకోవద్దని వరంగల్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ఆర్.నాగేశ్వరావు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని జయముఖీ అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో నర్సంపేట ప్రొహిబిషన్ పోలీసుల ఆధ్వర్యంలో ఎక్సైజ్ డిపార్టుమెంట్ జాతీయ సేవా పథకం పేరుతో నిర్వహించిన సమావేశానికి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసిపి, వరంగల్‌అసిస్టెంట్ ఎక్సైజ్ సుపెరింటెండెంట్ మురళీధర్, కళాశాల యజమాన్యం చంద్రశేఖర్‌రెడ్డి లతో కలిసి మాట్లాడుతూ మహిళల రక్షణ భద్రతకు పోలీస్ శాఖ ఎప్పుడు అందుబాటులో ఉంటుందని నేటి రోజుల్లో యువత సన్మార్గంలో నడిచి ఉన్నత ప్రయోజనాలను పొంది తల్లిదండ్రుల రుణం తీర్చుకోవాలని ఆయన సూచించారు. కొంతమంది యువత మాదక ద్రవ్యాలకు, వ్యాసనాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ గంజాయి మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడం కోసం తెలంగాణ రాష్ట్ర పోలీసులతో పాటు యువత ముందుకు రావాలని సూచించారు. అనంతరం వరంగల్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెట్ మురళీధర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాలకు బానిసలవుతున్న యువతకు అవగాహన కల్పించడమే తమ సంస్థ ముఖ్య ఉద్దేశమని, ఎవరైనా మత్తు పదార్థాలు అమ్మినా, సేవించినా 8712584473కు సమాచారం అందించడం ద్వారా వారిపై తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని. పెద్దఎత్తున గంజాయి సమచారం అందించిన వారికి నగదు పురస్కారం కూడా అందజేయబడుతుందని, సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం చంద్రశేఖర్ రెడ్డి, శంకర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.జానకి , వైస్ ప్రిన్సిపాల్ డా.పి.శ్రీనివాసరావు , అకాడమీ డీన్ ఎండీ. హమీద్ పాషా, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సతీష్, ఫార్మసీ ఎన్ఎస్ఎస్ కో- ఆర్డినేటర్ అశ్విన్, వివిధ విభాగాల అధిపతులు కుమార్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శికి ఆత్మీయ సన్మానం..



నవతెలంగాణ - పర్వతగిరి

మండలంలోని గోపనపల్లి ఉన్నత పాఠశాలలో సాంఘిక ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ఎండీ అబ్దుల్ గఫార్ బదిలీపై వెళ్లిన సందర్భంలో పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గఫార్ మాట్లాడారు..రాష్ట్రంలో అన్ని ఉపాధ్యాయ సమస్యలను సాధించడంలో పీఆర్‌టీయూ కృషి ఎంతో ఉందన్నారు. ఎటువంటి జఠిలమైన సమస్యలను సాధించడంలో రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్ రెడ్డి కృషి ఎంతో ఉంటుందన్నారు. పాఠశాలలో పదవతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు 10/10 జీపీఎస్ సాధించిన వారికి ప్రోత్సాహకంగా నగదు బహుమతినిస్తూ ఈ సంవత్సరం రాసే పదవతరగతి పరీక్షలను 10/10 జీపీఎస్ సాధించిన వారికి నగదు బహుమతిగా రూ.5వేలు ఇస్తానని ఆయన ప్రకటించారు. అనంతరం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వనగోటి అశోక్ కుమార్ మాట్లాడుతూ ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నటువంటి పండిట్ , పీఈటీల ప్రమోషన్స్ సజావుగా జరిగినందున రాష్ట్ర శాఖకు అభినందనలు తెలిపారు. ఎండీ.అబ్దుల్ గఫార్, లింగమూర్తి, కే శ్రీధర్, ఎండి ఫరీద్, సదానందం, పూర్ణచందర్ తదితర ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూమండల శాఖ అధ్యక్షులు భూక్య రాములు, గెజిటెడ్ హెడ్మాస్టర్ భిక్షపతి, రాష్ట్ర అసోసియేషన్ కార్యదర్శి నరసింహారావు, దుంపేటి విశ్వనాథం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ రైతాంగాన్ని మోసం చేస్తున్న రేవంత్ ప్రభుత్వం..

రుణమాఫీ ఎగ్గొట్టేలా కాంగ్రెస్ ప్రభుత్వ మార్గదర్శకాలు

బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బానోతు సారంగపాణి

నవతెలంగాణ-నల్లబెల్లి



కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీపై విడుదల చేసిన మార్గదర్శకాలు తెలంగాణ రైతులను మోసం చేసే విధంగా, రైతుల రుణమాఫీ పూర్తిగా ఎగ్గొట్టేలా ఉన్నాయని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బానోతు సారంగపాణి అన్నారు. మండల కేంద్రంలోని బిఆర్ఎస్ మండల పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు సారంగపాణి మాట్లాడుతూ ప్రభుత్వ గైడ్లెన్స్ పూర్తిగా రైతు వ్యతిరేకంగా ఉన్నాయి ఇది ముమ్మాటికి రైతును మోసం చేయడమే అని ఖండించారు, రుణమాఫీ కి రేషన్ కార్డు ప్రతిపాదికగా పెట్టడం కుటుంబం ప్రతిపాదికగా చూపడం సరికాదని అన్నారు. రేషన్ కార్డుతో సంబంధం లేకుండా అర్హులైన రైతులకు రెండు లక్షల రుణమాఫీ ఖచ్చితంగా చేసి తీరాలని డిమాండ్ చేశారు. యువ రైతులు ఓట్లు కాంగ్రెస్‌కు వేయలేదా మాయమాటలు చెప్పి ఓట్లు దండుకోలేదా అన్నారు. ఇప్పటికైనా అర్హులైన ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ చేయాలని తెలిపారు. రెండు బ్యాంకుల్లో రుణం తీసుకుంటే.. లేదా ఒక్క బ్యాంకులో రెండు లక్షల కన్నా పైబడి రుణం తీసుకుంటే మిగిలిన పై మొత్తం చెల్లిస్తేనే రెండు లక్షల వరకు రుణమాఫీ అవుతుందనడం శోచనీయమన్నారు. పెట్టుబడి సహాయంగా ఇస్తామని చెప్పిన రైతు భరోసాను ఇంతవరకు ఇవ్వకుండా రైతులను మోసం చేస్తున్న రేవంత్ ప్రభుత్వం. కుటుంబంలో మహిళ పేరుమీద ఉన్నటువంటి కార్డులకే ప్రాధాన్యత ఇస్తామనడం, మిగతా కుటుంబ సభ్యులకు సంబంధించినవి పరిగణలోకి తీసుకోకపోవడం ఘోరమైన అన్యాయమన్నారు. రైతులను మోసం చేస్తున్న ఏకైక జీవో 567 విడుదల చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని విమర్శించారు. ఈకార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి కోటిలింగాచారి, మాజీ మండల శాఖ అధ్యక్షుడు ప్రవీణ్ గౌడ్, క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లు మోహన్ రెడ్డి, శ్రీనివాస్ గుప్తా, మోహన్‌రావు, రాజారాం, సాంబారావు, బట్టు సాంబయ్య, సట్ల శ్రీనివాస్, వైనాలా వీరస్వామి, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీ డైరెక్టర్లు, పార్టీ మండల నాయకులు, ఇతర కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు..

ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-పర్వతగిరి




మండలంలోని చింత నెక్కొండ వి ద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 12 ట్రాన్స్ ఫార్మర్ 11 కేవీ లైన్ విద్యుత్ తీగలు అత్యంత ప్రమాద కరంగా ఉన్నాయి .రైతులు తమ పంట పొలాలకు వెళ్లాలంటేనే బిక్కు బిక్కు మంటూ తమ ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని వెళుతున్నారు. గత రెండేళ్లుగా విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లనే తీగలు పంట పొలాల కిందకు వేలా డుతున్నాయని సంబంధిత అధికారులకు చెప్పినా ఎలాంటి ఫలితం లేదని ఆప్రాంత రైతులు చెప్తున్నారు. ఇంకా ఆలస్యం చేస్తే మనుష్యులు, జంతువులకు ప్రాణ నష్టం జరిగే ప్రమాదాలు లేకపోలేదని రైతులు తమ గోడును వెలిబుచ్చారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ప్రమాద కరంగా ఉన్న విద్యుత్ తీగలను మరమ్మత్తులు చేపట్టాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

అక్రమంగా మొరం తవ్వకాలు...

అక్రమ రవాణాను అధికారులు నియంత్రించాలి..

నవతెలంగాణ-పర్వతగిరి



వరంగల్ జిల్లా వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని నీలగిరిస్వామి తండా శివారు ఎస్సారెస్పీ కెనాల్ కు భవిష్యత్తు అవసరాలకు నిలువ ఉంచి నటువంటి మొరాన్ని హిటాచి టిప్పర్ల సహాయంతో వరంగల్‌కు తరలిస్తున్నారు. ఎస్సారెస్పీ అధికారులు మొరం తరలింపుకు రాయపర్తి మండలంలో పర్మిషన్ ఇస్తే వర్ధన్నపేట శివారులోని కెనాల్ కాల్వ నుంచి మొరం తరలిస్తున్నారు. అధికారులు, సంబంధిత అధికారుల నుండి అధిక మొత్తంలో చేతి వాటం పొందినట్లుగా, అందుకే అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తూ నిద్రపోతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ రోజూ ఎక్కడో ఒక్క చోటా అక్రమార్కులు లాభార్జన కోసం తమ డేగ కన్ను వేస్తూ అధికారులను తమ గుప్పిట్లో పెట్టుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ సొమ్ము చేసుకుంటున్న ఉన్నతాధికారులు ఏంచేస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అక్రమ మట్టి మాఫీయా రవాణాను నియంత్రించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేశాం..

మాజీ ఎంపీపీ, మాజీ ఎంపీటీసలకు ఘన సన్మానం..

నవతెలంగాణ-గోవిందరావుపేట

ఎంపీటీసీలు, అధికారులు అందరం ఒకరికొకరు సమన్వయంతో మండల అభివృద్ధి కొరకు పని చేయడం జరిగిందని మాజీ ఎంపీపీ సూడి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జి.జేవహర్‌రెడ్డి అధ్యక్షతన మాజీ ప్రజాప్రతినిధులైన ఎంపీపీ ఎంపీటీసీల కు వీడ్కోలు సందర్భంగా సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వచ్చిన నిధులతో ఎక్కడ తక్కువ కాకుండా సమానత్వాన్ని పాటించి అభివద్ధికి కృషి చేశామన్నారు. జడ్పీటీసీ తుమ్మల హరిబాబు మాట్లాడుతూ సాధ్యమైనంత వరకు అధికంగా నిధులను తీసుకువచ్చి మండల అభివృద్ధిలో పూర్తిస్థాయిలో భాగస్వామ్యం అయినామన్నారు. పలు శాఖల అధికారులు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలు ఎంతో సమన్వయంతో పని చేశామని సర్వీసులు ఇంత సమన్వయంతో కొనసాగిన మండలం ఇదేనని అధికారులు ప్రశంసించారు. అభివృద్ధి కూడా అంచనాకు మించి జరిగిందన్నారు. అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు ఒకరినొకరు ఆత్మీయంగా కృతజ్ఞతలు తెలుపుకున్నారు. చివరలో అధికారులు ఎంపీటీసీలను, ఎంపీపీని గౌరవంగా శాలువాలతో సన్మానించారు. ఈసన్మాన కార్యక్రమం ఎంతో గౌరవంగా, ఆడంబరంగా సంతోషంగా జరిగిందని దీనిని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరు కృషి చేశారని అందరి భాగస్వామ్యం వల్లే ఈ కార్యక్రమం విజయవంతంగా ముగించడం జరిగిందని ఎంపీడీవో జవహర్‌రెడ్డి అన్నారు. చివరలో అధికారులకు, మాజీ ప్రజాప్రతినిధులకు, పలు రాజకీయ పార్టీల నాయకులకు విందు భోజనాలతో కృతజ్ఞతా భావంతో ముగింపు పలికారు.

ముదిరాజ్‌లను బీసీ-డీ నుండి బీసీ-ఏలోకి చేర్చాలి

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-గోవిందరావుపేట

బీసీ వర్గాల్లో అత్యధిక జనాభా కలిగి విద్య, ఆర్థికంగా వెనుకబడిపోయిన ముదిరాజ్ లను బీసీ-డీ నుండి బీసీ-ఏ గ్రూపు కు మార్చాలని జిల్లా మత్స్య పరిశ్రమల సహకార సంఘం అధ్యక్షులు సాదు రఘు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసిల్దార్ సృజన్ కుమార్ అందించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు సాదు రఘు, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చల్వాయి అధ్యక్షులు పురుగుజు వెంకన్న లు మాట్లాడుతూ ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా బీసీ-డీ గ్రూపు నుండి ముదిరాజులను బీసీ- ఏ గ్రూపులోకి చేర్చాలని అందుకు అన్ని విధాల సమర్థత కలిగి ఉన్నామనిన్నారు. నూటికి నూరు శాతం సబ్సిడీపై ఉచిత చేప పిల్లలను ముదిరాజ్‌లకు అందించాలని, రాజకీయంగా మంత్రివర్గంలో ఒకరికి శాసన మండలిలో ముగ్గురికి కార్పొరేషన్ స్థాయిలో 10 శాతంఅవకాశం కల్పించి రాజకీయంగా ఎదుగుదలకు దోహదపడాలన్నారు. ఈకార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ జిల్లా నాయకుడు పిట్టల వెంకటస్వామి, మండల ముదిరాజ్ నాయకులు కంకణాల నరసయ్య, నీరెడ్డి సాంబరాజు, బండి రాజు, బండి మల్లేశం, పులుగుజ్జు సతీష్, సతీష్, కమటం కిరణ్, కక్కు సాంబయ్య, ఆరే యాదగిరి, పిట్టల నరసయ్య, మారబోయిన సారయ్య, గోనెల రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాటాపూర్‌లో.. అమ్మ మాట అంగన్‌వాడీ బాట..

నవతెలంగాణ-తాడ్వాయి



మండలంలోని కాటాపూర్-2 అంగన్‌వాడీ కేంద్రం వద్ద మంగళవారం అమ్మ మాట అంగ న్‌వాడీ బాట కార్యక్రమాన్ని సూప ర్‌వైజర్ శారద, అంగన్వాడీ టీచర్లు, మాజీ సర్పంచ్ లతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు సంవత్సరాలు దాటిన పిల్లల పేర్లను ఇంటింటికి తిరిగి నమోదు చేసుకుంటామన్నారు. ఈపిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తెలిపారు. అంగన్వాడి కేంద్రంలో నర్సరీ తరగతులు ఇంగ్లీష్ మీడియంలో కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపించకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పుల్లూరి గౌరమ్మ, అంగన్‌వాడీ టీచర్లు సమ్మక్క, నిర్మల, శ్రీకళ, వెంకటలక్ష్మి, నాగమణి, జయమ్మ గర్భిణీలు బాలింతలు ఐకెపి గ్రూప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న రోడ్లు..





పాదచారులు, వాహనదారులు ఇక్కట్లు మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు



నవతెలంగాణ పెద్దవంగర

మండల వ్యాప్తంగా ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ ఛిద్రమైయ్యాయి. వర్షపు నీటికి ఆయా గ్రామాల్లో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి, నీటితో నిండుకుని చెరువును తలపిస్తున్నాయి. పెద్దవంగర పంచాయతీ పరిధిలోని పాత ఎస్సీ కాలనీలోని వీధులన్నీ వర్షాలకు అధ్వానంగా తయారయ్యాయి. చినుకు పడితే బురదమయం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇంట్లో నుండి బయటకు రావాలంటే జంకుతున్నారు. కాలనీలో సైడు కాలువలు లేకపోవడం వల్ల గతంలో వేసిన సీసీ రోడ్లు మీదనే వర్షపు నీరు నిల్వ ఉంటుంది. దీంతో దుర్గంధం వస్తుందని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. గత కొన్నేళ్ల నుంచి మురుగు నీటితో సావాసం చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షానికే కాలనీ పరిసరాల్లో నీరంతా చేరి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ రోడ్లలో ప్రయాణం చేయాలంటే నరకం అనుభవిస్తున్నాం అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోకాళ్లలోతు నీరు నిలువ ఉంటోందని వాపోతున్నారు. దీంతో ఈ వీదుల్లో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారినపడుతున్నారు. మండలంలో పలు గ్రామాల్లో సైతం వర్షం నీరు రోడ్డు మీదనే నిల్వ ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా పాలకులు, అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మురుగు నీరుతో ఇబ్బందులు పడుతున్నాం



చిన్న చిన్న వర్షానికి సైతం వీదుల్లో నీరు నిలుస్తుంది. సైడు కాలువలు లేకపోవడం వల్ల ఎక్కడి నీరు అక్కడే నివ్వడం తో దోమల తో ఇబ్బందులు పడుతున్నాం. విషజ్వరాల బారినపడి ఆరోగ్యం దెబ్బతింటోంది.

-సుంకరి రజిత,పెద్దవంగర

సైడు కాలువలు నిర్మించాలి



రోడ్ల మీదనే వర్షం నీరు నిల్వ ఉండడంతో ఇబ్బందులు పడుతున్నాం. నీటిలో నుండి వెలుతూ చిన్న పిల్లలు, వద్ధులు పడిపోతున్నారు. వెంటనే సైడు కాలువలు నిర్మించి, నీరు నిల్వ లేకుండా చూడాలి.

-చిలుక మహేష్, పెద్దవంగర

'రైతులకు కొర్రీలు పెట్టే ప్రభుత్వం కాంగ్రెస్'

నవతెలంగాణ -ఇనుగుర్తి

రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ పథకం అమలు కోసం విడుదల చేసిన మార్గదర్శకాలపై ఇప్పటికే ఆందోళన వ్యక్తం అవుతుందని, అందరికీ రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ సర్కారు ఇప్పుడు ఇలా కొర్రీలు పెట్టడం ఏమిటని బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బొబ్బిలి మహేందర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న మార్గదర్శకాలను పరిశీలిస్తే లక్షలాది మంది రైతులకు రుణమాఫీ అందకుండా పోతుందని అన్నారు. చెప్పేదొకటి చేసేది ఒకటి అన్నట్లుగా కాంగ్రెస్ పార్టీకి అలవాటైందని ఎద్దేవా చేశారు. లక్షలాది మంది రైతులకు రేషన్ కార్డులు లేవని.. వేర్వేరు కుటుంబాలుగా విడిపోయి పంట రుణాలు తీసుకున్న వారికి విడిగా రేషన్ కార్డులు రాలేదని అన్నారు. రేషన్ కార్డు లేని వారికి రుణమాఫీ వర్తించకపోవడం, పాత రేషన్ కార్డుల్లో ఒకే కుటుంబంగా ఉన్న వారందరికీ కలిపి రూ. 2 లక్షల లోపే రుణమాఫీ, ఎక్కువ అప్పు తీసుకున్న రైతులను తిరిగి మళ్లీ బ్యాంకులలో పై డబ్బులు కడితేనే రుణమాఫీ చేస్తామనడం సరికాదన్నారు. ఇప్పటికైనా ఎలాంటి షరతులు లేకుండా రైతు రుణమాఫీ, రైతుబంధు అమల్జేయాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు పరచాలన్నారు. ఇప్పటికే నిరుద్యోగులు మీ మోసాన్ని గ్రహించి రోడ్లమీదకు వస్తున్నారని బీఆర్ఎస్ పార్టీకి ఉద్యమాలు కొత్త కాదని మళ్లీ రోడ్లమీదకి రావడం జరుగుతుందని వారు హెచ్చరించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : డీఎంహెచ్ఓ మధుసూదన్

నవతెలంగాణ-చిట్యాల



సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వైద్యులు రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యాన్ని అందించాలని డీఎంహెచ్ఓ మధుసూదన్ అన్నారు మంగళ వారం మండలంలోని ఒడితల పీహెచ్సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్సీలోని పలు రికార్డులను పరిశీలించారు. పీహెచ్సీలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై, దవఖానాలో నిల్వ ఉన్న మందులపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది సకాలంలో హాజరుకావాలని, సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న వేళ రోగులకు అందుబాటులో ఉండాలని సూచించారు. మెరుగైన వైద్యం అందించుటలో అలసత్వం వహిస్తున్న వారి పట్ల సహించేది లేదని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఆరోగ్య కార్యక్రమాల రికార్డులను తనిఖీ చేశారు. పీహెచ్సీలో వైద్య సేవలుపై సంతృప్తిని వ్యక్తపరిచారు. ఆయన వెంట మెడికల్ ఆఫీసర్ రాగళ్ల మౌనిక, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

భూపాలపల్లి సింగరేణి ప్రస్థానం @36 ఏళ్లు



కాకతీయఖని-1 ని ప్రారంభించిన ఎన్టీఆర్

నేడు 2 ఓసీలు, 4 భూగర్భగనులు

భూపాలపల్లి నాడు కుగ్రామం

నేడు జిల్లా కేంద్రం

నవతెలంగాణ -కోల్‌బెల్ట్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సింగరేణి ప్రస్థానం ప్రారంభమై జూలై 15, 2024 కు 36 ఏండ్లు గడిచింది. 1988 జూలై 15 న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చేతుల మీదుగా కాకతీయ ఖని-1ఎ ఇంక్లైన్ ప్రారంభోత్సవం జరిగింది. ఆనాడు ఒక కుగ్రామంగా ఉన్న భూపాలపల్లి నేడు జిల్లా కేంద్రంగా విలసిల్లుతోంది. భూపాలపల్లి ఏరియాలో ప్రస్తుతం రెండు ఓసి గనులు, నాలుగు భూగర్భ గనులు కొనసాగుతున్నాయి. భూపాలపల్లి ఏరి నుండి బొగ్గు జిల్లా కేంద్రంలోని కేటీపీతోపాటు, దేశ వ్యాప్తంగా ఉన్న అనేక పరిశ్రమలకు నెలకు సగటున మూడు లక్షల టన్నులు సరఫరా చేయబడుతుంది. భూపాలపల్లిలో గనులు ప్రారంభమైన కొత్తలో సింగరేణి వ్యాప్తంగా వివిధ ఏరియాల నుండి ఉద్యోగులను భూపాలపల్లికి ట్రాన్స్‌ఫర్ చేయగా ఉద్యోగులు అనేక వ్యయ ప్రయా సలు కోర్చి, గ్రేడియంట్ మైనింగ్ లలో పనిచేయాలంటే చాలా ఇబ్బందులకు గురయ్యేవారు. ఆనాడు విధులకు హాజరు అవ్వాలంటే నానా రకాల ఇబ్బందులు మూలంగా గైర్హాజరు శాతం అధికంగా ఉండేది. అధికారుల సైతం అనేక భయాందోళనల మధ్య సుదూర ప్రాంతాల నుండి అప్ అండ్ డౌన్ చేసేవారు. ప్రస్తుత పరిస్థితులు భిన్నంగా మారిపోయాయి. భూపాలపల్లి ఏరియాలో ప్రస్తుతం5,500 మంది పర్మినెంట్ సింగరేణి ఉద్యోగులు, 2,310 మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. కార్మికుల ఆవాసాల కోసం సింగరేణి సంస్థ నిర్మించిన 4751 క్వార్టర్స్ ఉన్నాయి. భూపాలపల్లి ఏరియా ఏర్పడిన నాటినుండి ప్రస్తుతం పని చేస్తున్న జీఎం సయ్యద్ హబీబ్ హుస్సేన్ 12వ వ్యక్తి.

క్రెచ్ సెంటర్లు ఏర్పాటు చేయాలి



భూపాలపల్లి ఏరియాలో మహిళా ఉద్యోగులు రోజురోజుకు పెరుగుతున్నందున వారి సౌకర్యార్థం యాజ మాన్యం క్రెచ్ సెంటర్లు ఏర్పాటు చేయాలి. పురాతనమైన క్వార్టర్ల మరమ్మత్తులు చేపట్టాలి. కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా యాజమాన్యం పనిచేయాలి.

-మోట పలుకుల రమేష్,
ఏఐటీయూసీ భూపాలపల్లి బ్రాంచ్ కార్యదర్శి

సింగరేణి స్కూల్స్‌ను బలోపేతం చేయాలి



సింగరేణి స్కూల్స్‌ను బలోపేతం చేయాలి, ప్రైవేట్ స్కూల్స్ ఫీజుల భారాన్ని మోయలేక పోతున్నాము. క్యాంటీన్ల ప్రైవేటీకరణ రద్దుచేసి యాజమాన్యమే నిర్వహించాలి.

-రొడ్డ అనిల్, జనరల్ మజ్దూర్

సొంతింటి కల నిజం చేయాలి



ఇన్కమ్ టాక్స్ రద్దుచేసి ఆర్థిక భారాన్ని తగ్గించాలి. కార్మికుల సొంతింటి కలను నిజం చేయాలి.

మెరుగు లక్ష్మీరాజం, జనరల్ మజ్దూర్

ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-గణపురం



మండలలోని చేల్పూర్ గ్రామానికి చెందిన దారకొండ సూర్య తేజ అనారోగ్యంతో మృతి చెందగా మంగళవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరామర్శించారు. మృతుని చిత్రపటానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట నాయకులు గండ్ర సత్యనారాయణ రెడ్డి, కావటి రజిత-రవీందర్, దారకొండ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మహాదేవపూర్‌లో గుడుంబా పట్టివేత

నవతెలంగాణ-మహదేవపూర్

మహాదేవపూర్ గ్రామంలో మంగళవారం సాయంత్రం భారీగా నిషేధిత గుడుంబాను పోలీసులు పట్టుకున్నారు. వివరాళ్లోకెళ్తే... మహాదేవపూర్ గ్రామానికి చెందిన అట్టెం రాజేందర్ అక్రమ లాభార్జన కోసం నిషేధిత గుడుంబాను తన ఇంట్లో అవసరమైన వరకు విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న మహాదేవపూర్ ఎస్సై కె.పవన్ కుమార్ తన సిబ్బంది కిషన్, చంద్రమోహన్, నాగేంద్రప్రసాద్ తో యుక్తంగా అట్టెం రాజేందర్ ఇంట్లో తనిఖీ చేశారు. 20 లీటర్ల నిషేధిత గుడుంబా దొరికింది. వెంటనే దానిని సీజ్ చేసి మహాదేవపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అట్టి గుడుంబా విలువ దాదాపు 8 వేల రూపాయలు వరకు ఉంటుంది. ఇలాంటి అసాంఘిక, చట్ట వ్యతిరేకమైన పనులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హనుమకొండ
బుధవారం | జులై 17, 2024 | www.navatelangana.com

విరబూసిన బ్రహ్మ కమలం పుష్పాలు



నవతెలంగాణ-శాయంపేట

మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన వన ప్రేమికుడు కోమినేని రఘు ఇంటిలో పెంచుతున్న బ్రహ్మకమలం చెట్లు సోమవారం రాత్రి ఏడుపుష్పాలను వికసించాయి. 2006లో రఘుకు మిత్రుడు బ్రహ్మకమలం మొక్కను బహూకరించగా, వాటిని పెంచుతున్నట్లు తెలిపారు. 2016 మొట్టమొదటిసారిగా బ్రహ్మ కమలం పుష్పం వికసించగా, ప్రతి ఏడాది ఒకసారి పుష్పాలను వికసిస్తున్నట్లు తెలిపారు. ఒకేసారి ఏడుపుష్పాలు వికసించడంతో విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో వచ్చి అరుదైన పుష్పాలను తిలకించారు. ఈ పుష్పాలను సాంప్రదాయ వైద్యంలో వినియోగిస్తారని, దీనిని ఆర్చిడ్ కాక్టస్ గా పిలుస్తారని, రాత్రి సమయంలో వికసించే ఈ మొక్కను క్వీన్ ఆఫ్ ది నైట్, నైట్ బ్లూమింగ్ సెరియస్ గా పిలుస్తారని రఘు తెలిపారు.

కార్మెల్ పాఠశాలలో కార్మిల్ డే వేడుకలు



నవతెలంగాణ-ఎల్కతుర్తి

పాలస్తీనాలో కార్మల్ అనే కొండ పైన దేవదూత ప్రత్యక్షమై సైమన్ స్టోక్ కి కనిపించిన జులై 16న కార్మిల్ డే జరుపుతామని ఫాదర్ జాన్ పాల్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో, ఉపాధ్యాయులు సిస్టర్ లిస్సెన్, వినీత, అర్చన, దివ్య మరియా, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కూడా చైర్మన్ ఇనుగాలను కలిసిన సదానందం



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

హనుమకొండ లోని కుడా కార్యాలయంలో బుధవారం రోజున కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా మాజీ ఓడిఎంఎస్ వైస్ చైర్మన్ గోల్కొండ సదానందం కలిశారు. కూడా చైర్మన్ గా పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పూల బోకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారిని శాలువాతో గోల్కొండ సదానందం సన్మానించారు.

ప్రేమ పేరుతో మోసాలకు గురవుతున్న యువతులు

'ఇది కలకాదు' మూవీ డైరెక్టర్ ఆదిబ్ నజీర్

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



నేటి సమాజం లో జరుగుతున్న ప్రేమ పేరు తో మోసాలు, కామాంధుల కొన్ని క్షణాల ఆవేశం ఆరు నెలల పసి కందు లోనైనా వందేళ్లయినా తల్లి లో నైనా వారి కళ్ళకు ఆడతనమే కనిపిస్తుంది తప్ప మరేమి లేదు అన్నారు. మంగళవారం హనుమకొండ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇది కలం కాదు డైరెక్టర్ అది నజీర్ మాట్లాడుతూ స్కూల్ కాలేజీ లలో ప్రేమ పేరు తో ఎన్నో మోసాలకు గురవుతున్న అమ్మాయిలుదానితో హానర్‌కిల్లింగ్ మత ఘర్షణలు దారితీస్తున్నాయని వీటిని అరకట్టాలని నేపథ్యంలో ఓ మంచి కథను అల్లుకొని పరిందా ఆర్ట్స్ ఇంటర్నేషనల్ ఫిల్మ్స్ బ్యానర్ లో అదీబ్ నజీర్ దర్శకత్వం వహించిన చిత్రం ఇది కల కాదు ఈ సినిమా కేవలం సందేశాలే కాకుండా మంచి కామెడీ ఆక్షన్ తో కూడిన చిత్రం. ఇందులో ముఖ్య తారగణం నమిత, షఫీ, దానిక సింగ్, బెనర్జీ, పూజిత జొన్నలగడ్డ, డాక్టర్ శ్రీజ సాధినేని, బూర విద్యాసాగర్,సమీర్, జమా, సోనీ రాజకుమార్, మాహి మహేంద్ర, బాషా, మాన్య భాస్కర్, గులజార్ గౌస్, నరేంద్ర దావడా, ఒక విభిన్న పాత్ర ఘని స్వయంగా పోషించిన డైరెక్టర్ అదీబ్ నజీర్ ఎన్నో కలకారులు నటించిన ఈ సినిమా లో వారి నటన, ఐదు పాటలు డైలాగులు మరువలేనివి.ఈ చిత్రంఇది కల కాదు ఈనెల 19న శుక్రవారం హన్మకొండ శ్రీదేవి ఏసియన్ మాల్ పీవీఆర్ ఎస్ 2 లో విడుదల కానుంది.

బాల్యదశ సమగ్రాభివృద్ధికి అమ్మమాట-అంగన్‌వాడీ బాట













నవతెలంగాణ-దామెర

మూడు నుండి ఐదు సంవత్సరాల పిల్లల సమగ్ర అభివద్ధికి పాటలు వేయడమే అంగన్వాడీ బడిబాట ఉద్దేశమని సెక్టార్ సూపర్వైజర్ రాణి అన్నారు. దామెర మండల కేంద్రంలో పూర్వ బాల్య దశ సమగ్రాభివద్ధికి అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు . ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశము పిల్లల్లో ఆటపాటలతో అక్షరాలు నేర్పించడం గణిత భావనలను నేర్పించడానికి గణిత సంబంధమైన భావనలు పునాదులు వేయాలని జాతీయ నూతన విద్యా విధానం సూచనల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతన పూర్వ పాదమిక విద్యా సంరక్షణ విద్య కోసం అంగన్వాడీ కేంద్రాలను నూతనంగా తీర్చిదిద్దుతూ మూడు నుండి ఐదు సంవత్సరాల పిల్లలకు అంగన్వాడీలలో ఆటపాటలతో విద్యను నేర్పుతూ బలమైన పునాదులు వేయాలని సూచించారు. వారిని బావి భారత పౌరులుగా మారడానికి విద్యతోపాటు నైతికపరమైన అంశాలను మంచి అలవాట్లను పర్యావరణ విద్యను అందించి పాఠశాల పట్ల పిల్లల్లో ఇష్టాన్ని పెంచడం అంగన్వాడీల నూతన పాఠ్య ప్రణాళికలను చేయడం జరిగిందని ప్రతి గ్రామంలో పాఠశాలలకు అనుసంధానంగా అల్లాదకరమైన వాతావరణంలో పౌషకారాన్ని అందిస్తూ పూర్వ ప్రాథమిక విద్య యొక్క ఆవశ్యకతను తల్లిదండ్రులకు వివరిస్తూ పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని వివరిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ జంగం రాణి, అంగన్వాడీ టీచర్స్ పుష్ప, శోభారాణి, వాణి ,రజిత ,జ్యోతి ,వనజ , గౌరీ, సంధ్య, రామ, రేణుక ఆశా కార్యకర్తలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : రెండున్నరేళ్ల దాటిన పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ మంజుల అన్నారు. మండలంలోని ప్రగతిసింగారం గ్రామంలో మంగళవారం అమ్మమాట-అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఓ బత్తిని విశాల, సీఏ బోయిని రమ్య, అంగన్వాడీ టీచర్లు పద్మజ, శ్రీలత, సుజాత, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎన్జీవోస్ కాలనీ : మంగళవారం 48వ డివిజన్ దర్గా మార్కండేయ నగర్ లో అంగన్‌వాడి కేంద్రం పరిధిలో అమ్మమాట అంగన్వాడిబాట కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా దర్గా సెక్టార్ ఐసిడిఎస్ సూపర్వైజర్ కవిత అధ్వర్యంలో ర్యాలి నిర్వహించారు ఈ సందర్భంగా సూపర్ వైజర్ కవిత మాట్లడుతూ పిల్లలని అంగన్వాడీ కేంద్రానికి పంపాలని, కేంద్రంలో ఆటపాటలతో పాటు విద్య బోధన ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు కే. రమదేవి, ఎమ్. కవిత, డి.వాణి, అరుణ, . కవిత, రజిత, సూర్యకళ, కళావతి, మధునాబాయి. ఆయా మాధవి , ఏఎల్ఎమ్ఎస్ సి కమిటి సభ్యులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నడికుడ : జులై 15 నుండి 20వ వరకు జరిగే అమ్మమాట-అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా నడికూడ మండల కేంద్రంలో మంగ ళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు కే శ్రీదేవి, ఏం రాజా రాణి, అంగన్వాడీ టీచర్లు నారగానిఅనిత, డి.సంపూర్ణ, డి.కళావతి, డి.వినోద, బి.హేమలత, జె.సుగుణ, ఎ.భాగ్యలక్ష్మి, గర్భిణీలు, బాలింతలు, కిషోర బాలికలు, మహిళలు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని నమిలిగొండలో 'అమ్మమాట-అంగన్వాడీ బాట' కార్యక్రమం అంగన్‌వాడీ టీచర్ బి.రజితఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయితీ కార్యదర్శి జేసుమణి మాట్లాడుతూ రెండేళ్లు నిండిన పిల్లలను అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని తెలిపారు.ఈ కార్యక్ర మంలో అంగన్వాడీ కార్యకర్తలు బి. రజిత, ఎం.సుజాత, కె. తిరుపతమ్మ పాల్గొన్నారు.

చిల్పూర్ మండలంలో...

అంగన్‌వాడి కేంద్రం ద్వారా అందే సేవల గురించి వివరిస్తూ, మండలంలోని ఫతే పూర్ గ్రామంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్లు మానేపల్లి ఎలీషా, బానోత్ కమల, బట్టు సాలీ, గుగులోత్ కమల, బానోత్ భారతి, కారోబార్ రతన్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి : అంగన్వాడి కేంద్రాల్లోని చిన్నారులకు భరోసా ఉంటుందని అంగన్వాడి కార్యకర్తలు బానోతు మీనా, ధరావత్ సరోజ లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా మంగళ వారం మండలంలోని పెద్ద తండా గ్రామపంచాయతీలో చిన్నారుల తల్లిదండ్రులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు లావుడియా భాస్కర్ నాయక్ తో కలిసి అంగన్వాడి కార్యకర్తలు మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల్లోనే పౌష్టికాహారం లభిస్తుందని తెలిపారు. రెండున్నర సంవత్సరాల వయసు నుండి అంగన్వాడి కేంద్రాలకు పంపించాలని తెలిపారు. అంగన్వాడి కేంద్రంలోని ప్రాథమిక విద్యకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అమ్మ మాట అంగ న్వాడి బాట కార్యక్రమం అనంతరం అక్షరాభ్యాస కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అంగన్వాడి కేంద్రాలకు చిన్నారులను పంపించే విధంగా తల్లిదండ్రులు చొరవ చూపాలని కోరారు. ర్యాలీలో ఆశ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కాటాపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రంజిత్

నవతెలంగాణ-తాడ్వాయి



వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాటాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రంజిత్ అన్నారు. మంగళవారం కాటాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల నర్సాపూర్ (పిఏ) లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జ్వర పీడితుల వద్ద రక్త నమూనాల సేకరించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రంజిత్ మాట్లాడుతూ సకాలంలో సరైన నివారణ చర్యలు తీసుకోకపోతే వర్షాకాలంలో సీజన్ వ్యాధులు వేగంగా వ్యాప్తి చెందుతాయని తెలిపారు. చికెన్ గున్యా డెంగ్యూ మలేరియా వంటి సీజన్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఎక్కువ గా వస్తాయని అశ్రద్ధ చేస్తే ప్రాణాపా సంభవించే అవకాశం ఉందని, ఈ వ్యాధులు ప్రబలకుండా వ్యక్తిగత పరిశాల పరిశుభ్రత పాటించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని సేవించాలన్నారు. మురుగునీరు ఎక్కువ నిల్వ ఉండకుండా శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఈ ఓ సమ్మయ్య, ఎమ్మెల్యే స్పీచ్ ఎండి ఆస్పియా, ఏఎన్ఎం రాజేశ్వరి, చంద్రకళ, హెల్త్ అసిస్టెంట్లు ముత్తయ్య ఆశాలు జయ సుధ, రామ తదితరులు పాల్గొన్నారు.



గిరిజన ఆశ్రమ పాఠశాల వార్డెన్ తక్షణమే సస్పెండ్ చేయాలి

నవతెలంగాణ- పర్వతగిరి

మండలంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల వార్డెన్ వెంటనే సస్పెండ్ చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ - ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ డిమాండ్ చేశారు. పర్వతగిరి మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సరిపడా ఉన్నప్పటికీ బాత్‌రూలకు తలుపులు లేకపోవడం వలన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదేవిధంగా 200 మంది విద్యార్థులకు కేవలం నాలుగు నల్లాలు మాత్రమే ఉండటం చాలా బాధాకరమన్నారు. విద్యార్థులకు పుస్తకాలు ఇప్పటివరకూ ఇవ్వలేదని విద్యార్థులు వాపోయారు. ఈ విషయాలను విద్యార్థులు ప్రిన్సిపాల్ వార్డెన్ దృష్టికి తీసుకెళ్లగా దానిని నిర్లక్ష్యం చేస్తూ విద్యార్థులను పట్టించుకోకపోవడమే కాకుండా నిమ్మకు నీరు ఎత్తనట్లుగా వార్డెన్ వ్యవహరిస్తున్నటువంటి తీరు కనబడుతుందన్నారు. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా చెత్తాచెదారంతో ఉండటం వలన దోమలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం వాన కాలంలో విద్యార్థులు అనారోగ్యాలకు గురయ్యేకాశాలు ఉన్నాయి . విద్యార్థుల సమస్యలను గోడును పట్టించుకోని వార్డెన్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎద్దు రాహుల్ ఎస్ఎఫ్ఐ నాయకులు సతీష్, అఖిల్, నిఖిల్, శివ, కిరణ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి, వరి పంటలపై రైతులు ప్రత్యేక దృష్టి పెట్టాలి

నవతెలంగాణ-పర్వతగిరి



రైతులు పత్తి, వరి పంటలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి డి.ఉష తెలిపారు. వర్ధన్న పేట మండలంలోని రామవరం గ్రామంలో మంగళవారం పంటల నమోదుని తనిఖీ చేశారు. అనంతరం రామవరం, దివిటిపల్లి, వర్ధన్నపేట, దమ్మన్నపేట గ్రామాలలో పంటలని సందర్శించారు. ఈ సందర్శనకు పి.సారంగం, కన్సల్‌టెంట్, జాతీయ ఆహార భద్రత మిషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా, సాగరిక, మండల వ్యవసాయ అధికారి వర్ధన్న పేట కావ్య, వ్యవసాయ విస్తరణ అధికారి,రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు వరి, ప్రత్తి,మొక్కజొన్న పంటలో ప్రస్తుతం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

చిన్న పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

నవతెలంగాణ-కాశిబుగ్గ

మూడు సంవత్సరాల వయసు దాటిన పిల్లలను స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని 37వ డివిజన్ కార్పొరేటర్ బోగి సువర్ణ సురేష్ అన్నారు. అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఖిలా వరంగల్ తూర్పు కోట లో గర్భిణీలు, బాలింతలు, అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన స్థానిక కార్పొరేటర్ బోగి సువర్ణ సురేష్ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పద్మజలు మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలలో మూడు సంవత్సరాల నుండి నర్సరీ, ఎల్‌కే జి, యూకేజీ వరకు చదువు చెప్పే విధంగా ముందుకు తీసుకువచ్చారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఉచితంగా బుక్స్ భోజనం కల్పించి అనేక సాంస్కృతిక పాటలు, కథలు నేర్పిస్తున్నారని అన్నారు. అదేవిధంగా గర్భిణీలకు బాలింతలకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ శోభ, రాజమణి, స్వర్ణలత, వహీదా, రమ ఆశా వర్కర్లు కవిత, రజిత, తదితరులు పాల్గొన్నారు.

పంటలను స్వేచ్ఛగా అమ్ముకునే వెసులుబాటు కల్పించాలి



అదనపు కలెక్టర్ కు రైతు సంఘం విజ్ఞప్తి

నవతెలంగాణ- కాశిబుగ్గ

వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్ లో రైతులు తమ పంటను స్వేచ్ఛగా అమ్ముకునే వెసులుబాటు కల్పించాలని తెలంగాణ రైతు సంఘం నాయకులు జిల్లా అదనపు కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు మంగళవారం తెలంగాణ రైతు సంఘం నాయకులు వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యా రాణిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా రైతు సంఘం జిల్లా కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటను స్వేచ్ఛగా అమ్ముకోవచ్చని ప్రభుత్వాలు అంటున్నాయి కాని వాస్తవానికి ఆ పరిస్థితులు లేవన్నారు. రైతును రాజును చేస్తామని చెప్తున్న రాజకీయ పార్టీల నాయకులు వారి ఓట్లతో అధికారంలోకి వచ్చి కనీసం వారికి భద్రత కల్పించే పరిస్థితి లేదన్నారు. దీనికి ఉదాహరణగా రెండు రోజుల క్రితం వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్ లో ఇద్దరు రైతులను గుమస్తాలు తీవ్ర పదజాలంతో దూషిస్తూ దాడి చేశారని గుర్తు చేశారు. మార్కెట్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే రైతులపై ఇలాంటి దాడులు జరుగుతున్నాయన్నారు. ఈకార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య జిల్లా కమిటీ సభ్యులు సిరుల రవీందర్, జెండా అంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ పేరుతో రైతులకు అన్యాయం చేయొద్దు

వరంగల్ రైతు డిక్లరేషన్ హామీ అమలుపరచాలి

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ చందర్ రావు

నవతెలంగాణ-కాశిబుగ్గ



నిబంధనల పేరుతో రుణమాఫీలో రైతులకు అన్యాయం చేయొద్దని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్ రావు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చందర్ రావు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ముందు వరంగల్ లో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన రైతు డిక్లరేషన్ బహిరంగ సభలో రాహుల్ గాంధీ ప్రకటించిన రూ.2లక్షల రుణమాఫీ రైతాంగాన్ని ఎంతగానో ఆకర్షించిందన్నారు. దీంతో రైతులు, కౌలు రైతులు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి అధికారంలోకి తీసుకువస్తే ఇప్పుడు నిబంధనల పేరుతో కొంతమంది రైతులను రుణమాఫీకి అనర్హులుగా చేయడం మంచి పద్ధతి కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలలో రైతులకు అన్యాయం జరిగే విధంగా ఉందన్నారు. కుటుంబాన్ని గుర్తించడానికి రేషన్ కార్డు ప్రామాణికం అంటే గత పది సంవత్సరాల నుండి వేరుపడిన కుటుంబాలకు రేషన్ కార్డు ఇవ్వలేదని, కొందరు రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు లేనందున బంగారం తాకట్టు పెట్టి పంట రుణాలను తీసుకున్నారని, మరికొంతమంది రైతులు పంట నష్టపోయిన సమయంలో ప్రభుత్వం ఆదేశాలతో బ్యాంకర్లు రైతుల రుణాలను రీ షెడ్యూల్ చేశారన్నారు. ఇప్పుడు ప్రభుత్వం బంగారంపై తీసుకున్న రుణాలు, రీ షెడ్యూల్ చేసిన రుణాలు, వేరుపడ్డ కొత్త రైతుల రుణాలు పరిగణలోకి తీసుకోకపోవడం వల్ల ముఖ్యంగా పోడు, కౌలు రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి నిబంధనలు సవరించాలన్నారు. అందులో ప్రజా పాలనలో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసిన వారి కుటుంబాలను గుర్తించాలని, రీ షెడ్యూల్ చేసిన రుణాలు, బంగారంపై తీసుకున్న రుణాలను కూడా లెక్కించాలన్నారు. అదేవిధంగా కౌలు, పోడు రైతులకు ప్రత్యేక ప్యాకేజీతో కుటుంబానికి రూ.లక్ష తగ్గకుండా ఆర్థిక సాయం అందించాలని చందర్‌రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పోడుభూములకు పట్టాలివ్వాలి

నవతెలంగాణ/వెంకటాపురం



పోడుభూములను నమ్ముకొని వ్యవసాయం చేసుకుంటున్న అధివాసీల కు వెంటనే హక్కు పత్రాలను ఇవ్వాలని కోరుతూ నవనిర్మాణ సేన ఆధ్వర్యంలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహి ంచారు. తొలుత కొమరంభీం విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం చేరుకున్నారు. అనంతరం సుమస్యల తో కూడిన వినతిపత్రం ను తహశీల్దార్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నవనిర్మాణ సేన వ్యవస్థపాక రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి ఏఎన్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కుంజ మహేష్, జిల్లా కార్యదర్శి మడకం రవి, కేక్యం లక్ష్మణ్ రావు, కుంజ బాలకృష్ణ వివిధ గ్రామాల ఆదివాసీలు పాల్గొన్నారు.

90 లీటర్ల నాటు సారా స్వాధీనం

ఇద్దరి అరెస్ట్.. కేసు నమోదు

నవతెలంగాణ- నెక్కొండ



అక్రమంగా నాటుసారాను తయారుచేసి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకొని 90 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు నెక్కొండ ఎస్సై మహేందర్ తెలిపారు. నెక్కొం డలో పెట్రోలింగ్ చేస్తుండగా అక్రమంగా నాటు సారాయి రవాణా చేస్తున్న మండలంలోని టేకులకుంటతండా శివారు ఇంద్య తండాకు చెందిన బానోత్ మంజుల, గుగులోత్ వెంకన్నలు అక్రమంగా గుడుంబాను రవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 90 లీటర్ల నాటు సారాయి స్వాధీన పరుచుకోని, ఇద్దరి పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో మైనర్ బాలిక మృతి

నవతెలంగాణ-పర్వతగిరి

ఓమైనర్ బాలిక మంగళవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం దేవీలాల్ తండాలో చోటు చేసుకుంది. . స్థానికుల కథనం ప్రకారం... తండాకి చెందిన గుగులోతు ఐశ్వర్య(16) ఇంటర్మీడియట్ చదువుతోంది. గత రెండు నెలల క్రితం నారాయణపురం శివారు తండాకు చెందిన ఓ వ్యక్తితో పెళ్లి సంబంధం కుదిరి ఎంగేజ్‌మెంట్ అయింది కాగా ఎంగేజ్‌మెంట్ జరిగిన వ్యక్తి మరో ముగ్గురు యువకులతో కలిసి ఐశ్వర్య ఇంటికి వచ్చి అమ్మాయిని గొంతు పిసికి చంపినట్లు తండావాసులు ఆరోపిస్తున్నారు. కాగా విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఐశ్వర్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజిఎంకు తరలించి, ఎంక్వయిరీ చేస్తున్నట్లు ఎస్సై జి.వెంకన్న నాయక్ తెలిపారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ.. ఒకరు మృతి

నవతెలంగాణ -తాడ్వాయి

ములుగు జిల్లా కేంద్రంలో ప్రధాన రహదారిపై మంగళవారం ద్విచక్ర వాహనాన్ని, మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తాడ్వాయి మండలంలోని మేడారం (రెడ్డిగూడెం) గ్రామానికి చెందిన ఆలకుంట రమేష్ (45) ఉదయం వారి బంధు అయినా పెదనానను ములుగు జిల్లా కేంద్రంలో బ్యాంకు పని ఉండడంతో ద్విచక్ర వాహనంపై ఇద్దరు ములుగు వెళ్లారు. బ్యాంకులో పని సమయం ఉన్నందున భోజనం చేసేందుకు హోటల్‌కు వచ్చి భోజనం చేసి తిరిగి బ్యాంకుకు వెళ్లే క్రమంలో యూటర్న్ వద్ద మరో ద్విచక్ర వాహనం మద్యం సేవించి యువకులు వేగంగా వచ్చి ఢీ కొట్టారు. ఈ క్రమంలో ఆలకుంట రమేష్ రక్తస్రావమై తీవ్రమైన గాయాలతో పడిపోయాడు. ఆయనను ములుగు ఏరియా హాస్పిటల్‌కి తీసుకెళ్లారు. సీరియస్‌గా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మేడారం గ్రామం శోక సముద్రంలో మునిగిపోయింది. కాగా రమేషకు భార్య ఒక కూతురు,ఒక కుమారుడు ఉన్నారు. కూతురుకు వివాహం చేస్తే భర్త చనిపోయి వితంతువై ఇంటి మీదనే ఉంటుంది. రమేష్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని వడ్డెర సంఘం నాయకులు, మేడారం గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

బిజినెస్

కృత్రిమ మేధాపై ఐసిఎఐ దృష్టి

- ఎఐ సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం
- ఐసిఎఐ సిఎ జిపిటి ఆవిష్కరణ
- ఆ సంస్థ ప్రెసిడెంట్ రంజిత్ కుమార్ వెల్లడి



హైదరాబాద్ : కృత్రిమ మేధా (ఎఐ)ను అందిపుచ్చుకోవడంపై కీలక దృష్టి సారించినట్లు ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా (ఐసిఎఐ) వెల్లడించింది. మంగళవారం హైదరాబాద్‌లో ఐసిఎఐ రెండు రోజుల ఎఐ ఇన్నోవేషన్ సమ్మిట్-ఎఐఎస్ 2024 ప్రారంభమైంది. ఇందులో ప్రపంచ ఎఐ నిపుణులచే ప్యానెల్ చర్చలను ఏర్పాటు చేసింది. జులై 16, 17 తేదిల్లో 'ట్రాన్స్‌ఫార్మింగ్ అకౌంటింగ్, ఆడిట్, టాక్స్, గవర్నెన్స్' అనే నినాదంతో దీన్ని నిర్వహిస్తుంది. ఆయా రంగాలలో ఎఐ ఆవిష్కరణలు, అనివార్యం గురించి నిపుణులు చర్చించారు.

ఐసిఎఐ ప్రెసిడెంట్ రంజిత్ కుమార్ అగర్వాల్ సమ్మిట్‌ను ప్రారంభించి మాట్లాడుతూ.. సిఎ విద్యార్థుల కోసం జులై ఒక్కటో తేదిన ఐసిఎఐ సిఎ చాట్ జిపిటిని అందుబాటులోకి తెచ్చామన్నారు. దీన్ని తమ 9.85 లక్షల విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నామన్నారు. తమ సభ్యుల కోసం ప్రత్యేకంగా సర్టిఫికెట్ కోర్సు ఆన్ ఎఐని కూడా ప్రవేశపెట్టామన్నారు. ఇది ఎఐపై ప్రాథమిక అవగాహనను పెంచడానికి దోహదం చేస్తుందన్నారు. సాంకేతిక నైపుణ్యాలను పెంచడం ఈ కోర్సు ప్రధాన లక్ష్యమన్నారు.

కేంద్ర ఎలక్ట్రానిక్స్ మంత్రిత్వ శాఖతో కలిసి అకౌంటెన్సీ ఫిర్యాదుల పరిష్కారానికి ఆడిట్ టూల్‌ను అందుబాటులోకి తేనున్నామన్నారు. ఇది సమస్యల పరిష్కారానికి, మోసాలను గుర్తించడానికి మద్దతు చేస్తుందన్నారు. ఇది చార్టర్డ్ ఎకౌంట్స్ సభ్యుల బాధ్యతను మరింత పెంచనుందన్నారు. ఐసిఎఐ వైస్ ప్రెసిడెంట్ చరన్‌జోత్ సింగ్ నందా మాట్లాడుతూ.. టెక్నాలజీ ఇంటిగ్రేషన్‌లో ఐసిఎఐ ముందంజలో ఉందన్నారు. ముఖ్యంగా ఎఐని స్వీకరించడం, అమలు చేయడంపై ప్రధాన దృష్టి సారించామన్నారు. ప్రస్తుతం దేశంలో 60 శాతం కంపెనీలు ఎఐని అందిపుచ్చుకుంటున్నాయన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడంలో తాము నిబద్దతో ఉన్నామన్నారు. ఈ సమావేశంలో ఎఐ ఇన్ ఐసిఎఐ చైర్మన్ దయానివాస్ శర్మ, వైస్ చైర్మన్ ఉమేష్ శర్మ సహా ఐసిఎఐ సెంట్రల్, రీజినల్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు

సికింద్రాబాద్‌లో వెట్ కేర్ సేవలను పరిచయం చేసిన జిగ్లీ



నవతెలంగాణ - హైదరాబాద్

భారతదేశపు మొట్టమొదటి టెక్-ఎనేబుల్డ్ ఓమ్నిచానెల్ పెట్ కేర్ బ్రాండ్, జిగ్లీ సికింద్రాబాద్‌లోని తన ఎక్స్పీరియన్స్ సెంటర్ లో వెట్ కేర్ సేవలను పరిచయం చేసింది. ఇది భారతదేశంలో సరసమైన మరియు ప్రామాణిక పెంపుడు జంతువుల సంరక్షణ సౌకర్యాల కోసం పెరుగుతున్న డిమాండ్‌ను కూడా తీర్చగలదు. పెంపుడు జంతువుల ఆరోగ్యం మరియు సంరక్షణపై పెరిగిన అవగాహన కారణంగా పెంపుడు జంతువుల సంఖ్య ఇప్పుడు 20 మిలియన్లను దాటింది. అయినప్పటికీ, భారతదేశంలోని 70% పెంపుడు జంతువులకు ఇప్పటికీ సాధారణ పశువైద్య సంరక్షణ అందుబాటులో లేదు, కేవలం 10% మాత్రమే నివారణ ఆరోగ్య సంరక్షణను పొందుతున్నాయి. పెంపుడు జంతువుకు మెరుగైన వైద్య సహాయం అవసరమైనప్పుడు అత్యవసర వెట్ యాక్సెస్ లేకపోవడం తీవ్రమైన సమస్యలకు దారి తీస్తుంది. ఇది దృష్టిలో పెట్టుకుని పెంపుడు జంతువులకు వేగవంతమైన వైద్య సంరక్షణను అందించడంలో సహాయపడటానికి, జిగ్లీ యొక్క నాణ్యమైన వెట్ సేవలు తమ అనుభవ కేంద్రాల వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకువచ్చింది. వెట్ కేర్ సర్వీస్ ప్రారంభించిన సందర్భంగా జిగ్లీ సికింద్రాబాద్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లోని వెటర్నరీ కన్సల్టెంట్ డాక్టర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, "మన పెట్ ఫ్రెండ్స్ 24/7 సురక్షితంగా ఉండేలా వెట్ కేర్ సేవలు చాలా కీలకం. ఈ విస్తరణతో మేము ఇప్పుడు ఒకే చోట సంపూర్ణ సంరక్షణ (పోషకాహారం, వస్త్రధారణ, వైద్య మద్దతు) అందించడానికి సిద్ధంగా ఉన్నాము. ఈ విస్తరణ, పెంపుడు జంతువులకు ఉత్తమమైన ఆరోగ్యం మరియు ఆనందాన్ని అందించడంలో సహాయపడుతుందని మేము నమ్ముతున్నాము" అని అన్నారు.

పంట బీమాకు విప్లవాత్మక సామర్థ్యాన్ని తీసుకువస్తోన్న క్షేమ

నవతెలంగాణ : క్షేమ జనరల్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ తమ యాజమాన్య క్షేమ ప్లాట్‌ఫారమ్ కు నవీకరించబడిన వెర్షన్ ను అందిస్తోంది. తద్వారా ఈ ఖరీఫ్ సీజన్ కోసం తమ పంట బీమా ఉత్పత్తి అయిన 'సుకృతి'ని కొనుగోలు చేసే ప్రక్రియను మరింత సులభతరం చేస్తుంది 'ప్రకృతి'తో పాటు. ఈ ఆధునీకరణలు మరింత సామర్థ్యాన్ని తీసుకురావటంతో పాటుగా తమ ఖరీఫ్ పంటను ప్రమాదాల నుండి రక్షించుకోవాలని చూస్తున్న భారతదేశంలోని కోట్లాది మంది రైతులకు సేవా డెలివరీని మెరుగుపరుస్తాయి. ఈ ఖరీఫ్ లో పంట భీమా ప్రీమియం ఎకరానికి రెండు ప్రమాదాల వరకు సరసమైన ప్రారంభ ధర రూ.499/-గా ఉంటుంది.

రేపటినుంచి డీఎస్సీ రాతపరీక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ) రాతపరీక్షలు గురువారం నుంచి ప్రారంభమవుతాయి. వచ్చేనెల ఐదో తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా కంప్యూటర్ ఆధారిత విధానం (సీబీఆర్టీ)లో పాఠశాల విద్యాశాఖ నిర్వహిస్తుంది. ఈ పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మొదటి సారిగా డీఎస్సీ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. డీఎస్సీ రాతపరీక్షల నిర్వహణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 56 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. www.schooledu.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా డీఎస్సీకి దరఖాస్తు చేసిన అభ్యర్థులు ఈనెల 11 నుంచి డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు సుమారు 2.50 లక్షల మంది అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు. డీఎస్సీకి 2,79,957 దరఖాస్తులొచ్చిన విషయం తెలిసిందే. ఇంకా డౌన్‌లోడ్ చేసుకోని అభ్యర్థులు వెంటనే చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. గురువారం నుంచి వచ్చేనెల ఐదో తేదీ వరకు రోజూ రెండు విడతల్లో రాతపరీక్షలను నిర్వహిస్తారు. మొదటి విడత ఉదయం తొమ్మిది నుంచి 11.30 (స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ మినహా) గంటల వరకు జరుగుతుంది. రెండో విడత మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 (స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ మినహా) గంటల వరకు నిర్వహిస్తారు. మొదటి విడతకు ఉదయం 7.30 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతి ఉంటుంది. ఉదయం 8.45 గంటలకు గేట్లను మూసేస్తారు. రెండో విడతకు మధ్యాహ్నం 12.30 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతి ఉంటుంది. మధ్యాహ్నం 1.45 గంటలకు గేట్లను మూసేస్తారు. పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందే గేట్లను మూసేస్తామని అధికారులు స్పష్టం చేశారు. మొదటి విడతలో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో విడతలో మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉంటుంది. డీఎస్సీ అభ్యర్థులకు బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తారు. అందుకే పరీక్ష ప్రారంభానికి గంటన్నర ముందు నుంచే అభ్యర్థులకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఉంటుంది. అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు ఫొటో గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలని అధికారులు సూచించారు. కాలిక్యులేటర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, లాగరిథమ్ టేబుళ్లు, పేజర్లు, సెల్‌ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను పరీక్షా కేంద్రాల్లోకి తెచ్చుకోవడం నిషేధమని స్పష్టం చేశారు.

బొగ్గు వినియోగదారులతో సమన్వయానికి ప్రత్యేక సెల్

- ఇతర కంపెనీలతో పోలిస్తే ఎన్నో వెసులుబాట్లు
- వినియోగదారుల సూచనలపై తక్షణ చర్యలు : ఈ-వేలం వినియోగదారుల సమావేశంలో సింగరేణి చైర్మెన్, ఎమ్‌డీ ఎన్.బలరామ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వినియోగదారుల పట్ల స్నేహపూరితంగా ఉంటామనీ, వారిని ప్రగతి భాగస్వాములుగా గుర్తిస్తూ ప్రత్యేక సమన్వయసెల్‌ను ఏర్పాటు చేస్తున్నామని సింగరేణి సంస్థ చైర్మెన్, ఎమ్‌డీ ఎన్.బలరామ్ ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఈ వేలం వినియోగదారులు, వ్యాపారుల సమావేశం జరిగింది. అందులో 80 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారి నుంచి పలు సూచనలను సీఎమ్‌డీ స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఈ-వేలం వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక సెల్ దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలోని ఏ ఇతర బొగ్గు సంస్థల్లోనూ లేనివిధంగా సింగరేణిలో ఈ-వేలం వినియోగదారులకు అనేక వెసులుబాట్లను కల్పించామన్నారు. కోలిండియాలో ఈవేలం సేల్ ఆర్డర్ కాలపరిమితి 45 రోజులే ఉండగా సింగరేణిలో 90 రోజులుందని చెప్పారు. వినియోగదారులెవరైనా సమంజసమైన కారణాలు చూపితే దాన్ని మరో 90 రోజులు పెంచే వెసులుబాటును కల్పించామన్నారు. ఈ-వేలం తర్వాత పూర్తి సొమ్ము చెల్లించడానికి ఇతర సంస్థల్లో 13 రోజుల కాలపరిమితి ఉండగా తమ సంస్థలో 27 పనిదినాలుగా నిర్ణయించామని తెలిపారు. ఈ-వేలం వినియోగదారులు సేల్ ఆర్డర్‌ను ఆన్‌లైన్‌లో రద్దు చేసుకున్నా అంగీకరిస్తామనీ, వెంటనే డిపాజిట్‌ను వెనక్కి తిరిగి ఇచ్చేస్తున్నామని చెప్పారు. ఇతర సంస్థల్లో విద్యుత్తేతర వినియోగదారులకు రిజర్వ్ ప్రైస్ 20 శాతముండగా తమ సంస్థలో అది ఐదు శాతమే ఉందన్నారు. సింగరేణి సంస్థ ద్వారా ఎస్ఏపీ ద్వారా లావాదేవీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వినియోగదారులు తమ ఇంటి వద్ద నుంచే సేల్ ఆర్డర్లు పొందడం, సొమ్ము చెల్లించడం, బొగ్గు పొందటం వంటివి చాలా సులువుగా సింగిల్ విండో పద్ధతిలో చేసుకునే అవకాశం ఉందని వివరించారు. తమ సంస్థ ఏటా ఉత్పత్తి చేస్తున్న 700 లక్షల టన్నుల బొగ్గులో ఎక్కువ శాతం థర్మల్ విద్యుత్ కేంద్రాలకు వెళ్తున్నదని తెలిపారు. మిగిలిన దానిలో ప్రధానంగా సిమెంటు, స్పాంజ్ ఐరన్, ఎరువులు, మందులు, పేపర్, సిరామిక్స్ వంటి కర్మాగారాలకు సరఫరా చేస్తున్నామని వివరించారు. ఈ వేలం ప్రక్రియ ద్వారా ఏటా సగటున 25 లక్షల టన్నుల బొగ్గును అమ్ముతున్నామని చెప్పారు. సమావేశంలో సింగరేణి జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) జి.దేవేందర్, అడిషనల్ జనరల్ మేనేజర్ ఎన్.వి.రాజశేఖర్‌రావు, డిప్యూటీ జనరల్ మేనేజర్ రవివాస్తవ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు భూ హక్కును పరిశీలిస్తాం : మంత్రి సీతక్క

- సాగు భూమి రిజిస్ట్రేషన్ చార్జిలో వారికి 50 శాతం రాయితీనివ్వండి
- మంత్రి సీతక్కను కలిసి మహిళా రైతు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధుల వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహిళలు భూ యజమానులయ్యేలా ప్రోత్సహించేందుకుగానూ వారికి సాగు భూమి రిజిస్ట్రేషన్, మ్యూటేషన్, స్టాంప్ డ్యూటీ చార్జీల్లో 50 రాయితీ ఇచ్చే అంశాన్ని తమ ప్రభుత్వం పరిశీలిస్తున్నదని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) స్పష్టం చేశారు. మహిళా సాధికారత కోసం ఇప్పటికే పలు పథకాలను అమలు చేస్తున్నట్టు వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మహిళా రైతుల హక్కుల కోసం పనిచేసే 'మహిళా కిసాన్ అధికార్ మంచ్' ప్రతినిధులు డాక్టర్ ఉషా సీతా, సీతా మహాలక్ష్మి, డాక్టర్ వి రుక్మిణి రావు, ఎస్.ఆశాలత తదితరులు మంత్రి సీతక్కతో భేటీ అయ్యారు. మహిళలకు భూయాజమాన్య హక్కుల అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'దేశ వ్యవసాయ రంగంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నా వారి చేతిలో భూములు పెద్దగా లేవు. తెలంగాణ వ్యవసాయంలో 50 శాతం మేర మహిళలకు భాగస్వామ్యం ఉంది. కానీ, వారి చేతిలో 22 శాతం భూములు మాత్రమే ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. భూమి అనేది కేవలం ఆర్థిక వనరే కాదు. భూమి అంటే ఆత్మ గౌరవం, సమాజంలో హోదా. భూమి అంటే అధికారం. అంతటి ప్రాధాన్యత ఉన్న భూమిపై మహిళలకు యాజమాన్య హక్కులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం' అని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. అయితే పదెకరాల వరకే రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలన్న డిమాండ్ ఊపందుకున్న నేపథ్యంలో కుటుంబ సభ్యుల మధ్య భూ పంపకాలు జరిగే అవకాశాలున్నాయని 'మకాం' ప్రతినిధులు మంత్రి సీతక్కకి వివరించారు. సాగు భూమి రిజిస్ట్రేషన్ల చార్జిలో 50 శాతం రాయితీలు ఇస్తూ విధానపరమైన నిర్ణయం తీసుకునే అంశంపై క్యాబినెట్‌లో చర్చిస్తామని హామీనిచ్చారు.

మాకంటే వారే ఎక్కువా?

- ఓడిపోయినోళ్లకే ప్రాధాన్యతనిస్తున్నారు : 'ప్రొటోకాల్'పై స్పీకర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిర్యాదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజా ప్రతినిధులమైన తమకంటే ఎక్కువగా కాంగ్రెస్ నేతలకే, అదీ తమ చేతిలో ఓడిపోయిన వారికే అధికారులు ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాల్లో ప్రొటోకాల్ నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారని వారు వాపోయారు. ఈ మేరకు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, పద్మారావు గౌడ్ తదితరులు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో వారు విలేకర్లతో మాట్లాడుతూ...తమ చేతిలో ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థులు ఆ పార్టీ కండువాలను వేసుకుని మరీ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని తెలిపారు.

దీనిపై అధికారులకు ఫిర్యాదు చేస్తే 'సర్దుకుపోవాలి' అంటూ సూచిస్తున్నారని అన్నారు. ఇదేం పద్ధతంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాపాలన, ఇందిరమ్మ రాజ్యమంటే ఇదేనా..? అని ప్రశ్నించారు. ఈ విషయంలో తమ హక్కులను కాపాడాలంటూ స్పీకర్‌కు విజ్ఞప్తి చేశామని అన్నారు. ఒకవేళ ఆయన పట్టించుకోకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామంటూ హెచ్చరించారు.

ఎప్పుడైనా ప్రోటోకాల్ పాటించారా?

- ఓడిపోయిన ఎమ్మెల్యేతో శంకుస్థాపన చేయించలేదా?
- గులాబీ నేతలకు దానిపై మాట్లాడే అర్హత ఉందా? : టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి ప్రశ్న



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రేవంత్‌రెడ్డి మల్కాజిగిరి ఎంపీగా ఉన్న సమయంలో ఎప్పుడైనా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రోటోకాల్ పాటించిందా? అని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి కేటీఆర్, హరీశ్‌రావును ప్రశ్నించారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్ ఎమ్మెల్యేలుగా ఉన్నప్పుడు వారిని అసెంబ్లీకి రాకుండా కుట్ర చేసినప్పుడు ప్రోటోకాల్ గుర్తుకు రాలేదా? అని నిలదీశారు. సంగారెడ్డిలో తనపై ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యేతో శంకుస్థాపనలు చేయించలేదా? వీటన్నింటికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రేవంత్ విషయంలో ప్రోటోకాల్ పాటించని బీఆర్ఎస్ నేతలకు దానిపై మాట్లాడే అర్హత ఉందా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డికి ఇవ్వాల్సిన గౌరవమిచ్చామనీ, గౌరవం దక్కనప్పుడు అధికారులను అడగాలని సూచించారు. మర్యాద లోపముంటే తప్పు పట్టాలని కోరారు. ఎంపీ ఈటల రాజేందర్ మల్కాజిగిరిలో ప్రభుత్వ కార్యక్రమానికి వెళ్లకుండా ప్రభుత్వంపై బురదజల్లేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రోటోకాల్ లేకుండా కొంత మంది బీఆర్ఎస్ నేతలు బతకలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒత్తిడి లేకుండా పని చేస్తున్నామంటూ సెక్రటేరియట్ ఉద్యోగులు చెబుతున్నారని గుర్తు చేశారు. పదేండ్లలో బీఆర్ఎస్ సర్కారు ఒక్క రేషన్ కార్డైనా ఇచ్చారా? అని ప్రశ్నించారు. 'కాంగ్రెస్ వచ్చాకే రేషన్ కార్డులు ఇస్తున్నది. పార్టీలు మారడం కామన్. ఇది సీరియస్ మ్యాటర్ కాదు. ఎమ్మెల్యేలు పార్టీ మారడాన్ని ప్రజలు కూడా సీరియస్‌గా తీసుకోవడం లేదు. పార్టీ మార్పుపై మాట్లాడటం అవసరమే లేదు. పదేండ్ల అనుభవంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ అ,ఆ లు కూడా నేర్చుకోలేకపోయారు' అని గుర్తు చేశారు. పదేండ్లలో అధికార, ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కేసీఆర్ అపాయింట్‌మెంట్ ఇచ్చారా? అని ప్రశ్నించారు.

కండక్టర్ నిజాయితీ అభినందించిన అధికారులు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ బస్సు కండక్టర్ నిజాయితీ చాటుకున్నారు. తోటి ప్రయాణీకురాలు కూడా తనకు దొరికిన పర్సును నిజాయితీగా కండక్టర్‌కు అప్పగించి మంచి గుణాన్ని చాటింది. ఈనెల 13వ తేదీ మియాపూర్-2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణీకురాలు పర్సు మర్చిపోయి దిగి వెళ్లిపోయింది. ఇది గమనించిన తోటి ప్రయాణీకురాలు మరొకరు ఆ పర్సును బస్సు కండక్టర్ రమేష్ (ఈ-213445)కు అప్పగించారు. ఆయన దాన్ని డిపో మేనేజర్‌కు అందచేశారు. ఆ పర్సులో నాలుగు తులాల బంగారు ఆభరణాలు, ఆధార్ కార్డు, పట్టా పాస్‌బుక్ ఉన్నాయి. మంగళవారం పర్సు పోగొట్టుకున్న ప్రయాణీకురాలిని డిపోకు రప్పించి, ఆ పర్సును అందచేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ కండక్టర్ రమేష్‌తో పాటు పర్సును అందచేసిన తోటి ప్రయాణీకురాలిని కూడా డిపోకు పిలిపించి, సన్మానించారు. ఈ సందర్భంగా పర్సు పోగొట్టుకున్న ప్రయాణీకురాలు ఆర్టీసీ సిబ్బందికీ, తోటి ప్రయాణీకురాలికి కృతజ్ఞతలు తెలిపారు.

ఫెరిఫెరియల్ డాక్టర్లకు న్యాయం చేయాలి

- తెలంగాణ ప్రభుత్వ బోధనా వైద్యుల సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫెరిఫెరియల్ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న డాక్టర్లకు బదిలీల్లో న్యాయం చేయాలని తెలంగాణ ప్రభుత్వ బోధనా వైద్యుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఆ సంఘం సెక్రెటరీ జనరల్ డాక్టర్ కిరణ్ మాదాల ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వైద్యవిద్య సంచాలకుల పరిధిలో స్టేట్ క్యాడర్ పోస్టులు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో జీవో నెంబర్ 80ను అమలు చేసే క్రమంలో ఈ విభాగంలో ఉన్న వైవిధ్యతను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. దీర్ఘకాలంగా ఫెరిఫెరియల్ మెడికల్ కాలేజీల్లో పనిచేసే వారికి ఉపయోగపడే విదంగా కొత్త మార్గదర్శకాలు రూపొందించుకునే అవకాశాన్ని ప్రభుత్వం శాఖాపరమైన కమిటీకి అప్పగించిందని గుర్తుచేశారు. కమిటి విచక్షణ అధికారాన్ని ఉపయోగించి న్యాయం చేయొచ్చని స్పష్టం చేశారు. అయితే వారం గడుస్తున్నా ఉన్నతాధికారులు విధివిధానాలపై స్పష్టత ఇవ్వకుండా ఆర్డర్లు నేరుగా ఇస్తాం అంటున్నారు. ఇది ఎంత వరకు న్యాయం? అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికే ఫెరిఫెరియల్ కాలేజీల్లో పని చేసే వారికి న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేకపోతే డాక్టర్లు కొత్త వైద్య కళాశాలలకు ఎలా వెళతారని ప్రశ్నించారు. యూనియన్ నాయకుల గోడును ఉన్నతాధికారులు వినడానికి ఇష్టపడటం లేదని విమర్శించారు. దీంతో నాలుగేండ్లుగా ఇలాంటి కళాశాలల్లో పని చేసే వారిలో 80 మంది డాక్టర్లలో కనీసం ఐదుగురికి కూడా న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదని తెలిపారు. ఉన్నతాధికారుల తీరుతో 40 శాతంతో ఎవరికి లాభం? అని ఆయన ప్రశ్నించారు.

సీఎం ఏకాదశి శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తొలి ఏకాదశి (జులై 17) పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆషాఢంలో వచ్చే ఏకాదశిని తెలంగాణ ప్రజలందరూ ఏడాదిలో వచ్చే పండుగలకు ఇదే మొదటి పండుగగా జరుపుకుంటారని ముఖ్యమంత్రి తెలిపారు. తొలి ఏకాదశి రాష్ట్ర ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు, సకల శుభాలు కలిగించాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రార్థించారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.రెండు లక్షల రైతుల రుణమాఫీకి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రైతు కుటుంబాలన్నీ రుణ విముక్తి పొందాలనీ, ఏకాదశి పండుగను ప్రతి ఇంటా ఆనందంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి తన ఆకాంక్షను వ్యక్తం చేశారు.

ప్రజావాణికి 535 దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 535 దరఖాస్తులు అందాయని నోడల్ అధికారి దివ్య తెలిపారు. రెవెన్యూ సమస్యలకు సంబంధించి 116, పౌరసరఫరాల శాఖకు సంబంధించి 88, విద్యుత్ శాఖకు సంబంధించి 62, హౌజింగ్‌కు సంబంధించి 57 దరఖాస్తులు, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 36, ఇతర శాఖలకు సంబంధించి 176 దరఖాస్తులు అందినట్టు పేర్కొన్నారు.

సీఎం రేవంత్‌ను కలిసిన ఛత్తీస్‌గడ్ మాజీ సీఎం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీఎం రేవంత్‌రెడ్డిని మంగళవారం సచివాలయంలో ఛత్తీస్‌గడ్ మాజీ ముఖ్యమంత్రి ఛత్తీస్ ఘడ్ మాజీ ముఖ్యమంత్రి భూపేష్ భగేల్ మర్యాదపూర్వకంగా కలిశారు.

పదేండ్ల నిరీక్షణ ఫలితమే రుణమాఫీ

- చనగాని దయాకర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఏకకాలంలో రుణమాఫీ కోసం రైతులు పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో నిరీక్షించారనీ, ఈనాడికి అది నెరవేరబోతున్నదని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ తెలిపారు. ఈమేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రైతు రుణమాఫీ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని క్యాబినెట్ తీసుకున్న రుణమాఫీ నిర్ణయాన్ని రైతులు ఎన్నటికీ మర్చిపోలేరని ఆకాంక్షించారు. రైతన్న సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం గొప్ప కార్యం చేపట్టడం అసాధారణ విషయమేనని పేర్కొన్నారు. రైతుల కష్టాలకు చలించి అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ అమలు చేస్తున్నారని తెలిపారు. వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో ఇచ్చిన హామీమేరకు రుణమాఫీ అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. పదేండ్లుగా కేసీఆర్ నాలుగు దశల్లో రూ.28వేలు కోట్లు మాత్రమే చేశారని గుర్తు చేశారు. రుణమాఫీ విషయంలో బీజేపీ కూడా ప్రభుత్వంపై ఎన్నో విమర్శలు చేసిందనీ, ఇప్పుడు ముఖాలు ఎక్కడ పెట్టుకుంటారని ప్రశ్నించారు. రేషన్ కార్డు ఉంటేనే రైతు రుణమాఫీ అనేది తప్పుడు సమాచారమనీ, ఆ కుటుంబాన్ని పరిగణించడం కోసమేనని పేర్కొన్నారు.

మహిళలకు సురక్షిత ప్రయాణం కల్పిస్తాం

- టీజీఎస్ఆర్టీసీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహిళలకు సురక్షిత ప్రయాణం కల్పిస్తామంటూ ఆర్టీసీ యాజమాన్యం తెలిపింది. ఫరుఖ్‌నగర్ డిపోనకు చెందిన ఓ కండక్టర్ ప్రయాణ సమయంలో తనతో ప్రవర్తించిన తీరు సరిగా లేదని ఒక యువతి సోషల్ మీడియా ద్వారా టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చింది. ఈ ఘటనపై తక్షణమే సమగ్ర విచారణకు ఆదేశించినట్టు ఆ సంస్థ యాజమాన్యం తెలిపింది. విచారణ నివేదిక ఆధారంగా బాధ్యులపై శాఖపరమైన సంస్థ చర్యలను తీసుకుంటుందని పేర్కొన్నది. టీజీఎస్ఆర్టీసీ మహిళా భద్రత విషయంలో ఏమాత్రం రాజీపడటం లేదని పేర్కొన్నది. ప్రతి రోజూ సగటున 35 లక్షల మందికి పైగా మహిళలకు సురక్షితమైన ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తోందని తెలిపింది.

గాంధీభవన్‌లో ఆషాడం బోనాలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం గాంధీభవన్‌లో మహిళా కాంగ్రెస్ బోనాల పండుగను నిర్వహించారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు సునీతారావు నేతృత్వంలో నిర్వహించిన ఆషాడం బోనాల పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. గాంధీభవన్ నుంచి భూ లక్ష్మమ్మ గుడి వరకు పెద్ద ఎత్తున డప్పు, వాయిద్యాల మధ్య శివశత్తులతో వెళ్లి బోనాన్ని సమర్పించారు. అన్ని జిల్లాల నుంచి పెద్ద ఎత్తున మహిళా కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా సునీతారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, పాడిపంటలతో అష్టైశ్వర్యాలతో తులతూగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మహిళలకు పెద్దపీట వేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ల చైర్మెన్లు బండ్రు శోభారాణి, కల్వ సుజాత, అధికార ప్రతినిధులు భవానీ రెడ్డి, ఇందిరా, మహిళా కాంగ్రెస్ ఇన్‌చార్జి కోఆర్డినేటర్ నీలం పద్మ, ఉపాధ్యక్షులు సదాలక్ష్మి, అధికార ప్రతినిధులు, ఆయా జిల్లాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ఎస్ దరఖాస్తు గడువు ఆగస్టు 31

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం (ఎన్ఎంఎంఎస్ఎస్)కు 2024-25 విద్యాసంవత్సరంలో ఎంపికైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునే గడువు వచ్చేనెల 31వ తేదీ వరకు ఉన్నది. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ (ఎన్ఎస్‌పీ) ద్వారా దరఖాస్తుల పునరుద్ధరణ, ఆన్‌లైన్‌లో దరఖాస్తులను అప్‌లోడ్ చేసే గడువు వచ్చేనెల 31 వరకు ఉందని తెలిపారు. సకాలంలో దరఖాస్తు చేసేలా విద్యార్థులకు వివరించాలని సంబంధిత విద్యాసంస్థల యాజమాన్యాలను కోరారు. విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు https://scholorships.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

పీబీ పార్ట్‌నర్స్ 3 సంవత్సరాల ఆఫ్‌లైన్ సేవల వేడుక

నవతెలంగాణ-హైదరాబాద్ : పాలసీబజార్ పీఓఎస్‌పీ (PoSP) విభాగం పీబీ పార్ట్‌నర్స్, గత 3 ఏళ్లుగా అంకితమైన ఆఫ్‌లైన్ సేవలతో ఏజెంట్ భాగస్వాములు మరియు వినియోగదారుల జీవితాలపై తన ప్రభావాన్ని ప్రతిబింబిస్తూ, 3వ వార్షికోత్సవాన్ని సగర్వంగా ఆచరించుకుంటోంది. పీబీ పార్ట్‌నర్స్ గత 3 ఏళ్లలో గణనీయ మైలురాళ్లను నెలకొల్పింది. తన 1.2 లక్షల మంది సర్టిఫైడ్ భాగస్వాములతో బలమైన నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుని, 18,000ం పిన్ కోడ్‌లకు సేవలు అందిస్తూ, దేశవ్యాప్తంగా 1,200ం నగరాల్లో పని చేస్తోంది. పాలసీ జారీ నుంచి క్లెయిమ్ సెటిల్‌మెంట్ వరకు అంతరాయం లేని ఆఫ్‌లైన్ సేవల అందుబాటును ఈ నెట్‌వర్క్ నిర్ధారిస్తుంది. ముఖ్యంగా టైర్-2 మరియు టైర్-3 నగరాల్లో గణనీయమైన వ్యాపార వృద్ధిని పెంచుతూ, బీమా కవరేజీని విస్తరిస్తుంది.

ప్రభుత్వానికి ధన్యవాదాలు

- తెలంగాణ నర్సెస్ అసోసియేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సహజ ప్రసవాలను చేయడంలో ప్రతిభ కనబరిచిన నర్సింగ్ ఆఫీసర్లకు ప్రోత్సాహకం విడుదల చేసినందుకు తెలంగాణ (ప్రభుత్వ) నర్సెస్ అసోసియేషన్ ధన్యవాదాలు తెలిపింది. ఈ మేరకు మంగళవారం అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ లక్ష్మణ్ రుఢావత్ ఒక ప్రకటన విడుదల చేశారు. నర్సింగ్ ఆఫీసర్లను ఈ దిశగా ప్రోత్సహిస్తున్నందుకు సీఎం రేవంత్ రెడ్డికి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు.